www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 30-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 75 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్ల పక్షం తిథి: పంచమి ఉ.9.24 తదుపరి షష్ఠి, నక్షత్రం: మఖ ఉ.7.21 తదుపరి పుబ్బ, వర్జ్యం: మ.3.52-5.34, దుర్ముహూర్తం: మ.12.44-1.37, మ.3.21-4.13, అమృతఘడియలు: రా.2.05-3.47, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్నాథ రథయాత్రలో విషాదం

గుడించా ఆలయం వద్ద తొక్కిసలాట

ముగ్గురి మృతి, 50 మందికి గాయాలు 2

ఆరుగురి పరిస్థితి విషమం: కలెక్టర్

భక్తులకు క్షమాపణలు చెప్పిన ఒడిసా సీఎం

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు



పూరీలోని ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు



ఫుట్‌బాల్ ఆడేస్తున్న రోబోలు

చైనాలో ఏఐ ఆధారిత మరమనుషులతో ప్రత్యేక మ్యాచ్ 2

కాంతిని గడ్డ కట్టించారు!



ఘనపదార్థంలా కనపడుతూనే ద్రవలక్షణాలుండే సూపర్‌సాలిడ్‌లా మార్చిన ఇటలీ శాస్త్రజ్ఞులు

క్వాంటం కంప్యూటర్లు, ఆప్టికల్ ప్రాసెసర్ల అభివృద్ధికి, వేగవంతమైన సమాచార వ్యవస్థల్లో కీలకం 2

2

ఆన్‌లైన్‌లో ఆర్డరిస్తే.. ఇంటికే నడిచొచ్చింది



అమెరికాలో ఫ్యాక్టరీ నుంచి నేరుగా యజమాని ఇంటికి సెల్ఫ్ డ్రైవింగ్‌తో వెళ్లిన టెస్లా కారు

బీఆర్ఎస్ పోయినా.. అవినీతి పోలేదు

కాంగ్రెస్ పాలనలోనూ కొనసాగుతోంది

తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్న ఢిల్లీ కాంగ్రెస్

రాష్ట్రంలో బీజేపీ సర్కారు వస్తేనే అవినీతి అంతం

ప్రధాని మోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

పసుపు బోర్డును నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేశారు

భవిష్యత్తులో ప్రపంచమంతా పసుపు ఎగుమతి

నక్సలైట్లు ఆయుధాలు వీడేదాకా చర్చలుండవు

పోలీసులను చంపినప్పుడు ఎవరూ మాట్లాడలేదే?

తెలంగాణను నక్సలైట్ల అడ్డాగా మార్చొద్దు: అమిత్‌షా

నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఆఫీసు ప్రారంభం

డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోంమంత్రి

షాను కలిసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం

ఢిల్లీలో అత్యవసర పని ఉందంటూ వెళ్లిపోయిన షా



నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమిత్ షా. చిత్రంలో ఎంపీలు అర్వింద్, లక్ష్మణ్, మంత్రులు తుమ్మల, సీతక్క, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి

నిజామాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో బీఆర్ఎస్ పాలన పోయింది గానీ.. అవినీతి మాత్రం పోలేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ అవినీతిని సహించకుండా ఆ పార్టీని గద్దె దింపితే.. ఆ స్థానంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ కూడా అవినీతి పాలననే కొనసాగిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, ధరణి వంటి వాటిని కుటుంబ ఏటీఎంగా మార్చుకున్నారని, పదేళ్లపాటు అన్ని రంగాల్లో దోపిడీకి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఢిల్లీ కాంగ్రెస్.. తెలంగాణను తమ ఏటీఎంగా మార్చుకుందన్నారు. రాష్ట్రంలో అవినీతి అంతం కావాలంటే బీజేపీ సర్కారు రావాలన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్‌షా ప్రారంభించారు. ఆ తర్వాత బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన కిసాన్ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో

మిగతా 13వ పేజీలో...

పసుపు బోర్డుతో దేశవ్యాప్తంగా రైతులకు సేవలు

పంట ఉత్పత్తులకు మార్కెటింగ్

పసుపు సాగులో అధునాతన శిక్షణ

రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు

పసుపు ఆధారిత పరిశ్రమలకు సాంకేతిక పరిజ్ఞానం 13

మెట్రో డీపీఆర్ ఇచ్చింది గత వారమే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి అవగాహనారాహిత్య వ్యాఖ్యలు

కాంగ్రెస్ కోసమో.. రేవంత్ కోసమో మేం పనిచేయం 13

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది: కిషన్‌రెడ్డి



గురుకులాల గోడు

జనవరి నుంచి నిలిచిపోయిన బిల్లులు

పలుచోట్ల గుడ్లు, చికెన్, అరటిపండ్ల సరఫరా బంద్

రేపట్నుంచి పూర్తిగా ఆపేస్తాం: కాంట్రాక్టర్ల హెచ్చరిక

పలు చోట్ల 2-3ఏళ్లుగా విద్యార్థులకు అందని టైలు, బూట్లు, బెల్టులు, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు

కేంద్రీకృత సేకరణలో జాప్యంతో దయనీయ స్థితి

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. అద్దె బకాయిలు, సరఫరాదారుల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యమే ఇందుకు కారణం. దీంతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతోంది. కేంద్రీకృత సేకరణ విధానం అమలులో జాప్యం వల్ల ఈ విద్యా సంవత్సరం కూడా పాత కాంట్రాక్టర్లనే కొనసాగిస్తున్నారు. వారికి కూడా జనవరి నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో.. ఇప్పటికే కొన్ని చోట్ల కోడిగుడ్లు, మాంసం, అరటిపండ్ల సరఫరా నిలిచిపోయింది. సర్కారు తమకు బిల్లు బకాయిలు చెల్లించకుంటే.. మంగళవారం (జూలై 1వ తేదీ) నుంచి అన్ని రకాల ఆహార పదార్థాలు, ఇతర సామగ్రి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు.. చిలుకూరు ఎస్సీ గురుకుల పాఠశాలకు గుడ్లు, మాంసం సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు రూ.10 లక్షల బకాయిలు ఉండటంతో సరఫరా నిలిపివేశారు. తాను ఇప్పటికే ఇంట్లో ఉన్న నగలు తాకట్టు పెట్టాల్సి వచ్చిందని.. ప్రభుత్వం బకాయిలు చెల్లించేవరకూ సరఫరా చేయబోనని ఆయన స్పష్టం చేశారు. ఇలాగే పలువురు కాంట్రాక్టర్లు చాలా చోట్ల ఆపేశారు. ఈ పరిస్థితుల్లో సంక్షేమ శాఖల కార్యదర్శులు ఏమి చేయాలో తెలియక నిస్తేజంగా ఉండిపోయారు. జిల్లాల్లో అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు.. ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మెనూలో కీలకపదార్థాల సరఫరాను చాలా చోట్ల నిలిపివేయడంతో.. విద్యార్థులకు రోజువారీ మెనూ ప్రకారం ఆహారం అందించడం కష్టంగా మారింది. దీంతో ప్రిన్సిపాళ్లు కాంట్రాక్టర్లను బతిమాలుకుంటూ ఏరోజుకారోజు నెట్టుకొస్తున్నారు.

అద్దె బకాయిలు..

రాష్ట్రంలో దాదాపు 1023 గురుకుల పాఠశాలలు, కళాశాలలు వివిధ సంక్షేమ శాఖల పరిధిలో పనిచేస్తున్నాయి. వీటిలో 662 విద్యా సంస్థలు అద్దెభవనాల్లో కొనసాగుతుండగా.. వీటికి 13 నెలలుగా రూ.450 కోట్లకుపైగా అద్దె బకాయిలున్నాయి. ఆయా భవనాల యజమానులు తాళాలు వేస్తామని బెదిరించడంతో పాఠశాలల ప్రారంభానికి ఒక్క రోజు ముందు సర్కారు మూడు నెలల అద్దె చెల్లించింది. అలాగే.. విద్యాసంవత్సరం ప్రారంభమై

మిగతా 3వ పేజీలో...

గత ఎన్నికల్లో 70 కోట్లు ఖర్చు పెట్టా

నాకు 500 ఎకరాల భూమి ఉంది

ఎన్నికల కోసం 16 ఎకరాలు అమ్మాను

45 ఏళ్ల రాజకీయ జీవితంలో

ఉన్నత వర్గాలతోనే పోటీ పడ్డా 13

కాంగ్రెస్ నేత కొండా మురళి వ్యాఖ్యలు



షెఫాలీ మృతికి కారణమిదేనా? 10

కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్స

ఖాళీ కడుపుతో ఔషధాలు, ఇంజెక్షన్లు

వికటించి గుండెపోటు అంటూ వార్తలు

యాప్‌ల్లో ఇచ్చే ఫోన్ నంబర్లకు సర్కారీ ధ్రువీకరణ తప్పనిసరి

అందుకోసం ప్రత్యేకంగా ఒక ప్లాట్‌ఫామ్

టెలీకమ్యూనికేషన్స్ విభాగం ప్రతిపాదన

ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం 12

సుప్రీం తీర్పునకు విఘాతమన్న ఆందోళన

కమలం కొత్త సారథి రాంచందర్‌రావు?

సంఘ్‌తో పాటు బీజేపీ సీనియర్ల మద్దతు

దాదాపు ఖరారైన పేరు.. రేపు ప్రకటన

అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

ఏకగ్రీవం కావాలనుకుంటున్నా: కిషన్‌రెడ్డి

10 రాష్ట్రాల్లో కొత్త చీఫ్‌ల కోసం కసరత్తు

వారంలో పూర్తి కానున్న ఎన్నికల ప్రక్రియ

ఆ వెంటనే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక?



హైదరాబాద్/న్యూఢిల్లీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు ఎన్నిక దాదాపు ఖరారైంది. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన ఆయనకే సంఘ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు మద్దతు ప్రకటించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ సైద్ధాంతిక నేపథ్యం పట్ల సంపూర్ణ అవగాహన ఉన్నవారికే అధ్యక్ష పీఠం కట్టబెట్టడం సముచితమన్న అభిప్రాయాన్ని వారు జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో, రాంచందర్ వైపు పార్టీ నాయకత్వం మొగ్గు చూపినట్లు సమాచారం. మంగళవారం ఆయన పేరును అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు, పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ పేరు కూడా తుది జాబితాలో ఉంది. బీసీ ఎంపీనే కొత్త అధ్యక్షుడు అవుతారన్న ప్రచారం ఒకవైపు సాగుతుండగా, మరోవైపు జాతీయ స్థాయి సమీకరణాల నేపథ్యంలో ఇతర సామాజిక వర్గానికి అధ్యక్ష కిరీటం దక్కవచ్చన్న ప్రచారం కూడా ఉంది. తాము

మిగతా 12వ పేజీలో...



పూర్ణచందర్‌ను తరలిస్తున్న పోలీసులు

నాకు రాజకీయ అండదండలున్నాయ్

నన్నేమీ చేయలేవు.. స్వేచ్ఛకు పూర్ణచందర్ బెదిరింపులు

వారం క్రితమే ఇద్దరు కలిసి అరుణాచలానికి పయనం

స్వేచ్ఛ పెళ్లి ప్రస్తావన తేగా కుదరదన్న పూర్ణచందర్

ఇద్దరి మధ్య వాగ్వాదం.. మనస్తాపంతో ఆమె ఆత్మహత్య

స్వేచ్ఛతో నా రిలేషన్.. జోగినపల్లి సంతోష్‌కు తెలుసు!

ప్రస్తుతం నేను ఆయన వద్దే పనిచేస్తున్నాను

పోలీసులకు పూర్ణచందర్ వాంగ్మూలం.. 14

అనంతరం కోర్టుకు తరలింపు.. 14 రోజుల రిమాండ్

స్వేచ్ఛ కూతురికి వేధింపులు.. పోక్సో కేసు నమోదు

మరో 2, 3 మీడియా సంస్థల పని పడతాం

మేం దాడులు చేస్తే వేరేలా ఉంటుంది

మా చేతిలోనూ ఆయుధాలున్నాయి

ఏ పోలీసులూ మమ్మల్ని ఆపలేరు

మీడియా ముసుగులో స్లాటర్ హౌస్‌లు నడుపుతున్నారు

మీరు ఎక్కడ బతుకుతున్నారో, ఎవరి తిండి తింటున్నారో గుర్తుంచుకోండి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు



ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని టార్గెట్ చేయాలన్న బీఆర్ఎస్ ఎన్నారై కార్యకర్త గిరి.. రాడ్లు, రాళ్లు పంపిస్తానని 'ఎక్స్'లో పోస్టు

సూర్యాపేట/హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి.. మీడియా సంస్థలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహా న్యూస్ చానల్ కార్యాలయంపై జరిగింది దాడి కాదని, అది బీఆర్ఎస్ తెలిపిన నిరసన మాత్రమేనని అన్నారు. తాము దాడులు చేస్తే ఇలా ఉండదని, అలాగని తాము దాడులు చేయబోమని అనుకోవద్దని వ్యాఖ్యానించారు. మీడియా ముసుగులో స్లాటర్ హౌస్ (కబేళా)లు నడుపుతున్నారని, మరో రెండు మూడు మీడియా సంస్థల పని కూడా పడతామని హెచ్చరించారు. ఆదివారం సూర్యాపేటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌ల వ్యక్తిత్వాలను చంపేందుకు అదే పనిగా దాడులు

మిగతా 12వ పేజీలో...



మెడికోలకు ఉపకారం

15% స్టైపెండ్ పెంపు.. జీవో జారీ 12

ప్రతి నెలా 10 లోపు జమ.. మంత్రి ఆదేశం

జూడాల హర్షం.. దామోదరకు కృతజ్ఞతలు


8 గంటల ముందే రైల్వే రిజర్వేషన్ చార్టు

ప్రస్తుతం ఉన్న 4 గంటల వ్యవధి పెంపు

వెయిటింగ్ లిస్టుపై స్పష్టత ఇచ్చేందుకే

ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లకు చాన్స్

రేపటి నుంచే అమల్లోకి.. 2



నిండుతున్న రిజర్వాయర్లు

పూర్తి సామర్థ్యానికి చేరువలో జూరాల

1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 3

శ్రీశైలానికి 1.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై విచారణకు ఆదేశించరేం?

కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంగా రేవంత్ సర్కార్ అని మీరే అంటారు కదా?

సీబీఐ, ఈడీతో విచారణ జరపడానికి కేంద్రప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేంటి? 12

అమిత్ షా ఎందుకు స్పందించరు?: కేటీఆర్

ఫుట్‌బాల్ ఆడేస్తున్న రోబోలు

చైనాలో ఏఐ ఆధారిత మరమనుషులతో ప్రత్యేక మ్యాచ్

బీజింగ్, జూన్ 29: ఇంతకాలం రోబోలు ఇంట్లో పనులు చేయడం లేదా రెస్టారెంట్లలో వంటకాలు సర్వ్ చేయడం చూశాం. కానీ కృత్రిమ మేధ సహాయంతో మరమనుషులు ఫుట్‌బాల్ ఆడితే?.. చైనా ఇదే చేసి చూపించింది! మనుషులే కాదు రోబోలు అదరగొట్టేలా ఫుట్ బాల్ ఆడగలవని నిరూపించారు చైనా పరిశోధకులు. ఇటీవల చైనా పురుషుల ఫుట్‌బాల్ జట్టు తన ఆటతీరుతో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయినా.. మనుషులను పోలిన ఈ రోబోలు మాత్రం వాటికున్న అడ్వాన్స్‌డ్ విజువల్ సెన్సార్ల సాయంతో బంతిని గుర్తించడంతో పాటు మైదానంలో తమ చురుకైన కదలికలతో అందర్నీ అలరించాయి. కింద పడినా మళ్లీ మనుషుల్లా పైకి లేవడం, మానవుల సాయం లేకుండా పూర్తి ఏఐ ఆధారిత సాంకేతికతతో ముందుకు కదలడం ఇలా ఒకటేమిటీ అన్ని రకాల ఫుట్‌బాల్ నైపుణ్యాల్ని ప్రదర్శించాయి. ఆటల్లో గాయపడిన రోబోలను స్ట్రెచర్ల సాయంతో సిబ్బంది బయటకు తీసుకెళ్లడం ఆటకు మరింత సహజత్వాన్ని ఇచ్చింది. త్వరలో జరిగే ప్రపంచ హ్యూమనాయిడ్ రోబోట్ పోటీలకు ప్రివ్యూగా శనివారం చైనా రాజధాని బీజింగ్‌లో ఈ పోటీలు జరిగాయి. బూస్టర్ రోబోటిక్స్ సంస్థ రూపొందించిన నాలుగు హ్యూమనాయిడ్ రోబోట్ జట్లు ఈ పోటీల్లో కనువిందు చేశాయి. భవిష్యత్తులో మనుషులు, రోబోలు కలిసి ఆడే పరిస్థితులు వస్తాయని బూస్టర్ రోబోటిక్స్ సీఈవో చెంగ్ హావో అన్నారు. ఫైనల్స్ మ్యాచ్‌లో త్సింగ్‌హువా యూనివర్సిటీ జట్టు, చైనా వ్యవసాయ యూనివర్సిటీ మౌంట్ సీ జట్టును ఓడించి విజేతగా నిలిచింది.


రోబోల ఫుట్‌బాల్ మ్యాచ్



రైలు బయలుదేరేందుకు 8 గంటల ముందే రిజర్వేషన్ చార్టు

న్యూఢిల్లీ, జూన్ 29: టిక్కెట్ల రిజర్వేషన్ విధానంలో మరో మార్పు చేసినట్టు ఆదివారం రైల్వే శాఖ ప్రకటించింది. ఇంతవరకు రైలు బయలుదేరడానికి కేవలం నాలుగు గంటల ముందు రిజర్వేషన్ ఛార్టును ఖరారు చేస్తుండగా, ఇక నుంచి ఎనిమిది గంటల ముందు ఛార్టును ప్రకటించనుంది. ఇది మంగళవారం నుంచి అమల్లోకి రానుంది. రైలు బయలుదేరడానికి కేవలం 4 గంటల ముందు రిజర్వేషన్ ఛార్టును ఖరారు చేస్తుండడంతో టిక్కెట్లు కన్ఫర్మ్ అవుతుందో లేదో తెలియక వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ప్రయాణాన్ని కొనసాగించాలో, ప్రత్యామ్నాయం చూసుకోవాలో నిర్ణయించుకోలేక అవస్థలు పడుతున్నారు. అందువల్ల టిక్కెట్ కన్ఫర్మ్ అవుతుందో లేదో అన్న విషయంపై స్పష్టత ఇచ్చేందుకు రైలు బయలుదేరడానికి 8గంటల ముందు రిజర్వేషన్ల ఛార్టును తయారు చేయనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. వెయిటింగ్ లిస్టుపై ఉన్న ప్రస్తుతం ఉన్న 25% పరిమితిని పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది. తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం కూడా జులై ఒకటో తేదీ నుంచే అమల్లోకి రానుండడం గమనార్హం.

ఆన్‌లైన్‌లో ఆర్డరిస్తే.. ఇంటికే నడిచొచ్చింది

ఆస్టిన్ (అమెరికా): ఆన్‌లైన్‌లో కారును ఆర్డర్ చేసుకున్న వినియోగదారుడికి ఆ కారు డ్రైవర్ లేకుండా స్వయంగా దానంతట అదే ఇంటికి వచ్చి చేరితే ఆశ్చర్యం కలగక మానదు కదా!. అమెరికాలో అచ్చం అలానే జరిగింది. ఆస్టిన్‌లో నివాసముండే వినియోగదారుడికి తాను బుక్ చేసుకున్న కారు ఫ్యాక్టరీ నుంచి ఎటువంటి మానవ ప్రమేయం లేకుండా తన ఇంటికి వచ్చి చేరింది. ఆటోమోటివ్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా తన నూతన 'మోడల్ వై' ఎస్‌యూవీతో ఈ చరిత్రాత్మక మైలురాయిని అందుకుంది. ఈ సెల్ఫ్ డ్రైవింగ్ కారు జర్నీ వీడియోను టెస్లా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకోగా ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. టెక్సాస్ గిగాఫాక్టరీ నుంచి బయలుదేరిన కారు.. డ్రైవర్ లేకుండా రహదారులపై వంద కిలోమీటర్లకు పైగా వేగంతో ప్రయాణిస్తూ పరిస్థితులకు అనుగుణంగా వేగాన్ని నియంత్రించుకుంటూ ట్రాఫిక్ సిగ్నళ్లను, మలుపులను దాటుకుంటూ యజమాని ఇంటికి చేరుకుని పార్కింగ్ ప్రదేశంలోకి వెళ్లి నిలిచింది. ఈ మేరకు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ.. తన టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కారు దాదాపు గంటకు 115 కి.మీ వేగాన్ని అందుకుందని టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ వెల్లడించారు.

యూజీసీ డిఫాల్టర్ జాబితాలో ఐఐటీ హైదరాబాద్

న్యూఢిల్లీ, జూన్ 29: ర్యాగింగ్‌ను అరికట్టేందుకు నిబంధనలు పాటించని 4 ఐఐటీలు, 3 ఐఐఎంలను యూజీసీ డిఫాల్టర్ జాబితాలో చేర్చారు. అధికారిక వర్గాల సమాచారం మేరకు.. ఈ జాబితాలో ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ బాంబే, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ పలక్కాడ్, ఐఐఎం బాంబే, ఐఐఎం రోహ్‌టక్, ఐఐఎం తిరుచిరాపల్లి ఉన్నాయి. అలాగే ఎయిమ్స్ రాయబరేలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్-ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, హర్యాణా కూడా ఉన్నాయి. ర్యాగింగ్ కట్టడికి చర్యలు తీసుకుంటామన్న తప్పనిసరి హామీపత్రం సమర్పించనందుకు దేశవ్యాప్తంగా 89 విద్యా సంస్థలకు యూజీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. డిఫాల్టర్ జాబితాలో ముఖ్యమైన 17 జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఉన్నాయి. యూజీసీ మార్గదర్శకాల మేరకు విద్యా సంస్థలలో ర్యాగింగ్ నిరోధానికి ఫిర్యాదులు స్వీకరించడానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం, ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడానికి మానిటరింగ్ ఏజెన్సీని నియమించడం వంటి చర్యలు తీసుకోలేదని యూజీసీ సెక్రటరీ మనీశ్ జోషి వెల్లడించారు. ఆయా విద్యా సంస్థలు 30 రోజుల్లో ర్యాగింగ్ కట్టడికి నిబంధనలు అమలు చేయకపోతే యూజీసీ గ్రాంట్లు, నిధులు వెనక్కి తీసుకోవడం వంటి చర్యలు తీసుకుంటామని యూజీసీ హెచ్చరించింది.

త్రిభాషా విధానంపై 'మహా' సర్కారు వెనుకడుగు!

ముంబై, జూన్ 29: మరాఠా, ఇంగ్లీష్ మాధ్యమ ప్రాథమిక పాఠశాలల్లో 'డీఫాల్ట్'గా హిందీ భాష నేర్చుకోవాలన్న నిర్ణయంపై నిరసన వెల్లువెత్తడంతో మహారాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చింది. ఈ విషయమై సవరిస్తూ గత ఏప్రిల్‌లో జారీ చేసిన త్రిభాషా విధానాన్ని ఉపసంహరిస్తున్నట్లు ఆదివారం తెలిపింది. తాజాగా విధాన రూపకల్పనకు డాక్టర్ నరేంద్ర జాదవ్ సారథ్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని సీఎంఫడణవీస్ అధ్యక్షతన జరిగిన మహారాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈ కమిటీ అన్ని వర్గాల వారితో సంప్రదిస్తుందని పేర్కొన్న ఫడణవీస్.. తమకు 'మరాఠీ' ముఖ్యమని తెలిపారు.

జే-10సీ ఫైటర్ జెట్‌లు కొనే యోచనలో ఇరాన్

టెహ్రాన్, బీజింగ్, జూన్ 29: ఇజ్రాయెల్‌తో 12 రోజుల యుద్ధం తర్వాత ఇరాన్ తన రక్షణరంగంపై దృష్టి సారించింది. డ్రోన్లు, క్షిపణుల పరంగా శక్తిమంతంగానే ఉన్నా అత్యాధునిక ఫైటర్ జెట్ విమానాలు లేకపోవడంపై ఫోకస్ చేసింది. 1979 సమయంలో అమెరికా నుంచే కొనుగోలు చేసిన ఎఫ్-14 మాత్రమే ఇరాన్ వద్ద ఉండటంతో ఇటీవల ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో గట్టిగా ప్రతిఘటించలేకపోయింది. అందుకే చైనాకు చెందిన వంద జే-10సీ ఫైటర్ జెట్ విమానాలను కొనుగోలు చేయాలని యోచిస్తోంది. చైనాలో ఈ నెల 26న జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశం సందర్భంగా జే-10సీ ఫైటర్ జెట్ విమానాల కొనుగోలుపై చర్చలు జరిగినట్లు సమాచారం. ఒక్కో విమానం ఖరీదు 40 మిలియన్ డాలర్లు.

ఏప్రిల్ 1 నుంచి జనగణన

2 దశల్లో నిర్వహణ.. తొలి దశలో ఇళ్లు, ఆస్తుల లెక్క.. రెండో దశలో జనాభా, కుల గణన

- 36 ప్రశ్నలతో సమాచార సేకరణ
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎస్‌లకు సెన్సస్ కమిషనర్ లేఖ



అంకెల్లో..

మొత్తం ఎన్యూమరేటర్లు: 34 లక్షలు
గణనలో పాల్గొనే సిబ్బంది: 1.3 లక్షలు
ప్రజలను అడగనున్న ప్రశ్నలు: 36
ఇళ్లు, ఆస్తుల గణన: 2026 ఏప్రిల్ 1 నుంచి
జనాభా, కుల గణన: 2027 ఫిబ్రవరి 1 నుంచి

న్యూఢిల్లీ, జూన్ 29: దేశంలో జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. దీనిని రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలిదశలో ఇళ్ల జాబితా, వాటి స్థితి, ఆస్తులు, సౌకర్యాలు వంటి వివరాలను సేకరిస్తారు. మలి దశలో జనాభా లెక్కలతో పాటు వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, సంస్కృతి, సంప్రదాయాలు సహా ఇతర వివరాలను సేకరిస్తారు. తొలిదశ 2026, ఏప్రిల్ 1న ప్రారంభం కానుండగా, రెండో దశ 2027, ఫిబ్రవరి 1న మొదలవనుంది. తొలిదశకు ముందే సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకంతోపాటు వారికి పని కేటాయింపు ప్రక్రియ కూడా పూర్తి చేయనున్నారు. ఈ మేరకు జన గణన విభాగం కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ పేర్కొన్నారు. ఆయా వివరాలతో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఈ ప్రక్రియకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సహకరించాలని కోరారు. జన గణనతోపాటే కుల గణను కూడా చేపట్టనున్నట్టు కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో దానిని కూడా మలిదశలో చేపట్టనున్నారు. కాగా, దేశంలో జనగణన చేపట్టడం ఇది 16వ సారి అయితే, స్వాతంత్య్రం వచ్చిన తర్వాత చేపడుతున్న 8వ జనగణనగా మృత్యుంజయ్ కుమార్ పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియను మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. అదేవిధంగా ప్రజలకు స్వీయ గణన సదుపాయం కూడా అందుబాటులో ఉండనుంది. మొత్తం డేటాకు పటిష్ఠమైన భద్రత కల్పిస్తారు. ఇక, జన గణన, వ్యక్తిగత విషయాల్లో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు, రేడియో, టీవీ, ట్రానిసిస్టర్ వంటి ప్రశ్నలు అడిగి వివరాలు సేకరించనున్నారు. తృణధాన్యాల వినియోగం, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, వృథానీటి నిర్వహణ, వంటగది సదుపాయం, వంటకు వినియోగించే గ్యాస్ ఎల్పీజీనా, పీఎన్‌జీనా వంటి వాటి వివరాలను కూడా నమోదు చేస్తారు. ఇక, ఇళ్లకు సంబంధించిన వివరాల్లో ఇంటి గోడలు, గచ్చు, పైకప్పుల వివరాలు, వాటి పరిస్థితిని తెలుసుకుంటారు. ఇంట్లో ఎంత మంది ఉంటారు?, ఇంటికి ఎన్ని గదులు ఉన్నాయి? వివాహిత జంటలు, కుటుంబ పెద్ద మహిళా? పురుషుడా? వంటి వివరాలను సేకరిస్తారు.

సరిహద్దులకు తుదిగడువు

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పరిపాలనా సౌలభ్యం కోసం చేసే జిల్లాలు, తాలూకాలు, పోలీసు స్టేషన్ల సరిహద్దుల నిర్ణయాన్ని ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి ముగించాలని మృత్యుంజయ్ కుమార్ సూచించారు. డిసెంబరు 31నాటికి ఉన్న సరిహద్దులను జన గణనకు ప్రామాణికంగా తీసుకుంటామని వివరించారు. గ్రామాలు, పట్టణాలను ఏకరీతి గణన బ్లాకులా విభజించనున్నట్టు తెలిపారు. ఒక్కొక్క బ్లాకుకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించనున్నట్టు పేర్కొన్నారు.

బిహార్‌లో 3 కోట్ల మంది ఓటర్లపై ఈసీ కీలక ప్రకటన

బిహార్ ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. 2003 నాటి రాష్ట్ర ఓటర్ల జాబితాను త్వరలోనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నట్టు తెలిపింది. ఈ జాబితాలో మొత్తం 4.96 కోట్ల మంది ఓటర్ల వివరాలు ఉన్నాయని, వీరు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొంది. మిగిలిన 40 శాతం మంది ఓటర్లు మాత్రం.. ఎన్నికల సంఘం పేర్కొన్న 11 ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదానిని సమర్పించాలని తెలిపింది. ఈ ఓటర్ల సంఖ్య 3 కోట్లుగా ఉందని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వల్ల ఓటర్లకు మేలు జరుగుతుంది. అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోరు. అదేవిధంగా అక్రమంగా ఓటు హక్కు పొందిన వారిని నిలువరించే అవకాశం ఉంటుంది" అని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. కాగా, బిహార్‌లో మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

కాంతిని గడ్డకట్టించారు!

న్యూఢిల్లీ, జూన్ 29: సెకనుకు దాదాపుగా 3 లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఫోటాన్ల సమూహమైన కాంతిని ఇటలీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ పవియా, సీఎన్ఆర్ నానోటెక్ పరిశోధకులు గడ్డకట్టించారు. ఒక నిర్దిష్టమైన పద్ధతిలో ఏర్పాటు చేసిన అత్యంత శీతలమైన వాతావరణంలోకి (అణువాయువులోకి) పంపడం ద్వారా దాన్ని ఒక 'సూపర్ సాలిడ్'లా మార్చగలిగారు (పైకి గడ్డకట్టినట్టుగా కనిపిస్తూనే అంతర్గతంగా ద్రవలక్షణాలను కలిగి ఉండే పదార్థాలను క్వాంటం సిద్ధాంతంలో సూపర్ సాలిడ్స్ అంటారు). మామూలు సాలిడ్స్ (ఘనపదార్థాలు) వాటంతట అవి కదలవు. కానీ, సూపర్ సాలిడ్స్ అలా కాదు. వాటిలోని కణాల ఆధారంగా.. తమ నిర్మాణంలో ఏ మార్పూ లేకుండా అవి అవి తమ దిశను, సాంద్రతను మార్చుకోగలవు. ఇలా కాంతిని నియంత్రించగలిగే టెక్నాలజీ అందుబాటులోకి వస్తే.. కాంతితో, అతి తక్కువ విద్యుత్తుతో పనిచేసే కంప్యూటర్లను అభివృద్ధి చేయవచ్చు. భవిష్యత్తులో మనం వాడే క్వాంటం కంప్యూటర్లు, ఆప్టికల్ ప్రాసెసర్లను ఈ టెక్నాలజీ ద్వారా తయారుచేయవచ్చు. ఫోటాన్లను నియంత్రించగలిగే శక్తి సంపూర్ణంగా అందుబాటులోకి వస్తే మనం ఊహించలేనంత వేగంతో డేటాను, అత్యంత సురక్షితంగా ప్రసారం చేయొచ్చు. కాంతి ఆధారిత సమాచార ప్రసార ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేయొచ్చు. కాంతిలో డేటానూ భద్రపరచవచ్చు. 'ఆప్టికల్ మెమొరీ చిప్స్' వంటి అద్భుతమైన పరిజ్ఞానాలను భవిష్యత్తులో రూపొందించడానికి ఇదొక కీలకమైన ముందడుగు. అవి ప్రస్తుతం మనం వాడే హార్డ్ డిస్క్ డ్రైవ్‌ల కన్నా కొన్ని వేల రెట్లు వేగంతో పని చేస్తాయి. మెడికల్ ఇమేజింగ్ (అంటే ఎక్స్‌రేల వంటివి), అంతరిక్ష రహస్యాల అన్వేషణలో ఈ పరిజ్ఞానం కీలకంగా ఉపయోగపడుతుంది.

జగన్నాథ రథయాత్రలో విషాదం

- గుండిచా ఆలయం వద్ద తొక్కిసలాట
- ముగ్గురి మృతి, 50మందికి గాయాలు

పూరీ/భువనేశ్వర్, జూన్ 29: ఒడిశాలోని పూరి జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుండిచా ఆలయ సమీపంలో జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మృతిచెందగా, దాదాపు 50 మంది గాయపడ్డారు. రథాల్లో కొలువైన దేవతామూర్తులను చూడటానికి వందలాది మంది భక్తులు ఒక్కసారిగా తోసుకుంటూ ముందుకు రావడంతో తొక్కిసలాట జరిగిందని పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వైన్ తెలిపారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి చాలా విషమంగా ఉందని చెప్పారు. పూజా సామగ్రిని తీసుకువెళ్తున్న రెండు ట్రక్కులు రథాల సమీపంలో రద్దీగా ఉన్న ప్రదేశంలోకి ప్రవేశించడంతో గందరగోళం మొదలైందని అధికారులు పేర్కొన్నారు. సంప్రదాయంలో భాగంగా దేవతామూర్తుల మొహాలపై కప్పి ఉంచిన వస్త్రాన్ని (పహందా) తొలగించే సమయంలో స్వామిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. మృతులను బసంతి సాహు (36), ప్రేమకాంత్ మొహంతి(80), ప్రవాతి దాస్ (42)గా గుర్తించారు. ఈ దుర్ఘటనపై ఒడిశా సీఎం మోహన్ మాఝీ స్పందించారు. ప్రభుత్వం తరఫున భక్తులను క్షమాపణలు కోరారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. తొక్కిసలాట ఘటన అత్యంత విషాదకరమని, సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు. సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

95 కోట్ల మందికి సంక్షేమం!

దేశ జనాభాలో 64%మందికి సంక్షేమ పథకాలతో లబ్ధి.. మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సామాజిక భద్రత పథకాలతో దేశంలో 95 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని ప్రధాని మోదీ వెల్లడించారు. జనాభాలో 64 శాతం మందికి ఏదో ఒక రూపంలో సంక్షేమం అందుతోందన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తన నివేదికలో ఈ విషయం వెల్లడించిందన్నారు. ఆకాశవాణిలో ఆదివారం ప్రసారమైన 'మన్ కీ బాత్' 123వ సంచికలో ఆయన ప్రసంగించారు. 2015కి ముందు వరకు దేశంలో 25 కోట్ల మంది మాత్రమే సామాజిక భద్రత కార్యక్రమాలతో ప్రయోజనం పొందారని చెప్పారు. ఇవాళ ఏదో ఒక పథకం ద్వారా 95 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఆరోగ్యం నుంచి సామాజిక భద్రత వరకు ప్రతి రంగంలో సంతుష్ట స్థాయికి చేరే దిశగా దేశం ముందుకెళ్తోందన్నారు. భారత్‌ను ట్రాకోమా(కంటివాపు) రహితదేశంగా ఐఎల్‌వో ప్రకటించడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. దీని నిర్మూలనలో 'స్వచ్ఛ భారత్ అభియాన్', 'జల్‌జీవన్ మిషన్' కార్యక్రమాల సహకారం కూడా ఉందన్నారు. ఊబకాయాన్ని కూడా తగ్గించుకోవాలని పిలుపిచ్చారు. ఇందుకోసం నూనె వాడకాన్ని పది శాతం తగ్గించుకోవాలని పునరుద్ఘాటించారు. వివిధ యాత్రలకు బయల్దేరుతున్న భక్తులు, యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'సుదీర్ఘ కాలం తర్వాత సోమవారం నుంచి కైలాస్ మానసరోవర్ యాత్ర పునఃప్రారంభమవుతోంది. అమరనాథ్ యాత్ర 3వ తేదీ నుంచి మొదలవుతోంది. ఇటీవలే పూరీ జగన్నాథుడి రథయాత్ర జరిగింది. కొద్ది రోజుల్లో పవిత్ర శ్రావణ మాసం వస్తోంది. ఉత్తరం నుంచి దక్షిణం.. తూర్పు నుంచి పశ్చిమం వరకు సాగే ఈ యాత్రలన్నీ 'ఏక్ భారత్..శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి' అని చెప్పారు.

విశాఖ యోగాంధ్రలో 3 లక్షలకుపైనే..

దేశవ్యాప్తంగానే గాక ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని ప్రధాని గుర్తుచేశారు. "విశాఖ బీచ్‌లో నేను పాల్గొన్న యోగాంధ్ర కార్యక్రమంలో 3లక్షల మంది పాలుపంచుకున్నారు. ఇదో అద్భుత దృశ్యం" అని పేర్కొన్నారు. తెలంగాణలో మూడు వేల మంది దివ్యాంగులు కలిసి యోగా శిబిరంలో పాల్గొన్నారని, సాధికారతకు యోగా ఎలా మాధ్యమం అవుతుందో నిరూపించారని ప్రశంసించారు. మేఘాలయలో 'ఎరి' పట్టును ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీనికి కొద్ది రోజుల కిందట 'జీఐ' ట్యాగ్ కూడా లభించిందన్నారు. 'ఎరి పట్టు మేఘాలయకు వారసత్వంలాంటిది. ఇక్కడి ఖాసీ తెగ ప్రజలు ఎన్నో తరాలుగా దీనిని సంరక్షిస్తూ వస్తున్నారు. ఈ పట్టును తీసుకోవడానికి పట్టుపురుగులను చంపవసరం లేదు. అందుకే దీనిని 'అహింస పట్టు'గా పేర్కొంటున్నారు' అని తెలిపారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారిని దేశం ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుందని ప్రధాని ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల క్రియాశీల భాగస్వామ్యం ఉంటే ఇలాంటి పెను సంక్షోభాలను ఎదుర్కోగలమన్నారు.

భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్..

తెలంగాణలోని భద్రాచలానికి చెందిన గిరిజన మహిళలను ప్రధాని ప్రశంసించారు. తమ జీవనోపాధి కోసం రోజంతా పొలాల్లో కూలీలుగా కష్టపడి పనిచేసే గిరిజన మహిళలు నేడు చిరుధాన్యాల (మిల్లెట్స్) నుంచి ఆరోగ్యకరమైన బిస్కెట్లు తయారు చేస్తున్నారని అన్నారు. ఈ బిస్కెట్లు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరుతో హైదరాబాద్ నుంచి లండన్ దాకా వెళ్తున్నాయని తెలిపారు. ఆ గిరిజన మహిళలు 'గిరి శానిటరీ ప్యాడ్లు' తయారుచేశారని.. కేవలం మూడు నెలల్లో 40 వేల ప్యాడ్లను తయారుచేసి చాలా సరసమైన ధరకు పాఠశాలలు, సమీపంలోని కార్యాలయాలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు.

పాక్ ఆర్థికం అతలాకుతలం!

- నౌకలపై భారత్ నిషేధం విధించడంతో తీవ్ర నష్టం
- ఎగుమతులు, దిగుమతుల్లో 50 రోజుల జాప్యం
- వెల్లడించిన 'డాన్' కథనం

(సెంట్రల్ డెస్క్)

పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత.. మే 2 నుంచి పాకిస్థాన్‌పై భారత్ విధించిన నిషేధంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా భారతీయ పోర్టుల్లో పాకిస్థానీ నౌకలను నిషేధించడంతో ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. పాకిస్థాన్ పత్రిక 'డాన్' ఈ అంశంపై ఓ కథనాన్ని ప్రచురించింది. పాకిస్థాన్ నౌకలపై నిషేధం విధించడంతో.. భారీ నౌకలు కరాచీ పోర్టులోనే లంగర్ వేసుకుని, ఎదురు చూస్తున్నాయి. భారత పోర్టుల్లో అనుమతి లేకపోవడంతో.. సాధారణంగా జరగాల్సిన ఎగుమతులు, దిగుమతుల్లో 30 నుంచి 50 రోజుల మేర ఆలస్యం నమోదవుతోంది. భారత్ విధించిన నిషేధంతో లాజిస్టిక్స్ ధరలు గణనీయంగా పెరిగాయని, బీమా ఖర్చులు కూడా పెరిగినట్లు కరాచీకి చెందిన వస్త్రాల ఎగుమతిదారుడు ఆమిర్ అజీజ్ వాపోయారు. ఫలితంగా షిప్పింగ్ ధరలు భారీగా పెరిగినట్లు వివరించారు. భారత్ నిషేధం విధించిన తొలినాళ్లలో పాకిస్థాన్ దొడ్డిదారిలో సరుకు రవాణాకు సిద్ధమైంది. అయితే.. భారత్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) ఈ తరహా దిగుమతులు, ఎగుమతులపై కొరడా ఝుళిపిస్తోంది. యూఏఈ, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాల నుంచి పాక్ పంపే సరుకులను కట్టడి చేసేందుకు 'ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్'ను ప్రారంభించింది. ఫలితంగా 39 కంటైనర్లలోని రూ.9 కోట్ల విలువ చేసే 1,100 మెట్రిక్ టన్నుల సరుకు సీజ్ అయ్యింది. పాక్ ఈ సరుకును యూఏఈలో తయారైనట్లు తప్పుడు రికార్డులను సృష్టించి, భారత్‌కు తరలించింది.

దారుణ పరిస్థితులు

కరాచీ, కాసీం పోర్టులు పాక్ ఎగుమతులు, దిగుమతులకు అత్యంత కీలకం. వీటికి దన్నుగా గ్వాదర్ పోర్టు ఉంది. ఈ మూడు పోర్టులు ఆ దేశ జీడీపీకి 0.5% వాటాను అందజేస్తున్నాయి. ఈ పోర్టుల ద్వారా పాక్ ప్రభుత్వానికి ఏటా రూ.15 వేల కోట్ల మేర ఆదాయం లభిస్తుందని అంచనా. భారత్ ఆంక్షల తర్వాత.. పోర్టుల ద్వారా ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. ఇక భారత్ నుంచి 2018లో ఇరు దేశాల మధ్య 2.41 బిలియన్ డాలర్ల మేర వాణిజ్యం జరగ్గా.. 2024లో అది 1.2 బిలియన్ల డాలర్లకు పడిపోయింది. పహల్గాం దాడితో ఈ సంబంధాలు మరింతగా క్షీణించాయి.

వారంలోనే ధరాఘాతం

గడిచిన వారం రోజుల్లో పాకిస్థాన్ ప్రభుత్వం పలు ఉత్పత్తుల ధరలను పెంచగా.. నిత్యావసరాలకు రెక్కలు వచ్చే పరిస్థితి నెలకొంది. ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వం 50% పెంచింది. గతంలో సబ్సిడీ సిలిండర్ ధర భారత కరెన్సీలో రూ.వెయ్యిగా ఉండగా.. ప్రస్తుతం రూ.1,500కు చేరుకుంది. నాన్-సబ్సిడీ సిలిండర్ల ధర కూడా 50% పెరిగింది. గత వారంలో పెట్రోల్ ధర లీటరుకు రూ.78.56 నుంచి రూ.80.02కు.. డీజిల్ ధర రూ.79.84 నుంచి రూ.82.26కు పెరిగింది. జూలై 1 నుంచి ఈ ధరలు మరింత పెరగనున్నాయి.


మూడు నెలల్లో సీఎంగా డీకే శివకుమార్!

- సొంత పార్టీ ఎమ్మెల్యే హుస్సేన్ వ్యాఖ్యలు

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పు జరుగుతుందా? ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య స్థానంలో కాంగ్రెస్ అధిష్ఠానం ప్రస్తుత డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కూర్చోపెట్టే ఆలోచనలో ఉందా? అంటే అవుననే అంటున్నారు సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్! రామనగరలో ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2-3 నెలల్లో సీఎంగా సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనేలా మాట్లాడారు. 'సమయం వచ్చినప్పుడు అధిష్ఠానం డీకే శివకుమార్‌కు అవకాశం ఇస్తుంది. అది ఈ ఏడాది జరిగే అవకాశం ఉంది' అని వ్యాఖ్యానించారు. 'సెప్టెంబరు తర్వాత రాష్ట్రంలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయని కొందరు నాయకులు మాట్లాడుతున్నారు. నేను డైరెక్టుగా చెబుతున్నా.. 2-3 నెలల్లో ఒక నిర్ణయం జరుగుతుంది' అని డీకేకు సన్నిహితుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ పేర్కొన్నారు.

హైదరాబాద్ వచ్చే విమానంలో సాంకేతిక లోపం

చెన్నై, న్యూఢిల్లీ, జూన్ 29: హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ఓ విమానం సాంకేతిక లోపం కారణంగా తిరిగి చెన్నైలో దిగింది. నెల్లూరుకు సమీపంలో గాల్లో ఉండగా విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించారు. వెంటనే పైలట్ అధికారులను సంప్రదించిన తర్వాత చెన్నైలో విమానాన్ని సురక్షితంగా దింపినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ విమానంలో 159 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఇదిలా ఉండగా.. టోక్యో నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానాన్ని ఆదివారం కోల్‌కతాకు మళ్లించారు. క్యాబిన్‌లో అధిక ఉష్ణోగ్రత మూలంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.



బెజోస్.. పెళ్లి సందడి

వెనిస్, జూన్ 29: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, జర్నలిస్టు లారెన్ సాంచెజ్ వివాహం వెనిస్ గ్రాండ్ కెనాల్‌లో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ వివాహ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రముఖులు హాజరయ్యారు. సాధారణంగా పెళ్లి అనగానే సంగీత్, మెహందీ గుర్తొస్తాయి. కానీ బెజోస్, సాంచెజ్ కాస్త డిఫరెంట్‌గా ఫోమ్ పార్టీతో తమ పెళ్లి వేడుకలను మొదలుపెట్టారు. నురుగులో మునిగి తేలుతూ పార్టీ చేసుకుంటున్న బెజోస్, సాంచెజ్ ఫొటోలు వైరల్ అయ్యాయి. ఈ వివాహం కోసం బెజోస్ దాదాపు రూ.470 కోట్లు ఖర్చు పెట్టినట్లు సమాచారం. వేడుకకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా తదితర ప్రముఖులు హాజరయ్యారు.

కనకదుర్గమ్మకు భాగ్యనగర్ బంగారు బోనం


- ఢిల్లీలో బోనాల ఉత్సవాలకు లాల్‌దర్వాజ ప్రతినిధులు
- గోల్కొండలో ఘనంగా రెండో పూజ

కార్వాన్, విజయవాడ (వన్‌టౌన్), చాంద్రాయణగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో కొలువైన కనకదుర్గమ్మకు శ్రీ భాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో 500 మందికి పైగా భక్తులు ఆదివారం బంగారం బోనాలు సమర్పించారు. తొలుత బంగారు బోనంతో ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ప్రత్యేక పూజల్లో ఏపీ దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దుర్గగుడి ఈవో శీనా నాయక్ పాల్గొని దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయ బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ మారుతి యాదవ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో సోమవారం నుంచి మూడ్రోజుల పాటు జరగనున్న బోనాల ఉత్సవాల కోసం అక్కడికి బయలుదేరారు. ఇక, బోనాల రెండో పూజ గోల్కొండ కోటలో ఘనంగా జరిగింది. అమ్మవారికి బోనాలు, తొట్టెలను సమర్పించారు. ఇక, లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఘటం ఎదుర్కోలు ఘనంగా ప్రారంభమైంది. ఘటానికి అలంకరించే ఆభరణాలను మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కలిసి ఆలయ అనువంశిక ధర్మకర్త సురిటి కామేశ్వర్ తదితరులకు అందజేశారు. ఎదుర్కోలు సందర్భంగా మంత్రి పొన్నం, ఎంపీ అనీల్‌కుమార్‌యాదవ్ వేసిన స్టెప్పులు అందరినీ ఆకట్టుకున్నాయి.


గోల్కొండ బోనాల ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తజన సందోహం

కళ్లలో కారం కొట్టి.. పీకపై కాలేసి తొక్కి..

- భర్తను దారుణంగా హత్య చేసిన భార్య
- వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని ఘాతుకం
- కర్ణాటకలోని కడశెట్టిహళ్లిలో ఘటన



బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భార్య చేతిలో మరో భర్త బలయ్యాడు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తుమకూరు జిల్లా తిపటూరు తాలూకా కడశెట్టిహళ్లిలో.. కళ్లలో కారం చల్లి గొంతు తొక్కి భర్తను దారుణంగా హత్య చేసిందో ఇల్లాలు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఈ దారుణం శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు శంకరమూర్తి (50), సుమంగళ దంపతులు కడశెట్టిహళ్లి గ్రామశివారులోని ఓ ఫాంహౌస్‌లో నివసించేవారు. సుమంగళ తిపటూరులోని కల్పతరు బాలికల హాస్టల్‌లో వంటమనిషిగా పనిచేస్తోంది. కొంతకాలంగా ఇదే గ్రామానికి చెందిన నాగరాజుతో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. అందుకు భర్త అడ్డుగా ఉన్నాడని అతడిని తొలగించుకోదలిచింది. ఈ క్రమంలో ఈ నెల 24న ఇంట్లోనే భర్త కళ్లలోకి కారప్పొడి చల్లడంతో అతడు కిందపడిపోయాడు. ఆ తర్వాత ఓ పెద్ద కర్రతో దాడి చేసి, భర్త గొంతుపై కాలేసి బలంగా తొక్కి హత్యచేసింది. ఆ తర్వాత మృతదేహాన్ని ప్రియుడి సాయంతో ఓ సంచిలో కుక్కి 30 కిలోమీటర్ల దూరంలోని ఓ బావిలో పడేసింది. ఆ తర్వాత శంకరమూర్తి కనిపించడం లేదని ఆమె నొనవినకెరె పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వారి ఇంటిని పరిశీలించగా శంకరమూర్తి నిద్రించే గదిలో కారప్పొడి చల్లిన ఆనవాళ్లు గుర్తించారు. ఆమె మొబైల్ కాల్‌డేటాను పరిశీలించగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. విచారణలో హత్యచేసినట్లు ఆమె అంగీకరించడంతో అరెస్టు చేశారు.

ఆరోగ్యశ్రీ అనుసంధానం పైసలిస్తే పరిపూర్ణం!

ఒక్కో ప్రైవేటు ఆస్పత్రి నుంచి రూ.3-5 లక్షల వసూలు.. ఇటీవల కాలంలో ఎంప్యానలైన 60కిపైగా ఆస్పత్రులు

- పడకలను బట్టి రేటు.. రూ.3 కోట్ల వరకు వసూలు

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కొందరికి కాసుల వర్షం కురిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు లభించేలా చూడాలన్న సంకల్పంతో 'ఎంప్యానెలింగ్' ప్రక్రియకు ఈ ఏడాది మొదట్లో శ్రీకారం చుట్టింది. ఆయా ఆస్పత్రులను ఆరోగ్యశ్రీ జాబితాలో చేర్చే ఈ అనుసంధాన ప్రక్రియ కొందరు ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయ అధికారులకు, జిల్లాస్థాయిలో పనిచేసేవారికి వరంగా మారింది. మార్చి నాటికి తెలంగాణ వ్యాప్తంగా 409 ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్నాయి. వాటి సంఖ్యను వెయ్యికి పెంచాలని ప్రభుత్వం భావించింది. దీనికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అప్పటి ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో కర్ణన్ నోటిఫికేషన్ ఇచ్చారు. సుమారు 164 ప్రైవేటు ఆస్పత్రులకుపైగా దరఖాస్తు చేసుకున్నాయి. వాటిలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం సౌకర్యాలు ఉన్నాయా లేవా అనేది ఆరోగ్యశ్రీ అధికారుల బృందం పరిశీలిస్తుంది. నిబంధనల ప్రకారం పడకల సంఖ్య, వైద్యులు, వైద్య సిబ్బంది, పరీక్షా యంత్రాలు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు అనుమతులు మంజూరు చేయవచ్చని ఆ బృందం ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. తర్వాత వాటిని ఎంప్యానెల్ ఆస్పత్రుల జాబితాలో చేరుస్తారు. ఈ క్రమంలోనే ప్రైవేటు ఆస్పత్రుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కో ఆస్పత్రి నుంచి రూ.3-5 లక్షలు!

గతంలో ఏదైనా ప్రైవేటు ఆస్పత్రి ఆరోగ్యశ్రీలో



ఎంప్యానెల్ కావాలంటే 13 అంచెలను దాటుకొని రావాలి. ఎక్కడైనా చిన్న ఆటంకం ఏర్పడినా సదరు దరఖాస్తును తిరస్కరించేవారు. ఎంప్యానెల్ అయ్యేందుకు పెద్దగా అవకాశం ఉండేది కాదు. దాంతో అనుసంధాన ఆస్పత్రులుగా మారడం క్లిష్టంగా ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 13 అంచెలను 10కి కుదించారు. ఆస్పత్రులకు అనుమతిపై నిర్ణయం తీసుకునే ఈడీసీ (ఎంప్యానెల్ డిసిప్లినరీ కమిటీ)ని తొలగించారు. నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు, అర్హత గల వైద్యులు ఉన్న ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీకి అనుసంధానం చేయాలని నిర్ణయించారు. దీంతో చిన్న చిన్న పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులూ దరఖాస్తు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రిలోని పడకల స్థాయిని బట్టి 'రేటు' నిర్ణయించి, తమ వద్ద నుంచి వసూలు చేసినట్లు ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. కనిష్ఠంగా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైచిలుకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉన్న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి ఎంప్యానెల్ చేసేందుకు రూ.5లక్షలు, దక్షిణ తెలంగాణ జిల్లాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి రూ.3 లక్షలు వసూలు చేశారు. దరఖాస్తు చేసుకున్న వాటిలో ఎంప్యానెల్‌కు అర్హత ఉన్న ఏ ఒక్క ఆస్పత్రినీ వదల్లేదని సమాచారం. ఇటీవల కాలంలో మొత్తం60కి పైగా ఆస్పత్రులను ఎంప్యానెల్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల నుంచి సుమారు రెండున్నర నుంచి మూడు కోట్ల వరకు వసూలు చేసినట్లు వాటి యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

సమగ్ర విచారణ జరపాలి

ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఒకరిద్దరు అధికారుల తీరు వల్ల సర్కారుకు చెడ్డపేరు వస్తోందని వైద్యవర్గాలు అంటున్నాయి. ఎంప్యానెల్ పేరిట వసూళ్లపై విజిలెన్స్‌తో సమగ్ర విచారణ జరిపించాలని ఉద్యోగులు, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు కోరుతున్నాయి.

చక్రం తిప్పిన ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారి

ఈ మొత్తం తతంగాన్ని ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలోని ఓ అధికారి నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాస్థాయిలో పనిచేసే ఆరోగ్యశ్రీ సిబ్బంది ద్వారా ఈ దందా నడిపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా కర్ణన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్యాలయంలో దీర్ఘకాలికంగా పాతుకుపోయిన వారందరికీ స్థానచలనం కల్పించారు. కానీ ఒకరిద్దరు అధికారులు మాత్రం తమకున్న పరపతిని ఉపయోగించి అక్కడే తిష్ఠ వేసుకున్నారు. అందులో ఒకరు ఈ వసూళ్ల దందాకు పాల్పడుతున్నట్లు వైద్య వర్గాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. కొత్తగా 163 ప్యాకేజీలను చేర్చడంతో వాటి సంఖ్య 1835కు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 1,042 సర్కారీ దవాఖానాలు ఉండగా ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్య 436కు పెరిగింది.

గురుకులాల గోడు

(మొదటి పేజీ తరువాయి)

చాలారోజులైనా, కాంట్రాక్టర్లను నియమించకపోవడంతో పిల్లలకు యూనిఫారాలు, టైలు, బెల్టులు, బూట్లు, స్కూల్ బ్యాగులు ఇంతవరకూ అందలేదు. ఎస్టీ గురుకులాల్లో గత ఏడాది ఇచ్చిన యూనిఫారాలతోనే విద్యార్థులు నెట్టుకొస్తున్నారు. ఎస్సీ గురుకులాల్లో అయితే మూడేళ్లుగా విద్యార్థులకు యూనిఫామ్స్ అందించలేదు. బీసీ, మైనారిటీ గురుకులాల్లో పరిస్థితీ దాదాపుగా అదే. నిజానికి ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ విధానం అమలైతేనే.. కామన్ డైట్ ద్వారా అన్ని వస్తువులనూ పూర్తిస్థాయిలో సమర్థంగా అందించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఆలోచన. కానీ, దీనిపై తుదినిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుండడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. సర్కారు త్వరగా నిర్ణయం తీసుకుంటే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

3 నెలల రేషన్ కోటా పంపిణీ నేటితో ఆఖరు

- రెండు నెలల పాటు రేషన్ దుకాణాలు బంద్
- మళ్లీ సెప్టెంబరులో రేషన్ బియ్యం పంపిణీ

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'మూడు నెలల కోటా బియ్యం పంపిణీ' కార్యక్రమం నేటితో ముగియనుంది. ఇప్పటికే జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన కోటా బియ్యాన్ని పంపిణీ చేసిన నేపథ్యంలో రాష్ట్రంలో 2 నెలలపాటు రేషన్ షాపులు మూతపడనున్నాయి. మళ్లీ సెప్టెంబరు నెలలో బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి ప్రతి నెలలో మొదటి 15రోజులు రేషన్ బియ్యం పంపిణీ ఉంటుంది. కానీ కేంద్ర ప్రభుత్వం ఈసారి కీలక నిర్ణయం తీసుకుంది. వర్షాకాలంలో మారుమూల ప్రాంతాలు, గిరిజన, కొండ ప్రాంతాల ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని దేశమంతా ఒకేసారి 3 నెలల కోటా బియ్యాన్ని పంపిణీ చేయాలని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో కూడా జూన్ 1 నుంచి బియ్యం పంపిణీ ప్రారంభమైంది. ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలల కోటా కింది 18 కిలోలు పంపిణీ చేశారు. ఈ 3 నెలలకు కలిపి 6 లక్షల టన్నుల సన్నబియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 94.34లక్షల రేషన్ కార్డులు ఉండగా వీటిపై 3.6కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు.

ఎంపీ రఘునందన్‌కు మళ్లీ బెదిరింపు కాల్

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎంపీ రఘునందన్ రావుకు ఆదివారం మళ్లీ బెదిరింపులు వచ్చాయి. తమ బృందాలు హైదరాబాద్‌లో ఉన్నాయని, దమ్ముంటే కాపాడుకోవాలని దుండగులు సవాల్ చేశారు. దీనిపై రఘునందన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం యశోద హాస్పిటల్‌లో కాలికి ఆపరేషన్ చేయించుకుని రఘునందన్ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం 9489556347, 7365035440 నంబర్ల నుంచి తనకు నుంచి బెదిరింపులు వచ్చాయని పోలీసులకు తెలిపారు. ఏపీ మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు తనను చంపడానికి 5 బృందాలు రంగంలోకి దిగినట్లు హెచ్చరించారని పేర్కొన్నారు. తమ సమాచారం దొరకదని, తాము ఇంటర్నెట్ కాల్స్ వాడుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని బెదిరించారని వివరించారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేశారని రఘునందన్ వెల్లడించారు. కాగా, ఇటీవల గుర్తుతెలియని వ్యక్తుల నుంచి పలుమార్లు రఘునందన్‌కు బెదిరింపులు వచ్చాయి. దీనిపై ఆయన డీజీపీతో పాటు సంగారెడ్డి, మెదక్ ఎస్పీలకు ఫిర్యాదు చేయగా.. అదనపు భద్రత కల్పించారు.


సీఎం రేవంత్ రెడ్డితో అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, కార్యవర్గ సభ్యులు

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయండి

- సీఎంకు హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ వినతి

న్యాయవాదులపై ఇటీవల దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్టును తీసుకురావాలని హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంఘం అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అడ్వకేట్స్ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీకి 50 ఎకరాల స్థలం కేటాయించాలని, అసోసియేషన్‌కు ఏటా రూ.5 కోట్లు ఇవ్వాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని, న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. న్యాయవాదులకు హెల్త్ కార్డ్స్ అందజేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి కాజా విజారత్ అలీ తదితరులు ఉన్నారు.

గోదావరి - బనకచర్లపై.. రేపు ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

ఏపీ ప్రభుత్వం తలపెట్టిన 'గోదావరి-బనకచర్ల' ప్రాజెక్టుతో తెలంగాణ ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతింటాయన్న అంశంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం సాగునీటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల, వివిధ కమిషన్ల చైర్మన్లు పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ పీపీటీ ప్రారంభం కానుంది. కార్యక్రమంలో సాగునీటి శాఖ అధికారులు, నిపుణులూ పాల్గొని మంత్రి ఉత్తమ్‌కు సహకారాన్ని అందించనున్నారు.

క్రమంగా నిండుతున్న రిజర్వాయర్లు

- జూరాలకు 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- రెండింతలు నిండిన శ్రీశైలం..146.920 టీఎంసీల నిల్వలు


శ్రీశైలం జలాశయం

ధరూరు/దోమలపెంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు క్రమంగా నిండుతున్నాయి. జూరాల ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.60 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.279 టీఎంసీలకు చేరుకోగా, పూర్తి నీటి మట్టం 318.5160 మీటర్లకు 317.300 మీటర్లకు చేరాయి. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులకు 871.20 అడుగులకు చేరుకోగా, గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు ప్రస్తుతం 146.9200 టీఎంసీలకు చేరుకున్నది. ఇక, ఎగువ నుంచి జూరాల జలాశయానికి 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరద నమోదవుతోంది. దీంతో ప్రాజెక్టు 12 గేట్లు ఒక మీటర్ ఎత్తి దిగువకు 1,16,064 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దీంతోపాటు రెండు జల విద్యుత్ కేంద్రాలు, వివిధ కాలువల ద్వారా 1,43,218 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలకు 25,707 క్యూసెక్కులు, భీమా లిఫ్టుకు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315, ఎడమ కాల్వకు 150, కుడి కాల్వకు 290, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరోవైపు, రెండు జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో 139.293 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఎగువన జూరాల గేట్ల ద్వారా 1,16,064 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదనతో 25,707 క్యూసెక్కులు కలుపుకుని దిగువకు 1,14,772 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, శ్రీశైలం ప్రాజెక్టుకు ఆదివారం సాయంత్రానికి 1,31,443 క్యూసెక్కుల వరద నీరు చేరింది. మరోవైపు ఎగువన ఆల్మట్టిలో 88.41 టీఎంసీల మేర నీటి నిల్వ ఉండగా, దిగువన నారాయణపూర్ ప్రాజెక్టుకు 80,415 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

హౌసింగ్ ఆస్తుల వేలం

వనరుల సమీకరణకు ప్రభుత్వ నిర్ణయం

- కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4, ఎస్ఆర్ నగర్, నాంపల్లిలోని ప్లాట్ల వేలానికి రంగం సిద్ధం
- రూ.539 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా
- 5న క్యాబినెట్ ఆమోదం.. త్వరలో వెలువడనున్న ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వనరుల సమీకరణలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న పలు ఆస్తులను వేలం వేసే దిశగా దృష్టి సారించింది. ఇప్పటికే పలుచోట్ల ఉన్న ఆస్తులను వేలం వేస్తుండగా.. తాజాగా మరికొన్ని ఆస్తులనూ వేలం వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బోర్డు పరిధిలో హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ఫేజ్-4లో ఉన్న పలు ఓపెన్ ప్లాట్లను వేలం వేసేందుకు పచ్చజెండా ఊపింది. ఇందుకు ఈ నెల 5న జరిగిన భేటీలో క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. దీంతో ఆ ప్లాట్లను వేలం వేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4తోపాటు ఎస్ఆర్‌నగర్, నాంపల్లిలో ఉన్న పలు ఆస్తుల వేలంతో ప్రభుత్వానికి సుమారు రూ.539 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపినప్పటికీ.. ఇంకా అధికారిక ఉత్తర్వులు రావాల్సి ఉంది. ధరలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపడంతో.. వాటిని ఖరారు చేశాక ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు తెలిసింది. ఆ ఉత్తర్వులు వచ్చేవరకు వేలానికి అవసరమైన ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న పలు ఖాళీ స్థలాలు, భూములను వేలం వేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లను పలు విభాగాలుగా విభజించారు. ఏ ప్రాంతంలో ఎన్ని ప్లాట్లు ఉన్నాయి? ఒక్కో ప్లాటు ఎన్ని చదరపు గజాల్లో ఉంది? అనే వివరాలతో నివేదికలు రూపొందించారు. ఆయా ప్లాట్ల వేలానికి సంబంధించి కూడా ప్రాథమికంగా కొన్ని ధరలను నిర్దేశించుకున్నారు. ప్లాట్లు ఉన్న ప్రాంతాలు, అక్కడ ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలు, ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న క్రయ విక్రయ ధరలను బేరీజు వేసుకుని ప్రాథమిక ధరలను నిర్ణయిస్తూ, వేలం వేస్తున్నారు. ఇప్పటివరకు కేపీహెచ్‌బీ ఫేజ్-7లో 18 ఓపెన్ ప్లాట్లను, చింతల్, నిజాంపేట సహా మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్లు, స్థలాలను వేలం వేశారు.

వేలం వేయనున్న ఆస్తుల వివరాలు..

- కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4లో సర్వే నం.1009లో ఉన్న 7.33 ఎకరాలు. వేలంతో సుమారు రూ.392 కోట్లు రావచ్చని అంచనా.
- కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4లో సర్వే నంబరు 1009లో ఉన్న 4,598 చదరపు గజాలు, 2,420 చదరపు గజాలతో ఉన్న రెండు ఓపెన్ ప్లాట్లు. వేలంతో దాదాపు రూ.73 కోట్లు రావచ్చని అంచనా.
- ఎస్ఆర్‌నగర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను వేలం వేయనున్నారు. దీనికి రూ.53 కోట్లు వచ్చే అవకాశం ఉంటుందని అంచనా.
- నాంపల్లిలోని ఎంజే రోడ్‌లో ఉన్న 1,148 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని వేలం వేయనున్నారు. దీనికి రూ.23 కోట్లు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎఫ్‌సీఐ పేరుతో వసూళ్ల దందా!

సీఎంఆర్ గడువుపెంపుతో తెరపైకి దళారులు.. ఉత్తర్వులు తామే తెచ్చామని ప్రగల్భాలు

- ఎఫ్‌సీఐ అధికారులకివ్వాలంటూ వసూళ్లు
- జిల్లాకు రూ.3 నుంచి రూ.5 లక్షల టార్గెట్
- గతంలోనూ ఇదే తీరంటూ మిల్లర్ల ఆవేదన

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అప్పగింతకు గడువు పెంచాలని కేంద్రాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కోరింది! దానికి కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది! అయితే గడువు పెంచడానికి తామే కారణమంటూ కొంతమంది దళారులు ప్రత్యక్షమయ్యారు. ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసి అనుమతులు తెచ్చామంటూ వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఒక్కో జిల్లాకు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల చొప్పున టార్గెట్ పెట్టి వసూలు చేసేందుకు రంగంలోకి దిగారు. ఇప్పటికే నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో రైస్‌మిల్లర్ల నుంచి వసూళ్లు మొదలుకావటం చర్చనీయాంశంగా మారింది. ఎఫ్‌సీఐ అధికారులకు ముడుపులు ముట్టజెప్పేందుకే వసూళ్లు చేస్తున్నట్లు దళారులు చెబుతున్నారు. యాసంగి(2023- 24)లో రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం 48 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఈధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో మరాడించి 67 శాతం రికవరీ లెక్కన... 32 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు అప్పగించాల్సి ఉంది. ఇప్పటివరకు 27 లక్షల టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ఎఫ్‌సీఐకి అప్పగించగా... ఇంకా 5 లక్షల టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాల్సి ఉంది. అయితే గత మార్చి నెల 27 తేదీ నాటికి తుది గడువు పూర్తయ్యింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖలు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ ప్రయత్నాలతో కేంద్ర ం స్పందించి పొడిగింపు ఉత్తర్వులు జారీచేసింది. ఏప్రిల్, మే నెలలో మరాడించిన బియ్యంతో పాటు జూలై 27 తేదీ వరకు మరాడించిన బియ్యాన్ని కూడా తీసుకునేలా అవకాశం కల్పించింది.



జిల్లాల వారిగా టార్గెట్

ఈ అంశాన్ని రైస్‌మిల్లర్ల సంఘం నేతలు తమకు అవకాశంగా మలుచుకొని వసూళ్ల పర్వానికి తెరలేపారు. సీఎంఆర్ బకాయిలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున చెల్లించాలని జిల్లా అసోసియేషన్లకు టార్గెట్ పెట్టారు. పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చినందుకు ఎఫ్‌సీఐ అధికారులకు రూ. 50 లక్షలు ముట్టజెప్పాల్సి ఉన్నదని, మిగిలిన డబ్బులు అసోసియేషన్ ఖర్చులకనిచెప్పి వసూలు చేస్తున్నారు. రాష్ట్ర నేతలకు పట్టున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాల నుంచి వసూళ్లకు శ్రీకారం చుట్టారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు, అధికారుల పర్యవేక్షణతో వచ్చిన పొడిగింపు ఉత్తర్వులకు... డబ్బులు ఎందుకు చెల్లించాలని కొందరు రైస్‌మిల్లర్లు ఎదురు తిరిగారు. అయితే ఈ వసూళ్ల పర్వంలో పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారుల పేర్లను కూడా అసోసియేషన్ నేతలు ప్రస్తావిస్తున్నారు. దీంతో కొంతమంది మిల్లర్లు భయపడి కమీషన్ ముట్టజెప్తున్నారు.

వసూళ్లపై మిల్లర్లలో చర్చ..

ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన బియ్యం 5 లక్షల మెట్రిక్ టన్నులున్నాయి. కోటి నుంచి కోటిన్నర వరకు వసూలుచేసిన సొమ్మును ఏంచేస్తారు? ఈ వసూళ్లు అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయంతోనే జరుగుతున్నాయా? లేకపోతే రైస్‌మిల్లర్ల సంఘం నేతలే 'చెట్టుపేరుచెప్పి కాయలమ్ముకున్నట్లు'! వసూళ్లు చేస్తున్నారా? అని అంశంపై మిల్లర్లలో చర్చజరుగుతోంది. గతంలో కూడా సీఎంఆర్ పొడిగింపు ఉత్తర్వులు వచ్చినప్పుడల్లా... టన్నుకు ఇంత అని, డబ్బులు వసూళ్లు చేసిన సందర్భాలున్నాయని పలువురు వాపోతున్నారు.



ఇలా రికామీగా...

కళ్ళకు గంతలు కట్టుకొని
శూన్యంలో నడుస్తున్నాను

ఒక చేతిలో కత్తి
మరో చేతిలో డాలుతో
యుద్ధానికి సన్నద్ధమైన సైనికుడిలా

ఎన్నో బంధాల్ని వదిలేసి
ఎంతో కాలంగా
తిరుగుతున్నాను ఇలా రికామీగా

నీలి పూల లాంటి
నా కనురెప్పలపై
నాట్యం చేస్తున్నాయి
అల్లకల్లోల దృశ్యాలు

ఒక ఊహాపూరిత కోరిక
ఒక రసమయమైన భావన

నా స్మృతి పథం నుండి
జారిపోతున్నప్పుడు

మనసుతో మనసును
అనుసంధానించి
ఆత్మను ఆత్మతో
అనువాదం చేస్తున్నాను

ఇప్పుడు నన్ను నేను
విస్తరించుకున్నాను
నా ఆలోచనలు పురివిప్పి
నాట్యమాడుతున్నాయి

ఇప్పుడు నా రికామీ తిరుగుళ్ళన్నీ
యుద్ధవ్యూహాలు అయ్యాయి
కళ్ళకు గంతలున్నా
స్వప్న గమ్యం స్పష్టంగా కనిపిస్తోంది

నన్ను రక్షిస్తూ డాలు
యుద్ధం చేస్తూ నా చేతిలో కత్తి
రేపటి రోజు
ఆశ్చర్యకరమూ, కాంతివంతమూ
అయినది కావచ్చునేమో!

■ విల్సన్ రావు కొమ్మవరపు

✆ 89854 35515

జీవితం అన్నాక

జీవితాన్ని కాస్త
చల్లని గాలికి ఆరేసుకోవాలి
నాలుగు ముచ్చట్లు నలుగురితో
పంచుకోవాలి
మన గుమ్మిలోని గింజలను
నలుగురితో కలిసి ఆరగించాలి
రేపటి పేజీ కనిపిస్తుందో లేదో
ఇప్పుడే రంగులు అద్దుకోవాలి
మనుషులలో మొలుస్తున్న
ముళ్ళను పీకపతల పారేయాలి
మట్టి పరిమళాలు పూయాలి
అవి ఊరు ఊరంతా వీస్తాయి హాయిగా
రోజన్నాక రాత్రి పగలు ఉన్నట్లు
జీవితం అన్నాక మంచి చెడులు ఉంటాయి
దేనికి వణుకు బెణుకు లేకుండా
వెళ్లడమే నేర్చుకోవాలి

■ గుండెల్లి ఇస్తారి

✆ 98499 83874



సోమవారం 30 జూన్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాలు

తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభ జూలై 1 ఉ.10గంటల నుండి ఎన్టీఆర్ కళామందిరం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ప్రారంభ సభలో వెలుదండ నిత్యానందరావు, యం. శంకరరెడ్డి, కసిరెడ్డి వెంకటరెడ్డి; మొదటి సమావేశంలో బిట్టు వెంకటేశ్వర్లు, శంకరనారాయణ, భమిడిపాటి విశ్వనాథం; రెండవ సమావేశంలో చిగిచర్ల కృష్ణారెడ్డి, పులికొండ సుబ్బాచారి, మసన చెన్నప్ప; ముగింపు సమావేశంలో కొలకలూరి ఇనాక్, కోట్ల హనుమంతరావు, టి. గౌరీశంకర్ తదితరులు పాల్గొంటారు.

తూమాటి సుధాకర్

కొలకలూరి సాహితీ వారోత్సవం

కొలకలూరి ఇనాక్ సాహితీ వారోత్సవం జూలై 1 నుంచి 7వ తేదీ వరకు త్యాగరాయగాన సభ, హైదరాబాద్‌లో జరుగుతాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడు రోజులపాటు కొలకలూరి ఇనాక్‌పై ఇతరులు రాసిన ఏడు పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుంది. పుస్తకాల రచయితలు కొలకలూరి మధుజ్యోతి, కల్లూరి ఆనందరావు, అరుణ గంధం, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, ఎ. రవీంద్రబాబు, కాత్యాయనీ విద్మహే, జి.యస్.ఆర్. కృష్ణమూర్తిల తోపాటు, పలువు ప్రముఖులు ఈ సాహితీ వారోత్సవంలో పాల్గొంటారు.

కళా వి.ఎస్. జనార్దన్‌మూర్తి

సాహిత్యానువాదంపై 'ఛాయా' సదస్సు

ఛాయ పబ్లికేషన్స్ ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'సాహిత్యానువాదం ప్రాముఖ్యత'పై సదస్సు జూలై 5 ఉ.10 గంటల నుంచి రూం.నెం. 121, ఆర్ట్స్ కాలేజ్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ అంశంపై ప్రొ. అరుణవ సిన్హా ప్రసంగిస్తారు. ఈ సదస్సులో ఛాయ ప్రతిష్ఠాత్మకంగా తెలుగు సాహిత్యంలో తీసుకుని వస్తున్న 'ఛాయ విదేశీ సిరీస్' విడుదలతోపాటు, వి.వి. గణేశానందన్ ఇంగ్లీష్ నవలకు తెలుగు అనువాదం 'మనుషులు మాయమయ్యే కాలం', సతీష్ చప్పరికె కన్నడ నవలకు తెలుగు అనువాదం 'ఘాంద్రుక్'ల ఆవిష్కరణ జరుగుతుంది. సభ నిర్వహణ అరుణాంక్ లత. సభలో ఎన్. కమలాకరశర్మ, సి. కాశీం, ఉమానూతక్కి, అనిల్ కుమార్, తారకేశ్వర్, కె. శ్రీనివాస్, సతీశ్ చప్పరికె, మోహన్‌బాబు తదితరులు పాల్గొంటారు.

ఛాయా పబ్లికేషన్స్


రావూరి భరద్వాజ పురస్కారం

రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారాన్ని బండి నారాయణ స్వామి, రావూరి కాంతమ్మ సాహిత్య సేవా పురస్కారాన్ని కన్నెగంటి అనసూయ స్వీకరించే కార్యక్రమం జూలై 5 సా.5గంటలకు శ్రీత్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి జస్టిస్ బి. శేషశయనారెడ్డి, సభాధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ. జె. చెన్నయ్య, రావూరి వెంకట కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు.

జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్

చెక్కుచెదరని 'రక్త కన్నీరు' రికార్డు

ఒకే ఒక టీమ్, ఒకే ఒక వ్యక్తి సారథ్యంలో 1956 నుండి 1986 మధ్య కాలంలో 5432 ప్రదర్శనలతో టికెట్ పెట్టి మరీ ప్రజల్ని రప్పించిన నాటకం 'రక్త కన్నీరు'. దీన్ని అంత విజయవంతంగా నడిపిన చుండి నాగభూషణం పేరు దరిమిలా 'రక్తకన్నీరు నాగభూషణం'గా మారిపోయింది. పాతికేళ్ల కాలం పాటు తెలుగు రాష్ట్రాల్లో అప్రతిహత విజయాలతో సంచలనం కల్గించిన ఈ నాటకానికి మాతృక తమిళంలో యం. ఆర్. రాధా ప్రదర్శించిన 'రక్త కన్నీర్'. అప్పట్లో రైల్వేలో చిన్న ఉద్యోగం చేస్తూ సినిమా అవకాశాల కోసం మద్రాసు వెళ్లి చిన్నా చితకా వేషాలు మాత్రమే వేస్తున్న నాగభూషణం యం.ఆర్. రాధా 'రక్త కన్నీర్' నాటకాన్ని చూశారు. దానికి స్క్రిప్ట్ ఏదని అడిగితే స్క్రిప్ట్ లేదు, కాపీ రైటూ లేదు. దాంతో పాలగుమ్మి పద్మరాజు గారితో కలిసి అనేకసార్లు యం.ఆర్. రాధా నాటకాన్ని చూసిన నాగభూషణం ఆయన చేతే స్క్రిప్ట్ రాయించుకుని జైత్రయాత్ర ప్రారంభించారు.



ఈ నాటకం ప్రదర్శన ప్రదర్శనకూ డైలాగులు మారిపోతాయి. స్థానిక రాజకీయాలపైన, నాయకులపైన సెటైర్లు, చెణుకులు విసురుతూ జనరంజకంగా ప్రదర్శనలను రూపుదిద్దేవారు నాగభూషణం. ఈ నాటకంపై ఆధారపడి 50-60 కుటుంబాలు బతికేవి. నటీనటులు సాంకేతిక సిబ్బంది ఒక బస్సు లోనూ, ఆ వెనుక నాగభూషణం దంపతులు ఒక కారు లోనూ బయలుదేరేవారు. ప్రముఖ నటీమణులు వాణిశ్రీ, శారదలు మొదట్లో ఈ నాటకంలో నటించారు. డబ్బింగ్ జానకి, తెలంగాణ శకుంతల కూడా నటించారు. ప్రజా నాట్యమండలి కళాకారుడు బి. గోపాలం సంగీతం సమకూర్చేవాడు. నాటకంలో సుందరి పాత్ర కోసం ఎన్నుకున్న సీత అనే నటినే నాగభూషణం తన జీవిత భాగస్వామిగా చేసుకున్నారు.

క్లుప్తంగా ఈ నాటక కథ - జమీందారీ కుటుంబానికి చెందిన గోపాలం ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి పాశ్చాత్య సంస్కృతిని నరనరానా జీర్ణించుకుని భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ఈసడించుకుంటూ సుందరి అనే వేశ్య వలలో పడతాడు. తల్లి పోరు పడలేక అయిష్టంగా ఇందిరను పెళ్లి చేసుకొని శోభనం రోజే ఆమెను వదిలేస్తాడు. సర్వసంపదలను సుందరికి కైంకర్యం చేసి చావుబతుకుల్లో ఉన్న తల్లిని చూడటానికి కూడా వెళ్లడు. గోపాలానికి కుష్టువ్యాధి సంక్రమించటం, సుందరి ప్రమాదంలో మరణించటం, ఆ ఇంట్లోవాళ్లు ఇతణ్ణి బయటకు గెంటటం, భిక్షగాడిగా మారిన గోపాలం అంత్యదశలో భార్య ఇందిరను గుర్తించి క్షమాపణ కోరి తన తప్పుకు ప్రాయశ్చిత్తంగా తన మిత్రుడు రమణతో ఇందిరకు పెళ్లి చేసి కన్నుమూయడం... ఇదీ దీని కథ.

> ఈ నాటకం విజయ పరంపర కారణంగా సినిమాల్లో కూడా నాగభూషణానికి ముఖ్యమైన పాత్రలు వచ్చాయి. ఐతే అక్కడ ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి నెలా మొదటివారం మాత్రం సినిమాలకు కాల్షీట్లు ఇవ్వననే షరతుతో ఆ వారాన్ని నాటక ప్రదర్శనకు కేటాయించేవాడు.



పురుషుల చెడు వ్యసనాలకు బానిసలై, ధనమదం, అహంకారంతో సాంసారిక జీవితాన్ని నాశనం చేసుకొంటూ స్త్రీల రక్త కన్నీరుకు కారణం కాకూడదనే ముగింపు గొప్ప సామాజిక ప్రయోజనాన్ని చేకూర్చింది. తన స్వంత ఊరైన నెల్లూరులో మొదటి ప్రదర్శనతో ప్రారంభించి చివరి ప్రదర్శనను కూడా నెల్లూరు లోనే ముగించారు నాగభూషణం. ప్రదర్శన ద్వారా వచ్చే డబ్బులో ఖర్చులు, నటీనటుల భత్యం పోను మిగిలిన డబ్బుని ఆయా ప్రాంతాలలోని కమ్యూనిస్టు పార్టీకి, ప్రజా సంఘాలకి పంచటమే గాక 70 దశకంలో పునర్నిర్మాణం గావించబడిన ప్రజా నాట్యమండలికి 19 సంవత్సరాల పాటు అధ్యక్షునిగా కూడా పని చేసి 1993లో ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు.

'రక్త కన్నీరు' నాటకం విజయ పరంపర కారణంగా సినిమాల్లో కూడా నాగభూషణానికి ముఖ్యమైన పాత్రలు వచ్చాయి. ఐతే అక్కడ ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి నెలా మొదటివారం మాత్రం సినిమాలకు కాల్షీట్లు ఇవ్వననే షరతుతో ఆ వారాన్ని నాటక ప్రదర్శనకు కేటాయించేవారు. 350 చిత్రాల్లో నటించిన నాగభూషణం ప్రతి నాయకుడి పాత్రకు అప్పటి వరకు ఉన్న ఫైటింగ్‌లు కత్తియుద్ధాలనే ఇమేజ్‌ని పక్కకు పెట్టి 'కన్నింగ్ విలనిజాన్ని' ప్రవేశపెట్టారు. నాగభూషణం తర్వాత రావుగోపాలరావు, కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్ తదితరులు ఈ ఒరవడిని కొనసాగించారు. 'రక్త కన్నీరు' నాటకాన్ని యం.ఆర్. రాధా తమిళంలో చలనచిత్రంగా నిర్మించి తెలుగు లోకి డబ్ చేయగా, యం.ఆర్. రాధాకు తెలుగులో నాగభూషణమే డబ్బింగ్ చెప్పారు. మళ్లీ తెలుగులో ఇలాంటి నాటకం రావాలని కోరుకుందాం.

■ చెరుకూరి సత్యనారాయణ

నా మొదటి పుస్తకం

మునాసు వెంకట్

ముందుమాటలు గానీ, ఆవిష్కరణలు గానీ, పరిచయ సభలు గానీ లేని నా మొదటి పుస్తకం 'ఎన' 1999 జూలైలో గోసంగి నీలి సాహితి ద్వారా 35 కవితలతో, 64 పేజీలతో వెలువడింది. ఇది అమ్మ నాయనలకు అంకితం. నా కవిత్వాన్ని పుస్తక రూపంలో చూసుకున్నప్పుడు నా గుండెల నిండా ఓ నిశ్శబ్ద వేడుక. దానిని అమ్మకు చూపించి ఆనందపడ్డ క్షణాలు మరువలేనివి. 'బహువచనం', 'చిక్కనవుతున్న పాట', 'పదునెక్కిన పాట', 'మేమే', 'మొగి' వంటి కవితా సంకలనాలలో వచ్చిన నా కవిత్వమంతా కలిపి 'ఎన'గా వచ్చింది. ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ ముఖచిత్రాన్ని వేశారు. అప్పటికే ఆయన 'మేమే', 'మొగి' కవితా సంకలనాలకు ముఖచిత్రాలు వేసి ఉండడంతో నా పుస్తకానికి కూడా ఆయననే ఎంచుకున్నాను.

తెలంగాణ జీవ కవిగా నాకు పేరు తెచ్చింది

'ఎన'లో కవిత్వమంతా తెలంగాణ ఉత్పత్తి కులాల భాష. ఈ పుస్తకం తెలంగాణ జీవ కవిగా నాకు పేరు తెచ్చింది. అంతకుముందే కొంతమంది మిత్రులు 'బహువచనం', 'మేమే', 'మొగి' కవితా సంకలనాలలో తెలంగాణ భాషను రాశారు. అది కూడా నా కవిత్వానికి ఒక కారణం. ఇంకా అప్పటికి తెలంగాణ మలిదశ రాజకీయ ప్రస్తావన జరగలేదు. 'ఎన' కవితా సంపుటి మీద అనేక వ్యాసాలు, ఉత్తరాలు రావడమే కాకుండా చాలా చర్చ కూడా నడిచింది. 'ఎన' కవితా సంపుటి రాకముందే ఆంధ్రజ్యోతిలో పబ్లిష్ అయిన 'దావా' అనే కవిత గురించి ప్రముఖ కవి సిద్ధార్థ ఆంధ్రప్రభలో తన 'ప్రెజెంట్ టెన్స్' శీర్షికలో అద్భుతంగా విశ్లేషించారు. 'ఎన' వచ్చినాక కూడా అదే ఫీచర్‌లో సిద్ధార్థ మరో రెండు వ్యాసాలు రాశారు.



నా కవిత్వపు లోలోపల నడుచుకుంటూ నా ఎద ముచ్చట్లు విన్న మంచి పాఠకుడు సిద్ధార్థ. ఆ తర్వాత ఆంధ్రజ్యోతిలో థింసా 'దళిత దిక్సూచి.. ఎన' పేరుతో అద్భుతంగా విశ్లేషించారు. 'చింత' సాహిత్య పత్రికలో దెంచనాల శ్రీనివాస్, ఏనుగు నరసింహారెడ్డి భిన్నకోణాల్లో రాశారు. 'ఎన' వచ్చిన తర్వాత దానిపై చాలా ఉత్తరాలు కూడా అందుకున్నాను. సి. నారాయణరెడ్డి చాలా ప్రశంసా పూర్వకమైన ఉత్తరం రాశారు. 'బ్రహ్మ మొహం లోంచి పాదాలు' అనే నా కవితను ఒక అపూర్వ సృష్టి అనీ, 'ఎన' ఒక పస ఉన్న కవితా సంపుటి అనీ, ఇందులో ఉన్న భాషని తాను కొత్తగా చదువుకుంటున్నాననీ ఆయన రాశారు. ఆ తర్వాత ఆవంత్స సోమసుందర్ నాకు ఒక ఉత్తరం రాస్తూ, "కవితా ప్రపంచంలో నా ఇన్నేళ్ల ప్రయాణంలో ఒక్క ముక్క కూడా అర్థం కాకుండా వచ్చిన కవితా సంపుటి మీదే" అన్నారు. బదులుగా నేను "మీ భాష వేరు, తెలంగాణ భాష వేరు. ఇప్పటికైనా అర్థం చేసుకున్నందుకు ధన్యవాదాలు" అని రాశాను. తెలంగాణ భాష పట్ల ఒక ఆత్మగౌరవ చర్చగా ఈ ఉత్తరాలను చూడొచ్చు. నగ్నముని 'ఎన'ను మెకనాస్ గోల్డ్‌గా అభివర్ణించారు. 'ఎన'లోని పద చిత్రాలను చూసి హెచ్చార్కె పెద్ద కవులతో నన్ను పోల్చి ప్రశంసించారు.

> 'ఎన' వచ్చిన తర్వాత దానిపై చాలా ఉత్తరాలు అందుకున్నాను. ఆవంత్స సోమసుందర్ ఒక ఉత్తరం రాస్తూ, "కవితా ప్రపంచంలో నా ఇన్నేళ్ల ప్రయాణంలో ఒక్క ముక్క కూడా అర్థం కాకుండా వచ్చిన కవితా సంపుటి మీదే" అన్నారు. బదులుగా నేను "మీ భాష వేరు, తెలంగాణ భాష వేరు. ఇప్పటికైనా అర్థం చేసుకున్నందుకు ధన్యవాదాలు" అని రాశాను.



అంబటి సురేంద్ర రాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, శివారెడ్డి, వరవరావు, దర్భశయనం శ్రీనివాసాచార్య, అద్దేపల్లి రామ్మోహన్ రావు వంటి పెద్దవారంతా 'ఎన' ద్వారా నన్ను గుండెలకు హత్తుకున్నారు. దళిత కవి మిత్రులు ఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్ బాబు, పైడి తేరేష్‌బాబు... ఇంకా చాలా మంది కవి మిత్రులు, అభిమానులు నాకు ఉత్తేజాన్నిస్తూ ఉత్తరాలు రాశారు. 'ఎన' లోని కొన్ని కవితలు ఇంగ్లిష్‌లోకి హిందీలోకి అనువాదం అయ్యాయి. ఎక్కిళ్ళు ఎగదన్నుకొస్తుంటే పఠమెక్కి శిగమూగిందే నా 'ఎన' కవిత్వం.

✆ 99481 58163

కొడవటిగంటికి ఏకలవ్యశిష్యుణ్ణి!

– గంగిశెట్టి శివకుమార్

పిల్లల బాధ్యత సమాజ బాధ్యత అని నమ్మి బాల సాహిత్యంలో 58 ఏళ్లుగా ప్రయాణిస్తున్న సాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్. పిల్లల కథల్లో అడవులు, మృగాలు, రాజులే ఇతివృత్తాలుగా ఉన్నా అవి బాలలను అభ్యుదయం వైపు నడిపించగలగాలి, మంచి ఆలోచనలు కల్పించగలగాలి అంటారాయన. ఇప్పటి దాకా పది బాలల కథా సంపుటాలు వెలువరించిన శివ కుమార్ 2025 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో సంభాషణ.

బాలసాహిత్యంతో మీ పరిచయం గురించి చెప్పండి?



నెల్లూరు జిల్లా, రాపూరు మా సొంత వూరు. చెట్టు కింద బళ్ళో నా గురువులు తెలుగు చదవడం రాయడం నాలుగవ తరగతికే బాగా నేర్పించారు. అప్పటి నుండే మా ఊర్లో వున్న గ్రంథాలయానికి వెళ్ళి బాలసాహిత్యాన్ని చదవ సాగాను. అది గమనించి మా నాన్న బొమ్మల రామాయణం, భాగవతం, భారతం కొని తెచ్చి చదివించారు. ఏడవ తరగతి వరకు రాపూరులో చదివిన తర్వాత నాన్నకు ట్రాన్స్‌ఫర్ కావడంతో గూడూరు చేరాను. గూడూరు గ్రంథాలయం లోని బాల సాహిత్యం అంతా చదివాను. తిరుపతిలో యూనివర్సిటీలో ఎం.ఏ చదువుతున్నప్పుడు ప్రొఫెసర్ జి. నాగయ్య బాల సాహిత్యం మీద పరిశోధనకు ప్రోత్సహించి తానే గైడ్‌గా వ్యవహరించారు. బాలల పత్రిక 'చందమామ'లో రెండేళ్ళ పాటు ఉపసంపాదకుడిగా పనిచేశాను. ఎనిమిదవ తరగతి చదివేటప్పుడే మొదటి కథ రాశాను. ఇప్పటికీ రాస్తున్నాను. కొడవటిగంటివారికి నేను ఏకలవ్యశిష్యుణ్ణి. ఆయనలా రాయాలని ఇప్పటికీ ప్రయత్నిస్తుంటాను.

ఇక్కడ బాలసాహిత్యంపై కొంత చిన్నచూపు ఉంది, నిజమేనా?

కొంతమందిలో వుండవచ్చు. అందరిలో కాదు. చిన్ననాటి నుండే మౌలిక భావాలను నాటేది బాల సాహిత్యమే. మొక్కై వంగనిది మానై వంగదు కదా. ఇది చాలామంది ఇప్పుడు గుర్తించి బాల సాహిత్యాభివృద్ధికి దోహదం చేస్తున్నారు. కానీ ఇంకా చాలా జరగాలి. ప్రతి పాఠశాల లోనూ గ్రంథాలయం వుండాలి. పిల్లలకోసం వర్క్‌షాప్‌లు నిర్వహించాలి. తెలంగాణలో పిల్లల చేత రచనలు చేయించి పుస్తకాలుగా ప్రచురిస్తున్నారు. ఆ సంప్రదాయం ఇంకా పెరగాలి. పిల్లల పత్రికల ప్రచురణకు ప్రభుత్వం తోడ్పడాలి.

బాల సాహిత్యం అనగానే బాలలకు మాత్రమే అనీ అనుకోకూడదు. ఈ సాహిత్యాన్ని ఆసక్తిగా చదివే పెద్దలు కూడా ఉంటారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ప్రతి నెలా 'చందమామ' కోసం ఎదురు చూసేవారట. 'చందమామ' ముందు బాలల పత్రికగా ప్రారంభం అయినప్పటికీ క్రమంగా అది 'ఆబాలగోపాల పత్రిక' అయిందని చక్రపాణి గారు చెప్పేవారు.

ఇంటర్వ్యూ
■ ఈతకోట సుబ్బారావు

కథా సాహిత్యంపై ప్రసంగం

తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ, రూం.నెం. 208లో జూన్ 30 మధ్యాహ్నం 'కథా సాహిత్యం – గ్రామీణ జీవనం' అంశంపై ఆర్. సి. కృష్ణస్వామి రాజు ప్రసంగిస్తారు.

తెలుగు సాహితీ సమితి

పెన్నా పురస్కారాలు

పెన్నా రచయితల సంఘం 2023, 2024 సంవత్సరాలకు గాను ప్రకటించిన కవిత్వ సంపుటాల పోటీలో పాయల మురళీకృష్ణ 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ', మిరప మహేష్ 'పడమటీది నాటకం' కవితా సంపుటులు ఎంపికయ్యాయి. జూలై రెండవ శనివారం నెల్లూరు టౌన్ హాల్ రీడింగ్ రూంలో పురస్కార ప్రదానం జరుగుతుంది.

గోవిందరాజు సుభద్రా దేవి

'మా కథలు 2024'

వేదగిరి రాంబాబు జయంతి నాడు అక్టోబర్ 14న వెలువడే 'మా కథలు 2024' సంకలనంలో ప్రచురణకు 2024లో పబ్లిష్ ఐన కథలను ఆగస్ట్ 18 లోపు అడ్రస్: సి.హెచ్. శివరామ ప్రసాద్, స్వగృహ అపార్ట్‌మెంట్, 'సి' బ్లాక్, జి-2, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్ – 500072కు పంపాలి. వివరాలకు: 93900 85292.

తెలుగు కథా రచయితల వేదిక

'కళామందిరం' వార్షికోత్సవం

తెలుగు భాషా సేవా కార్యక్రమాల కోసం పలమనేరులో నిర్మించిన కళామందిరం మూడవ వార్షికోత్సవ వేడుక జూలై 6న జరుగుతుంది. ఈ సందర్భంగా వందకు పైగా పద్యాలు చెప్పగలిగే 60 మంది పిల్లలకు బహుమతులతోపాటు, తెలుగు భాషా రక్షణకు కృషి చేస్తున్న 15 మందికి వార్షికోత్సవ పురస్కారాలతో సత్కారం ఉంటుంది.

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి

'ఓ మారు వెనక్కి వెళ్ళి రావాలి' కవిత్వం

కె. దివాకరాచారి కవితా సంపుటి 'ఓ మారు వెనక్కి వెళ్ళి రావాలి' ఆవిష్కరణ సభ జూలై 6 ఉ.10 గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. నిఖిలేశ్వర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. సభలో ఎన్. వేణుగోపాల్, నాళేశ్వరం శంకరం, కవి యాకూబ్, పి. జ్యోతి, ఆనంద్ ప్రసంగిస్తారు.

గుడిపాటి



నీడగా మారాక

బ్రతుకంతా పదహారేళ్ళ ప్రాయంగా తోస్తుంది
బద్ధకమనేది దరిదాపులకైనా రాకుండా పారిపోతుంది
చిరుచిరుచీకట్లలోనే తెల్లవారుతుంది
చిరునవ్వులతోనే ప్రతిరోజూ మొదలవుతుంది

ప్రపంచం పరుగులు తీసే గమ్యాలన్నిటినీ
కంటిచివరి నుంచి చూసి మనసు తలతిప్పుకుంటుంది
మనోలోకమనే కొలనులో ఒక్క రాయైనా విసరకుండా
రోజు గడిచిపోవడం తెలుస్తుంది

కనుల నిండుగా ఒకటే రూపం
మౌనంగా మరల మరల అదే నామం
తిరుగుబోతు మనసుకు ఎటు వెళ్ళినా
అతని చేయి విడువననే పంతం
విరహంలా కనిపించే సంయోగం
విముక్తిని కోరని వైభోగం

సూర్యుడు వెళ్తున్నపుడూ
చంద్రుడు మెల్లమెల్లగా వస్తున్నపుడూ
కనుల ముందు మనోసంద్రాన్ని ఉప్పొంగజేసే
ఒకేఒక దరహాసం
కనులు మూసుకుంటే అతని గాఢాలింగనం
ఎప్పుడైనా ఒక కలవస్తే
అందులోనూ అతనిదే స్వైరవిహారం

■ టి. శ్రీవల్లీ రాధిక



సంబురంగా రెండో బోనం

కార్వాన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా బైలెల్లినాది.. తల్లీ బైలెల్లినాది' అంటూ సాగిన జానపద గీతాలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల దరువుల మధ్య గోల్కొండ జగదాంబిక అమ్మవారికి భక్తులు ఆషాడమాసం 2వ బోనం సమర్పించారు. ఆదివారం భారీ సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు రెండో పూజను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు, తొట్టెలను సమర్పించారు. ఈ సందర్భంగా పోలీసులు గోల్కొండ కోటతో పాటు పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా ఘటం ఎదుర్కోలు

సికింద్రాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఘటం ఎదుర్కోలు ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనీల్‌కుమార్‌యాదవ్ వేసిన స్టెప్పులు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారి ఘటాన్ని కర్బలా మైదానానికి తీసుకువెళ్లి, అక్కడ అలంకరించారు. రాత్రి అమ్మవారి ఘటం ఉజ్జయినీ మహాకాళి ఆలయం చుట్టుపక్కల ఏరియాల్లో ఊరేగించారు.


సికింద్రాబాద్‌లో ఘటం ఊరేగింపు

బల్కంపేట పరిసరాల్లో నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఒకటో తేదీన జరగనున్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం, 2న జరిగే రథోత్సవం నేపథ్యంలో నగరంలో 3 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. జూన్ 30 నుంచి జూలై-2 వరకు గ్రీన్‌ల్యాండ్స్, మాతా టెంపుల్, సత్యం థియేటర్, ఫతేనగర్ ఫ్లైవోవర్, బకుల్ అపార్టుమెంట్స్, బేగంపేట, కట్టమైసమ్మ ఎస్ఆర్‌నగర్ టీ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

భక్తుల పార్కింగ్ స్థలాలు..

- ఎస్ఆర్‌నగర్ టీ జంక్షన్ సమీపంలో ఆర్అండ్‌బీ కార్యాలయం
- ఫుడ్ వరల్డ్ ఎక్స్‌రోడ్డులోని జీహెచ్ఎంసీ గ్రౌండ్
- నేచర్ క్యూర్ హాస్పిటల్ పార్కింగ్
- ఫతేనగర్ రైల్వే వంతెన కింద పార్కింగ్

ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ : **9010203626**



చీరకట్టు.. మోడ్రన్ డ్రెస్‌లో అదిరేట్టు..

వినూత్న కలెక్షన్‌తో హ్యామ్స్‌టెక్ విద్యార్థుల సందడి

6

విద్యుత్ బిల్లుల వసూళ్లలో అత్యుత్సాహం

గడువుకు ముందే కనెక్షన్లు కట్ చేస్తున్న సిబ్బంది

- ఏడీఈ, ఏఈల ఆదేశాలతో ఆర్టిజన్ల ఓవర్ యాక్షన్
- రూ. వెయ్యి బిల్లు పెండింగ్ పడినా కనెక్షన్ కట్
- హెచ్‌టీలో బిల్లులు రూ.కోట్లలో పెండింగ్ ఉన్నా ఫోకస్ నిల్



జూన్‌లో నెల బిల్లు రూ. 912

రీ కనెక్షన్ చార్జీ రూ. 75



- సీతాఫల్‌మండిలో ఓ వినియోగదారుడికి జూన్‌లో రూ.912 విద్యుత్ బిల్లు వచ్చింది. బిల్లు డ్యూ డేట్ జూన్ 19. పాత బిల్లులేవీ బకాయి లేదు. అయితే, డ్యూ డేట్‌లోపు బిల్లు చెల్లించలేకపోయాడు. దీంతో శనివారం ఆర్టిజన్ వచ్చి కరెంట్ కట్ చేశాడు. డిస్‌కనెక్షన్ చేసేందుకు మరో ఐదురోజుల (జూలై 3వరకు) సమయం ఉంది కదా, ఆ లోపు చెల్లిస్తానని చెప్పినా వినలేదు. ఏఈకి ఫోన్ చేసినా బిల్లు చెల్లిస్తే కనెక్షన్ అంటూ దురుసుగా సమాధానం ఇచ్చాడు. విధిలేక ఆన్‌లైన్‌లో బిల్లు చెల్లించాడు. తిరిగి రీ కనెక్షన్‌కు మరో రూ.75 చార్జీ బాదారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లుల వసూళ్లలో కొంతమంది ఏఈల అత్యుత్సాహంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోట్లలో బకాయిలు పడిన బిల్లులు పట్టించుకోకుండా వెయ్యి రూ.రెండువేల బకాయిలున్న వినియోగదారులే లక్ష్యంగా పలు సెక్షన్లలో అధికారులు వేధింపులకు దిగుతున్నారు. బిల్లు చెల్లించే తేదీ తర్వాత డిస్‌కనెక్షన్‌కు వారం రోజుల

మిగతా 6వ పేజీలో..

వసూళ్ల నోట్‌బుక్!



కొందరు ఎస్ఐల రూటే సెప'రేటు'

- ఎవరి దగ్గర ఎంత వసూలు చేయాలో నోట్‌బుక్‌లో రాతలు
- పోలీస్ స్టేషన్లలో కేసును బట్టి కాసుల బేరం
- ఫస్ట్ టార్గెట్ సొంతిల్లు.. నెక్స్ట్ ఖరీదైన కారు
- ఎస్ఐగా ఉన్నప్పుడే సెటిల్ అయిపోవాలనే ఆరాటం
- క్షేత్రస్థాయిలో పలువురి అక్రమాలు
- సెక్టార్ల వారీగా వసూళ్ల దందా

తన సెక్టార్‌లో ఎవరి వద్ద ఎంత వసూలు చేయాలి? ఏ పేరుతో డబ్బు రాబట్టాలి? అనేది ఓ నోట్‌బుక్‌లో రాసుకొని మరీ ఆ ఎస్ఐ వసూళ్ల దందాకు పాల్పడుతున్నాడు. అందుకే ఎస్ఐ స్థాయిలోనే పెద్ద ఇల్లు కొనగలిగాడని, దాన్ని వసతిగృహంగా మార్చి అద్దెకు ఇచ్చుకున్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. పశ్చిమ మండలం మెట్రో జంక్షన్ లిమిట్స్‌లో ఉన్న ప్రధాన పోలీస్‌స్టేషన్ (గతంలో సిటీలో అతిపెద్ద పోలీస్ స్టేషన్)లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అక్రమాలకు అడ్డూ అదుపూ ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల పశ్చిమ మండలంలో నమోదైన ఓ గంజాయి కేసులో తలదూర్చిన ఎస్ఐ.. నిందితులకు బెయిల్ మంజూరు చేయించడానికి రూ. 2లక్షలు వసూలు చేశాడు. అప్పటికి అతడు పనిచేసేది వేరే స్టేషన్‌లో అయినప్పటికీ, గతంలో ఆ సెక్టార్‌లో పనిచేసిన అనుభవంతో కేసు రాగానే పసిగట్టి బేరం మాట్లాడినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి ఎస్ఐపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

హైదరాబాద్ సిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అక్కడ వారు చెప్పిందే వేదం.. చేసేదే న్యాయం అనేలా కొందరు ఎస్ఐల తీరు మారింది. ఉద్యోగంలో చేరింది మొదలు వెంటనే సెటిల్ అయిపోవాలనే కాంక్షతో అవినీతి దారుల్లో పయనిస్తున్నారు. తమకంటూ ప్రత్యేకంగా ఓ నోట్‌బుక్‌ను పెట్టుకుని సెక్టార్ల వారీగా అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. ఎస్ఐగా ఉండగానే మొదట సొంతిల్లు, తర్వాత ఖరీదైన కారు కొనుక్కోవాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఇప్పుడున్న అవకాశం తర్వాత వస్తుందో రాదో తెలియదు.. ఇన్‌స్పెక్టర్ అయిన తర్వాత పోస్టింగ్‌లు వస్తాయో రావో.. వచ్చినా అప్పటి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయో ఉండవో అన్న కోణంలో పలువురు ఎస్ఐల తీరు ఉన్నట్లు తెలుస్తోంది.

సెటిల్‌మెంట్లలో బిజీ..

ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సెక్టార్ ఎస్ఐల హవా కొనసాగుతోంది. చిన్న పంచాయితీ మొదలుకొని పెద్దపెద్ద సెటిల్‌మెంట్ల వరకు వారే సెటిల్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అనుచరులను ఏర్పాటు చేసుకొని ఎక్కడ ఏం జరిగినా వెంటనే తెలుసుకొని సెటిల్‌మెంట్లు చేస్తూ అడ్డంగా దోచేస్తున్నారు. ఆ తర్వాత పై స్థాయిలో ఎంతో కొంత ముట్టజెప్పి కేసులను

మిగతా 6వ పేజీలో..



ఏఐతో గొంతు మార్చి.. ఏమార్చి..

ఎన్నారై బంధువులు, స్నేహితుల ఫొటోలతో చాటింగ్

పలు కారణాలు చెప్పి డబ్బు వసూలు చేస్తున్న సైబర్ నేరగాళ్లు

పెరుగుతున్న కేసులు.. అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు 6



డీసీపీ సురేష్‌కుమార్‌కు ఉత్కృష్ట సేవా పతకం

6



వాటర్ బోర్డు.. పాలనలో మార్పు

6

- మెరుగైన సేవలకు స్పెషల్ డ్రైవ్‌లు

అద్దె చెల్లించలేదంటూ కిరాయి గూండాలతో హోటల్ ఖాళీ

మనస్తాపంతో నిర్వాహకుడి ఆత్మహత్య

ఇరువర్గాలపై కేసులు.. అయ్యప్ప సొసైటీలో ఘటన


ఆదినారాయణ(ఫైల్)

హైటెక్ సిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా అద్దె చెల్లించడం లేదంటూ కిరాయి గూండాలతో హోటల్‌ను బలవంతంగా ఖాళీ చేయించారు. మనస్తాపం చెందిన హోటల్ నిర్వాహకుడు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్రగాయాలకు గురైన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈనెల 27న జరిగిన ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన లక్కంశెట్టి ఆదినారాయణ భార్య తులసీతో కలిసి సుమారు 20ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చాడు. అయ్యప్ప సొసైటీలో

మిగతా 6వ పేజీలో..

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

జిల్లా నేతలతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

పార్టీ కోసం కష్టపడే వారికే నామినేటెడ్ పోస్టులు: మంత్రి పొన్నం


సమావేశంలో మహేష్‌గౌడ్, మంత్రి పొన్నం తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో డివిజన్ స్థాయిలో కమిటీలతో పాటు, బూత్ స్థాయి నేతలను ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. గాంధీభవన్‌లో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశం మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ జూలై 4న ఎల్‌బీ స్టేడియంలో జరిగే ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సభకు అన్ని నియోజకవర్గాల ముఖ్య నేతలు తరలిరావాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నాయకత్వం ఖర్గే సభ ఏర్పాట్లలో చురుకుగా ఉండాలని అన్నారు. హైదరాబాద్‌లో పార్టీకి సంబంధించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడుతున్న వారికి నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ స్థానం కైవసం చేసుకోవాలని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఇప్పటి నుంచే గ్రౌండ్‌లెవెల్‌లో ప్రణాళిక ద్వారా ముందుకు సాగాలని తెలిపారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, గణేష్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మీర్ అలీఖాన్, డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కూల్చివేతలు నిర్వహిస్తున్న హైడ్రా సిబ్బంది

ఆక్రమణలను తొలగించిన హైడ్రా

- రూ.30కోట్ల విలువైన పార్కు స్థలానికి విముక్తి

బంజారాహిల్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట పరిధిలోని మధురానగర్‌లో ఎన్నో ఏళ్లుగా కబ్జాకు గురైన 1,533 గజాల పార్కు స్థలానికి ఎట్టకేలకు విముక్తి లభించింది. హైడ్రా అధికారులు కబ్జాలోని కట్టడాలను ఆదివారం కూల్చి పార్కు స్థలంగా బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో సుమారు రూ.30కోట్ల విలువైన స్థలం స్థానికులకు అందుబాటులోకి వచ్చినట్లయింది. అమీర్‌పేట నుంచి యూసుఫ్‌గూడకు వెళ్లే దారిలో

మిగతా 6వ పేజీలో..

భార్యాభర్తల ఏకాంత సంభాషణనూ ట్యాప్ చేశారు..


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

పేట్‌బషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు ఏకాంతంగా మాట్లాడే ఫోన్లను సైతం ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. రహస్యంగా సంభాషణ విని వారి సంసారాలను విడగొట్టారని ఆయన ఆరోపించారు. దూలపల్లిలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బీఆర్ఎస్ పార్టీలో ఉండగానే తన ఫోన్, కుటుంబసభ్యుల ఫోన్‌లను సైతం ట్యాప్ చేశారని మైనంపల్లి ఆరోపించారు. అంతేకాకుండా జడ్జిల ఫోన్‌లను సైతం రికార్డింగ్ చేసి లొంగదీసుకున్న ఘనత కేసీఆర్, కేటీఆర్‌లదేనని ఆయన మండిపడ్డారు. ఓ న్యూస్ చానల్ కార్యాలయంపై బీఆర్ఎస్ వర్గీయులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. మీడియాపై దాడులు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలోనే ఈ తతంగం అంతా జరగాలన్నారు. బీఆర్ఎస్ నేతలైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ఇక మీదట నిద్రలేని రాత్రులు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి వ్యవసాయ సహకార బ్యాంకు అధ్యక్షులు నరేందర్, కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్, అంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో 454 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో 454 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్రవాహనదారులు 372మంది, మూడు చక్రాల వాహనదారులు 22, నాలుగు చక్రాల వాహనదారులు 57మంది, మూడు భారీ వాహనాల డ్రైవర్లు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారని పేర్కొన్నారు.

నిన్ను కూడా లోపల వేస్తా..

- ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిని ఫోన్‌లో హెచ్చరించిన ఇన్‌స్పెక్టర్
- బోరబండ ఠాణాకు అధికసంఖ్యలో యూత్, కాంగ్రెస్ శ్రేణులు
- స్టేషన్ వద్ద ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జ్

బోరబండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బస్తీ సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అంశంపై తలెత్తిన చిన్న వివాదం చినికి చినికి గాలివానగా మారింది. బోరబండ ఠాణా వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. పెద్ద ఎత్తున ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ శ్రేణులు ఠాణా వద్దకు చేరుకుని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఠాణాలోకి చొచ్చుకువెళ్లేందుకు యత్నించగా పోలీసులు లాఠీచార్జి చేశారు. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు ఉద్రిక్తత సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ టి.అంజయ్యనగర్ బస్తీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. బస్తీకి ఎన్నికలు నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ నాయకుడు, స్థానికుడు శివ డిమాండ్ చేశారు. అయితే తాను బస్తీకి అధ్యక్షురాలిగా కొనసాగుతుండగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారంటూ ఆండాళు అభ్యంతరం వ్యక్తం చేశారు. బస్తీ వాసులను తప్పుదోవ పట్టించేలా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో మాటా మాటా పెరిగడంతో శివపై.. ఆండాళు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు శివను ఠాణాకు తరలించారు. తనను పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తున్నారని శివ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో వెంకటస్వామి ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్‌కు ఫోన్ చేసి శివ విషయం అడిగాడు. 'స్టేషన్‌కు వస్తే నిన్ను కూడా లోపలేస్తా..' అంటూ


పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి

మిగతా 8వ పేజీలో..

ఏఐతో గొంతు మార్చి.. ఏమార్చి..

- ఎన్నారై బంధువులు, స్నేహితుల ఫొటోలతో చాటింగ్
- పలు కారణాలు చెప్పి డబ్బు వసూలు చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- పెరుగుతున్న కేసులు.. అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల గురించి ప్రజల్లో అవగాహన పెరుగుతున్న తరుణంలో నేరగాళ్లు కొత్తదారులు వెతుకుతున్నారు. విదేశాల్లో ఉన్న బంధువులు, స్నేహితుల పేర్లు చెప్పి మోసాలకు తెగబడుతున్నారు. వాట్సా్ప్‌లో సదరు వ్యక్తుల ఫొటోలు పెట్టి చాటింగ్ చేస్తున్నారు. ఏఐని వినియోగించి వారి గొంతులను అనుకరిస్తున్నారు. అరెస్ట్, కేసులు, వీసా సమస్య అంటూ పలు కారణాలు చెప్పి అందినంత వసూలు చేస్తున్నారు. నగర సైబర్ క్రైం ఠాణాకు నెల వ్యవధిలో ఈ తరహా సైబర్ మోసాలపై పలు ఫిర్యాదులు అందాయి. కొత్త నంబర్ల ద్వారా విదేశాల్లో ఉంటున్న స్నేహితులు, బంధువుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని.. నేరుగా మాట్లాడిన తర్వాతే ఆర్థిక లావాదేవీలు చేయాలని, సైబర్ నేరం జరిగినట్లు గ్రహిస్తే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

- ఈదీబజార్‌కు చెందిన ఓ వ్యక్తికి వరుసకు సోదరుడు సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. ఈనెల 25న అతడి ఫొటోతో ఉన్న వాట్సాప్ నంబర్ ద్వారా సైబర్ నేరగాడు బాధితుడితో చాటింగ్ చేశాడు. తాను పెద్ద మొత్తంలో డబ్బు పంపుతానని, బ్యాంక్ ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తదితర వివరాలు అడిగితే చెప్పాడు. కొద్దిసేపటి తర్వాత డబ్బు బదిలీ చేశానని చెబుతూ దానికి సంబంధించి సిటీ బ్యాంక్ ఓచర్ పంపించాడు. వీసా సమస్య పరిష్కరిస్తాడంటూ ఏజెంట్ నంబర్ ఇచ్చాడు. ట్రావెల్ ఏజెంట్ డబ్బు డిమాండ్ చేయడంతో నీ ఖాతాలోకి డబ్బులు వస్తాయి కదా.. ముందు డబ్బు కట్టమని సూచించాడు. మోసం గురించి బాధితుడు తెలుసుకునేలోగా సైబర్ నేరగాళ్లు పలు దఫాలుగా రూ. 1.90 లక్షలు వసూలు చేశారు.



- నగరానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి స్నేహితుడు యూకేలో ఉంటున్నాడు. యూకేలో ఉన్న వ్యక్తి ఫొటోతో ఉన్న కొత్త నంబర్ నుంచి ఫోన్ చేసిన సైబర్ నేరగాడు తాను ఇండియా వస్తున్నానని చెప్పాడు. తర్వాత ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నానని, విదేశీ కరెన్సీ తీసుకురావడంతో ఎయిర్‌పోర్ట్‌లో ఇన్‌కంట్యాక్స్ అధికారులు అడ్డుకున్నారని చెప్పాడు. కస్టమ్ అధికారినంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడు క్లియరెన్స్ పేరుతో పలు దఫాలుగా రూ 2.05 లక్షలు వసూలు చేశాడు.

- సౌదీలో ఉంటున్న తమ్ముడి ఫొటోను డీపీగా పెట్టిన క్రిమినల్స్.. నగరంలో ఉంటున్న అన్నను బురిడీ కొట్టించి రూ. 1.19 లక్షలు కాజేశారు. బాధితుడి తమ్ముడి ఫొటో వాట్సాప్ డీపీలో పెట్టుకున్న సైబర్ నేరగాడు కుటుంబ సభ్యులతో చాటింగ్ చేశాడు. డబ్బు పంపుతున్నానని ఖాతా నంబర్‌లు తీసుకొని, డబ్బు పంపినట్లు నకిలీ రసీదు పంపించి 24 గంటల్లో ఖాతాలో జమ అవుతాయన్నాడు. కొద్దిసేపటి తర్వాత అదే నంబర్ నుంచి మరో వ్యక్తి ఫోన్ చేసి తాను సౌదీ ఎంబసీ నుంచి మాట్లాడుతున్నానని, వీసా గడువు ముగిసిన కారణంగా మీ తమ్ముడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పాడు. వీసా పునరుద్ధరణ, టికెట్ ఖర్చు అంటూ రూ.1.19 లక్షలు వసూలు చేశాడు.
- నగరానికి చెందిన మహిళకు సైబర్ నేరగాళ్లు ఇటీవల ఫోన్ చేసి విదేశాల్లో ఉంటున్న మీ కుమార్తెను డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేశామని చెప్పారు. కేసు నుంచి బయటపడాలంటే డబ్బు కట్టాలని డిమాండ్ చేశారు. కుమార్తె భవిష్యత్ గురించి ఆందోళన చెందిన మహిళ నుంచి అందినంత వసూలు చేశారు. కుమార్తె క్షేమంగా ఉందని తెలుసుకునే వరకు వసూళ్ల పర్వం కొనసాగింది.

వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు

ముగ్గురి దుర్మరణం

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు, కారు ఢీకొని ఓ వ్యక్తి, ఆర్టీసీ బస్సు ఢీకొని మేకప్‌మన్ దుర్మరణం చెందారు. బోడుప్పల్ రాజీవ్‌నగర్‌కు చెందిన పాడియ సురేష్(24) ఈనెల 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్నేహితుడితో కలిసి షాపింగ్ చేయడానికి కూకట్‌పల్లి వెళ్లాడు. రాత్రి 10 గంటలు అవడంతో ఆదివారం ఉదయం వస్తానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. తెల్లవారుజామున 4 గంటలకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పాడు. ఉదయం 5 గంటలకు కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో మెట్రో పిల్లర్ 839 వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అప్పటికే అక్కడికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సురేష్ (ఫైల్)

కారు ఢీకొని..

దుండిగల్: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భరత్(39) అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం 4 గంటలకు గండిమైసమ్మ నుంచి దుండిగల్‌కు బైక్‌పై బయలుదేరాడు. రోటరీ-1 వంతెన దాటుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

బోరబండ: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం రాత్రి చిత్రపురి కాలనీకి చెందిన మేకప్‌మన్ వేణుగోపాల్(52) బైక్‌పై వెళ్తున్నాడు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టింది. వేణుగోపాల్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మధురానగర్ పోలీసులు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీసీపీ సురేష్‌కుమార్‌కు ఉత్కృష్ట సేవా పతకం

జీడిమెట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో విశిష్ట కృషి చేసిన బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట సేవా పతకం ప్రకటించింది. 15 సంవత్సరాలుగా ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో మావోయిస్టు కార్యకలాపాలు నిరోధించడంలో ఆయన పనిచేశారు. ఆసిఫాబాద్ జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు చేసి గుర్తింపు పొందారు.



అంబేడ్కర్ వర్సిటీలో డిజిటల్ డిప్లొమా, జర్నలిజం కోర్సులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో ఈ ఏడాది నుంచి డిజిటల్ డిప్లొమా, జర్నలిజం కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయని ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాస్ వడ్డాణం తెలిపారు. వివరాల కోసం అంబేడ్కర్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, లేదా 040-23680222/333/444/555 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఆక్రమణలను తొలగించిన హైడ్రా

(5వ పేజీ తరువాయి)

మధురానగర్ మెట్రో స్టేషన్ ఎదుట సాయి సారథినగర్‌కు చెందిన 1,533 గజాల పార్కు స్థలం ఉంది. చాలా కాలం క్రితం కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేశారు. చుట్టూ ఫుట్‌పాత్ వ్యాపారాలు వచ్చాయి. కాలనీ వాసులు అనేకసార్లు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇటీవల ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపిన అధికారులు ఆక్రమణ వాస్తవమేనని తేల్చారు. ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేసి పార్కు సూచిక బోర్డును ఏర్పాటుచేశారు.

'సైబర్ భద్రత-భవిష్యత్ సవాళ్లపై అవగాహన సదస్సు శాస్త్రవేత్తలు, నిపుణులకు ఉపయోగకరం'

కొత్తపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సైబర్ భద్రత-భవిష్యత్ సవాళ్లు - పరిశోధనాత్మక అవగాహన సదస్సు యువ సైబర్ శాస్త్రవేత్తలు, నిపుణులకు ఎంతగానో ఉపయోగపడిందని సీ-డాక్ హైదరాబాద్ సైబర్ సైంటిస్ట్-జి డాక్టర్ పీఆర్ లక్ష్మీ ఈశ్వరి, సైబర్ సైంటిస్ట్- జి డా.సీహెచ్ఏఎస్ మూర్తి, సైంటిస్ట్-ఎఫ్ డా. ఇంద్రవేణి తెలిపారు. న్యూ ఢిల్లీలో కేంద్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ సీ-డాక్ ఇండియా, సీ-మెట్ ఇండియా, సమీర్-ఆర్ అండ్ డీ సంస్థలు సంయుక్తంగా టెక్‌వర్స్ - 2025 సదస్సును ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించాయి. సీ-డాక్-ఐఎస్ఈఏ హైదరాబాద్ నిపుణులు ఓ స్టాల్ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ దేశంలోని సైబర్ భద్రత నిపుణులు, వివిధ మంత్రిత్వ శాఖల అధికారులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్టార్టప్‌ల ప్రతినిధులు సమన్వయంతో సృజనాత్మక పరిశోధనాంశాలను తెరపైకి తేవడం భవిషత్ సైబర్ భద్రతకు ఎంతగా ఉపకరిస్తుందో సదస్సు రుజువు చేసిందన్నారు.

బాలబాలికల విద్యా స్పాన్సర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని 18 ఏళ్లలోపు బాలబాలికల చదువుకు కావాల్సిన స్పాన్సర్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి అక్కేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు, ఆర్థికంగా ఇబ్బంది బాధపడుతున్న కుటుంబ యజమాని పిల్లలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెత్, మెడికల్ సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్‌కార్డు, పాఠశాల నుంచి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుసైజ్ ఫొటో జతచేసి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఎంపికైన 150 మందికి ప్రతినెల రూ.4వేలు బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతాలో జమచేస్తామన్నారు. దరఖాస్తులను జూలై 22వ తేదీలోగా హైదరాబాద్ కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్ జూబ్లీ బిల్డింగ్‌లో ఉన్న జిల్లా బాలల రక్షణ విభాగం కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

విద్యుత్ బిల్లుల వసూళ్లలో అత్యుత్సాహం

(5వ పేజీ తరువాయి)

సమయమున్నా కొంతమంది ఆర్టిజన్లు విద్యుత్ కనెక్షన్ కట్‌చేస్తూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. హెచ్‌టీ కేటగిరిలో గ్రేటర్ పరిధిలో రూ. 250కోట్ల బిల్లులు బకాయిలు ఉన్నా వాటి వసూళ్లను సీరియస్‌గా తీసుకోని దక్షిణ డిస్కం ఉన్నతాధికారులు గృహ, కమర్షియల్ కేటగిరి కనెక్షన్లకు టార్గెట్లు పెడుతున్నారంటూ కొంతమంది అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌టీలో మొండిబకాయిలు రూ. 250 కోట్లు

హెచ్‌టీ కేటగిరిలో మే 31 నాటికి 511 విద్యుత్ కనెక్షన్ల నుంచి రూ. 249.21 కోట్లు మొండి బకాయిలు పేరుకుపోయాయి. రంగారెడ్డి జోన్‌లో 167 కనెక్షన్లకు రూ. 177.51 కోట్లు, మేడ్చల్ జోన్‌లో 313 కనెక్షన్లకు రూ. 65.75 కోట్లు, మెట్రో జోన్‌లో 31 కనెక్షన్లకు రూ. 5.95 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. అయినా వాటి వసూళ్లకు పెద్దగా చర్యలు చేపట్టని దక్షిణ డిస్కం సామాన్యుల నుంచి బిల్లుల వసూళ్లకు కొరడా ఝళిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కూకట్‌పల్లిలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కిరాయిదారుడు విద్యుత్ బిల్లు వెయ్యి రూపాయలు చెల్లించలేదు. అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన ఆర్టిజన్ రెండురోజుల్లో బిల్లు చెల్లించకపోతే అపార్ట్ మొత్తానికి విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని చెప్పడంతో ఇతర ఫ్లాట్లలో ఉండే వారంతా అతడితో గొడవకు దిగిన పరిస్థితి నెలకొంది.

ఆర్టిజన్లు, బిల్‌కలెక్టర్ల ఓవర్ యాక్షన్

గ్రేటర్‌లో పలు సెక్షన్లలో కొంతమంది ఆర్టిజన్లు, బిల్ కలెక్టర్లు విద్యుత్ బిల్లుల వసూళ్లలో ఓవర్ యాక్షన్ చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొంతమంది ఆర్టిజన్లు అధికారుల అండతో సెక్షన్‌స్థాయిలో ప్రైవేట్ పనులు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆర్టిజన్లు ఏళ్లతరబడి బదిలీలు లేకుండా ఒకే ప్రాంతంలో పనిచేస్తుండటంతో కొంతమంది అధికారులను బెదిరించే వరకు వెళ్తున్నారు. శివారు సర్కిళ్లు రాజేంద్రనగర్, హబ్సిగూడ, సరూర్‌నగర్, సంగారెడ్డి, మేడ్చల్, సైబర్‌సిటీలో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. కళ్యాణ్‌నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ మీటర్‌లో సమస్య ఉందని ఈ నెల 13న టీజీఎస్పీడీసీఎల్ యాప్‌లో ఫిర్యాదు చేసి, రూ. 100 మీటర్ టెస్టింగ్ చార్జీలు చెల్లించినా ఇప్పటివరకు సమస్యను పరిష్కరించలేదని వినియోగదారుడు నాగ వెంకట్ తెలిపారు.

అద్దె చెల్లించలేదంటూ కిరాయి గూండాలతో హోటల్ ఖాళీ

(5వ పేజీ తరువాయి)

ఐదు వందల గజాల స్థలాన్ని సుధారాణి అనే మహిళ నుంచి 2021లో అద్దెప్రాతిపదికన తీసుకుని లక్ష్మీతులసీ పేరుతో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ప్రతియేటా అద్దె పెరుగుతూ వచ్చింది. అయితే, 2024-25లో అద్దె సరిగా ఇవ్వడం లేదని, హోటల్‌ను ఖాళీ చేయాలని ఆ స్థల యజమాని సూచించింది. ఆ స్థలాన్ని మరొకరికి లీజుకు ఇచ్చింది. అయినా, హోటల్‌ను ఖాళీ చేయకపోవడంతో సుధారాణి కిరాయి గూండాలను పంపగా.. వారు ఈనెల 27న హోటల్లోని సామగ్రిని బలవంతంగా బయట పడేశారు. ఆదినారాయణ కళ్లెదుటే అతడి భార్యను కొట్టడంతో హార్ట్‌పేషెంట్ అయిన అతను బతుకుదెరువు పోయిందని మనస్తాపం చెందుతూ ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ఇరువురిపై కేసు నమోదు

స్థలం అద్దె చెల్లించడం లేదని, ఒప్పంద గడువు ముగిసినా హోటల్ ఖాళీ చేయలేదంటూ స్థల యజమాని సుధారాణి ఫిర్యాదు మేరకు ఆదినారాయణపై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. హోటల్ నుంచి బలవంతంగా ఖాళీ చేసి సామగ్రిని బయట పడేసి, ఆదినారాయణ ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన సుధారాణి, కిరాయి గూండాలపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు వారిపై కూడా కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వసూళ్ల నోట్‌బుక్!

(5వ పేజీ తరువాయి)

క్లోజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సీసీఎస్‌లో చక్రం తిప్పుతున్న ఎస్‌ఐ?

హైదరాబాద్ సీసీఎస్‌లో పనిచేస్తున్న ఓ యువ ఎస్‌ఐ అక్రమాల జోరు పెంచినట్లు తెలిసింది. ఆర్థిక మోసం కేసులు నమోదవుతున్న విభాగంలో పనిచేస్తున్న సదరు ఎస్‌ఐ వసూళ్ల దందాకు తెరతీసినట్లు సమాచారం. ఆర్థిక మోసం కేసుల్లో తాను ఎంత చెబితే అంత అన్నట్లుగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అతడి అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే.. మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇవి కాకుండా ఏసీబీ దాడుల్లో పట్టుబడుతున్న ఎస్‌ఐలు, ఇన్‌స్పెక్టర్‌ల బాగోతాలు అనేకం వెలుగులోకి వస్తున్న విషయం తెలిసిందే. ట్రై కమిషనరేట్‌లలో ఉన్నతాధికారులు పోలీస్ స్టేషన్‌ల వారీగా ప్రత్యేక దృష్టి సారిస్తే అనేక అవినీతి బాగోతాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రాజకీయ జోక్యం

రాజకీయ జోక్యంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోలేక ఉన్నతాధికారులు మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ వారిని అటాచ్ చేసినా, సస్పెండ్ చేసినా.. కొద్దిరోజుల్లోనే పలుకుబడి ఉపయోగించి మరోచోట మంచి పోస్టింగ్ తీసుకుంటున్నారని వాపోతున్నారు. కొంతమంది ఎస్‌ఐలైతే ప్రొబేషనరీ పీరియడ్ కూడా పూర్తికాకుండా అక్రమ సంపాదన కోసం ఆరాటపడుతున్నారంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. ఖాకీ డ్రస్సుంటే తాము ఏం చేసినా అడిగేవారు లేరనేలా కొందరు ఎస్సైలు ప్రవర్తిస్తున్నారని పలు సందర్భాల్లో స్వయంగా ఉన్నతాధికారులే ఆవేదన వ్యక్తం చేశారు.

పరస్పర సహకారంతోనే ప్రగతి సాధ్యం

● రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మైలార్ దేవుపల్లి డివిజన్ మార్కండేయనగర్‌లోని సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ పాలకమండలి సంకల్పించిన ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హామీ ఇచ్చారు. పాలక మండలి సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై నిర్మాణ స్థలం, నిర్మాణ ప్లాన్‌ను త్వరలో సమీక్షిస్తామన్నారు. ఆదివారం శివరాంపల్లి ప్రజా భవన్‌లో సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సంఘం రజతోత్సవ మహా సభలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరస్పర సహకారంతోనే ప్రగతి సాధ్యమన్నారు. 25 సంవత్సరాల క్రితం స్థాపించిన సత్యసాయి పొదుపు 664 మంది సభ్యులకు సేవలందిస్తూ రూ. 5 కోట్ల టర్నోవర్‌తో అభివృద్ధి పథంలో కొనసాగడం సంతోషకరమన్నారు. సంఘ వ్యవస్థాపక కార్యదర్శి, సలహాదారులు గద్దె యాదగిరి, సలహాదారులు ఎర్ర సత్యనారాయణ, గద్దె క్రిష్ణ, పగిడిమర్రి వాసు, సంఘం ఉపాధ్యక్షులు మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్‌కుమార్, సహాయ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోట పవన్ కుమార్, పాలక మండలి సభ్యులు కంది అశోక్, కె.శంకర్, వి.రమేశ్, ఎస్ నరేందర్, జి.నరేశ్, జి.ధనుంజయ్, బి.విజయ్‌కుమార్, బి.భానుచందర్ తదితరులు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్‌ను సన్మానించారు. చిన్న కాలనీ అయినా, పరస్పరం పొదుపులో దీటు మార్కండేయనగర్ బస్తీ వాసులని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంఘం సభ్యులను ఆయన అభినందించారు. సత్యసాయి సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చరిత్రకు, సాహిత్యానికి సరిహద్దులు చెరిపేసిన కొప్పర్తి సంభాషణ



కొప్పర్తి వ్యాసాల సంపుటి, సంభాషణను ఆవిష్కరిస్తున్న ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చరిత్ర, కవిత్వం వేర్వేరు అని అరిస్టాటిల్ అనే వారని, కానీ చరిత్రకు, సాహిత్యానికి సరిహద్దులు చెరిపేసిన కొప్పర్తి సంభాషణ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కొప్పర్తి రచించిన చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి సంభాషణ పుస్తకాన్ని ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిస్టరీ కాంగ్రెస్‌కు ఈ సంభాషణ ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. ఆసక్తికరమైన అంశాలను రచయిత సంభాషణలు పొందుపరిచారని, ఈ పుస్తకం చదివితే కొప్పర్తి రచనా నైపుణ్యం తెలుస్తోందన్నారు. కొత్త విజ్ఞానపరమైన అంశాలు దీనిలో ఉన్నాయన్నారు. కొప్పర్తి మూడు కవిత్వ సంపుటల సంకలనం కవిత్వం పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కవిత్వం మూర్తీభవించిన సజీవప్రాణిగా నిలిచిందన్నారు. చరిత్రకు సాహిత్యానికి ఉన్న చరిత్రను చెరిపివేసిందని, దీనిపై చర్చ జరగాలన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి దూషణపూడి సోమసుందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో కొప్పర్తి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు మద్దతు తెలిపారని అన్నారు. ఆయన నేతాజీపై రాసిన వ్యాసం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైందని గుర్తు చేశారు. ఏపీకి స్వతంత్ర అస్తిత్వం లేదని, అక్కడి ప్రజలు దీని గురించి ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. చరిత్రకు మతం ఉండదని రచయిత చాటి చెప్పారని అన్నారు. కొప్పర్తి పుస్తకాలు నేటి యువతకు మార్గదర్శనం అన్నారు. ఈ ఆవిష్కరణ సభకు ప్రముఖ కవి, విమర్శకులు వాడ్రేవు చినవీరభద్రుడు అధ్యక్షత వహించగా ప్రముఖ కవి, విమర్శకులు దర్భశయనం శ్రీనివాసాచార్య, యువకవి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల భరణి, బ్నింకు బాపు రమణల స్నేహ పురస్కారం



తనికెళ్ల భరణి, బ్నింలను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బాపు, రమణల స్నేహం ఈతరానికి ఆదర్శప్రాయమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో బాపు రమణ లోగిలి సంస్థ ఆధ్వర్యంలో ముళ్లపూడి వెంకటరమణ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, రచయిత బ్నింలకు బాపురమణల స్నేహ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ పురస్కారాల గ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నేహానికి మారుపేరుగా నిలిచే బాపు, రమణల పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనికెళ్ళభరణి చిరస్థాయి పేరు సంపాదించుకున్నారని అన్నారు. తన రచనలతో బ్నిం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిత్ మోహన్, వింజమూరి వెంకట అప్పారావు, భావరాజు పద్మిని, వేగిరాజు సుబ్బరాజు పాల్గొని పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను ఆవిష్కరించారు.

వందేభారత్ సినిమాకు స్ఫూర్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న దర్శకుడు మల్లం రమేష్

రవీంద్రభారతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దేశభక్తి, తీవ్రవాద నిర్మూలన ప్రధాన అంశాలుగా తీసుకొని నిర్మించిన వందే భారత్ (సేవ్ ఇండియా) లాంటి సినిమాలు సమాజానికి అవసరమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందే భారత్ సినిమా నిర్మాత, నటీనటులకు దేశభక్తి అవార్డులను అందజేశారు. ఇటీవల పాకిస్తాన్ యుద్ధం దృష్టిలో పెట్టుకొని వందే భారత్ చిత్రానికి అవార్డులు అందజేసినట్టు అకాడమీ చైర్మన్ ఆకుల రమేష్ ప్రకటించారు. గత ఏడాది ఈ చిత్రాన్ని విడుదల చేసిన ప్రశంసలు పొందారని తెలిపారు. సినిమా దర్శక, నిర్మాత మల్లం రమేష్ మాట్లాడుతూ... తాము చేసిన ప్రయత్నానికి గుర్తింపు లభించడం సంతోషకరమని అన్నారు. సమాజంలో దేశభక్తి పెంపొందించే ప్రయత్నంలో భాగంగా వందే భారత్ సినిమా తీశామని తెలిపారు. ఇలాంటి సినిమాలకు ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో నటీనటులు మాణిక్, ఘర్షణ శ్రీనివాస్, సురేష్ బి.కుమార్, మహతి, సత్యనారాయణ, వసంత్, భవిరి శివ, మహ్మద్ జామా, విజయ్, అనిత, సచిన్, ఆకాశవాణి ప్రభు, రవళి, అమీర్ తదితరులు పాల్గొని అవార్డులు అందుకున్నారు.



● పీసీసీ మాజీ అధ్యక్షుడు దివంగత డి.శ్రీనివాస్ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ సెక్రెటరీ మనీలాల్‌షా, నాయకులు సుధీర్‌కుమార్, రమేశ్ యాదవ్, శంకర్ సింగ్ తదితరులు - అఫ్జల్‌గంజ్, జూన్ 29(ఆంధ్రజ్యోతి)

మా దేవాలయాలను అభివృద్ధి చేయండి



పురాతన దేవాలయాల వద్ద యాదవ సంఘం ప్రతినిధులు

ఖైరతాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్ వ్యూ పార్కులో ఉన్న యాదవుల దేవాలయాలైన గాలి పోచమ్మ, కట్ట మైసమ్మను ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేయాలని ఖైరతాబాద్ యాదవ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు పార్కులో భూమికి దాదాపు 10 అడుగుల లోతులో ఉన్న ఆలయాలను పరిశీలించారు. తమ పూర్వీకులు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ అమ్మవార్ల ఆలయాలు చిన్నపాటి వర్షం వచ్చినా నీటిలో మునిగిపోతున్నాయన్నారు. తమ స్థలాన్ని వినియోగించుకొని పార్కు నిర్మించిన హెచ్‌ఎండీఏ తమ దేవాలయాలను అభివృద్ధి చేయాలని సంఘం అధ్యక్షుడు కుమార్ యాదవ్, ఆలయాల కమిటీచైర్మన్ జి.కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ఆలయాల్లో పూజలు నిర్వహించే యాదవులకు పార్కులోకి ఉచితప్రవేశాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు పాండుయాదవ్, భవానికృష్ణయాదవ్, మారయ్య యాదవ్, కృష్ణ యాదవ్, పకీరయ్య యాదవ్, రవియాదవ్, రాజేందర్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్, రాముయాదవ్, మల్లికార్జున్ యాదవ్, గంగాధర్ యాదవ్, వెంకటేష్‌యాదవ్, అంజన్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో పూర్వ విద్యార్థుల కలయిక



రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు

రాజేంద్రనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఉప్పర్‌పల్లి ఇంపీరియా బ్యాంకెట్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 80 మంది విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. నాడు చదువుకున్న రోజుల్లో మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమకు పాఠాలు చెప్పి నేడు స్వర్గంలో ఉన్న గురువులను, తమతో చదువుకుని మరణించిన స్నేహితులను గుర్తు చేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రస్తుతం ఏమి చేస్తున్నాం.. ఎక్కడెక్కడ స్థిర పడ్డారనే విషయాలపై మాట్లాడుకున్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు 40 సంవత్సరాల జ్ఞాపికలను బహూకరించారు.

చాలా సంతోషంగా ఉంది

40 నుంచి 50 సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుని తిరిగి అందరూ కలుసుకోవడం, తమను పిలిచి గౌరవించి సన్మానిచడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు అనంతరెడ్డి, కమల, గాబ్రీయేలమ్మ పేర్కొన్నారు. చిన్న నాడు తమ వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయురాలు కమల మిఠాయిలు తయారు చేయించి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వై.శ్రీధర్, ఎం.రాంబాబు యాదవ్, బి.వేణుగోపాల్, ఎం.నాగభూషణం, బి.అంజనేయులు, ఎం.శ్రీనివాస్ యాదవ్, ఎండీ షర్ఫుద్దీన్, వేముల చక్రపాణి, ఎస్.సుమన్‌రెడ్డి, ఎస్.నర్సింహారెడ్డి, కె.విజయ్‌కుమార్, మంజూర్ అహ్మద్, పి.మహేశ్వర్, ఎం.శివకుమార్, రవిందర్ షిండే, వనితారెడ్డి, లక్ష్మీరెడ్డి, కె.సరోజ, విజయలక్ష్మి, సబియా సుల్తాన, సబిత, జ్యోతి లక్ష్మి, జయశ్రీ, చిన్న విజయలక్ష్మి, సయ్యద్ హిదాయతుల్లా, జి.చిమన్‌లాల్, ఎన్.బాబురావు, రాజేందర్ యాదవ్, ఎ.భీమయ్య, వై.సత్యనారాయణ, వి.రవీందర్, పి.జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిందూర్ కాలనీ ముఖ ద్వారం ప్రారంభం



సిందూర్‌కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పెహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రమూకలను ఏరివేయడానికి భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ పేరుకు స్ఫూర్తి దాయకమైన మైలార్‌దేవుపల్లి డివిజన్ లక్ష్మీగూడ సమీపంలో కొత్తగా ఏర్పడిన ఓ కాలనీకి సిందూర్ కాలనీ అని నామకరణం చేశారు. ఆదివారం ఆ కాలనీ ముఖ ద్వారాన్ని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అడికె జనార్ధన్, సుబ్బారెడ్డి, మనీష్ తివారి, మధుసూదన్ రెడ్డి, ఉజ్వల్, అడికె శివ, సంతోష్, శ్రీధర్‌రెడ్డి, ఓంప్రకాశ్, సంపత్, మనీష్, శంకర్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర



అత్తాపూర్ నుంచి ఉప్పర్‌పల్లి వరకు సాగిన ఊరేగింపు

రాజేంద్రనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ అత్తాపూర్ ఆధ్వర్యంలో ఆదివారం అత్తాపూర్ నుంచి ఉప్పర్‌పల్లి వరకు కొనసాగిన జగన్నాథ రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులతో రోడ్లు కిక్కిరిసి పోయాయి. హరేరామ హరేక్రిష్ణ.. క్రిష్ణ క్రిష్ణ హరే హరే అంటూ రహదారుల్లో భక్తుల పాటలతో మారుమోగాయి. ఈసందర్భంగా ఉప్పర్‌పల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో భక్తులు సమావేశమై భజనలు, కీర్తనలు పాడారు.



లాల్‌పాషా మసీదు ప్రాంతంలోని చోటా మఠ్ ఆలయం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, మొగల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ అశోక్‌కుమార్, బీజేపీ నాయకుడు దినేష్ అంబారే, రాజేశ్ అంబారీ, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

- చాంద్రాయణగుట్ట, జూన్ 29(ఆంధ్రజ్యోతి)



● బెజవాడ కనక దుర్గమ్మ సన్నిధిలో జరిగిన బోనాల సంబరాల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ తదితరులు

- మదీన, జూన్ 29(ఆంధ్రజ్యోతి)

అలంపూర్ జోగులాంబకు బోనం సమర్పణ



ఊరేగింపుగా వెళ్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని గౌలిపురా మురాద్ మహల్‌లోని మహంకాళి నల్లపోచమ్మ ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం అలంపూర్ జోగులాంబ ఆలయంలో బోనం సమర్పించడానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మణికంఠ, మాజీ అధ్యక్షుడు సి.శ్యామ్‌రావు, సభ్యులు మానిక్‌రావు, సత్యనారాయణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ



నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లాల్‌సింగ్

మంగళ్‌హాట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దివంగత సామాజికవేత్తలు శివలాల్‌సింగ్, పాన్నాల, దూలరీ బాయిల సేవలు మరువలేనివని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ అన్నారు. ఈమేరకు ఆదివారం నవయుగ సేవాదళ్ కమిటీ హాల్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద పిల్లలకు నోట్‌బుక్‌లు, స్టేషనరీ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బహదూర్ సింగ్, అమర్దీప్ సింగ్, సందీప్ సింగ్, కమల్‌సింగ్, కైలాష్‌సింగ్, దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాత్ ల్యాబ్‌లో రేడియేషన్ ఎక్కువ

● నిమ్స్‌లో కాంప్లికేషన్స్‌పై అవగాహన సదస్సు

నిమ్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): క్యాత్ ల్యాబ్‌లో రేడియేషన్ ఎక్కువగా ఉంటుందని, దాని వల్ల వైద్యులకే ఎక్కువ సమస్యలు వస్తాయని కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ సోమరాజు అన్నారు. దానిని అధిగమించడానికి తగిన పరికరాలు వాడాలని వైద్యులకు సూచించారు. గుండె శస్త్రచికిత్సకు ముందు యాంజియోగ్రఫీ చేసే సమయంలో వైద్యులు క్యాత్‌లాబ్(ఆపరేషన్)థియేటర్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను ఎలా అధిగమించాలనే అంశంపై కార్డియాలజీ విభాగ నిపుణులు వైద్యులకు, వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిమ్స్ ఆస్పత్రి ఐదో అంతస్తు ట్రామా ఆడిటోరియంలో 'ఇంటర్వెన్షనల్ కాంప్లికేషన్స్' మేనేజ్మెంట్ ఆఫ్ క్యాత్ ల్యాబ్ కాంప్లికేషన్స్' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ బి.సోమరాజు, డాక్టర్ దయాసాగర్రావు, డాక్టర్ శేషగిరిరావు మాట్లాడారు. వైద్యులు ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కరొనరి యాంజియోగ్రఫీ, పీటీసీఏ(గుండెకు)స్టెంట్‌ను సరైన పద్ధతిలో ఎలా అమర్చాలి అనే అంశాలపై చర్చించారు. డాక్టర్ రమాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కంటున్యూ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎమ్‌ఈ) ప్రోగ్రాంలో డాక్టర్ శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ అనుజ్ కపాడియా, డాక్టర్ శశికాంత్, డాక్టర్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్ ఎన్నికల్లో మహా కూటమితో కలిసి మజ్లిస్ పోటీ?

● మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఎన్‌డీఏ కూటమిని ఓడించేందుకు బిహార్ అసెంబ్లీకి ఈఏడాది చివరలో జరిగే ఎన్నికల్లో పొత్తుకు సంబంధించి మహాకూటమి(మహా ఘట్బంధన్) నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈసారిఎన్నికల్లో ఎన్‌డీఏను గద్దె దించే లక్ష్యంతో బిహార్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్‌ప్రణాళిక రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ, ఎన్‌డీఏలను నియంత్రించేందుకు ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీతో కూడిన మహాకూటమితో కలిసి పోటీ చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు. క్రియాశీల కార్యకర్తల బలం ఉన్న సీమాంచల్‌లో మజ్లిస్ పోటీ చేస్తోందని తెలిపారు. మహా కూటమి పార్టీలు ఎన్నికల్లో తమతో కలిసిరాని పక్షంలో బిహార్‌లోని అన్ని నియోజకవర్గాల్లో మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తారని ఒవైసీ స్పష్టం చేశారు.

ఐదేళ్ల క్రితం బీజేపీ ఎన్‌డీఏను నియంత్రించేందుకు తాము తీవ్రంగా ప్రయత్నించామని గుర్తు చేశారు. బిహార్ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరిట ఓటర్ల జాబితా సవరణ తీరుపై ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీమాంచల్ లాంటి ప్రాంతాల్లో వరద ముంపుతో అక్కడి నిరుపేదల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వలస వెళ్లారన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట బర్త్ సర్టిఫికెట్, నివాస ధృవీకరణతో పాటు తలిదండ్రుల నివాస ధృవీకరణ పత్రాలు చూపాలంటే నిరుపేదలు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ఆయన ప్రశ్నించారు.

దీంతో వేలాది మంది నిరుపేదల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చక పోవచ్చని, నిరుపేదల ఓటుహక్కు పొందలేరని ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు.

'తెలంగాణ నాయర్ సొసైటీ ఏర్పాటు అభినందనీయం'

కాప్రా, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా, నిస్వార్థ సేవే లక్ష్యంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని గోవా గవర్నర్ పీఎస్. శ్రీధరన్ పిళ్లై అన్నారు. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఆదివారం కాప్రాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని నాయర్లు సేవా సొసైటీని ఏర్పాటు చేసుకుని ఏకతాటిపైకి రావడం శుభ పరిణామమన్నారు. కేరళ నాయర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మన్నత్ పద్మనాభన్ ఆశయాలకనుగుణంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీ పనిచేయాలన్నారు. అనంతరం వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయర్ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6o9NBFvలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

భారత్ ఐకాన్ పురస్కారాలకు దరఖాస్తులు

● ఆగస్టు 19న ఢిల్లీలో ప్రదానోత్సవం

రవీంద్రభారతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆయా రంగాల్లో నిష్ణాతులైన పలువురికి దేశ రాజధాని ఢిల్లీలో భారత్ ఐకాన్ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు కృష్ణ తెలిపారు. దీని కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 19న ఢిల్లీలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ సందర్భంగా సామాజిక, సేవా, కళా, విద్య, వైద్యం, వ్యాపారం, సంగీత, సాహిత్యం, నృత్యం తదితర రంగాల్లో నిష్ణాతులైన వారికి భారత్ ఐకాన్ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. దీంతో పాటు నాట్య సిందూర్ పురస్కారాలు అందజేయనున్నట్టు ప్రకటించారు. ఆసక్తిగల వారు జూలై 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9494523562 నెంబరులో సంప్రదించాలని కృష్ణ ఓ ప్రకటనలో కోరారు.

ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్



బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సీ.ఏ.చంద్రశేర్ వేముల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు సీ.ఏ.హతేష్‌జైన్ అధ్యక్షతన జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో 2025-2026 సంవత్సరం కార్యవర్గానికి ఎన్నికలు ఎలక్షన్ అధికారి అమృత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా సీ.ఏ.చంద్రశేఖర్ వేములతో పాటు ఉపాధ్యక్షులుగా సీ.ఏ.పీ.వీ.నారాయణరావు, కార్యదర్శిగా సీఏ.ఆశీష్‌జోషి, సంయుక్త కార్యదర్శిగా ఐటీపీ అజయ్‌కుమార్ భవలే, కోశాధికారిగా సోమేశ్వర్ నెమానీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ట్యాక్స్ బార్ అసోసియేషన్‌ను బలోపేతం చేయడం, కొత్త సమస్యలను చేర్చడం, వర్క్‌షాప్‌లు, సెమినార్ల ద్వారా విద్యా వేదికలను అందించడం, రెగ్యులేటరీ అధికారుల మధ్య వారధిగా వ్యవహరించడం, ప్రభుత్వ వేదికలపై ప్రొయాక్టివ్ పాత్ర పోషించడం అసోసియేషన్‌కు మరింత గుర్తింపు తీసుకురావడం ప్రధాన లక్ష్యాలన్నారు. ఈ సభలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు సీఏ రాందేవ్ భుటాడా, సీఏ పూర్ణచంద్రరావు, ఐటీపీ మధుసూదన్ బోజ్జా, సీఏ వెంకట్రావ్, తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారావు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

యువత జీవితాలను నాశనం చేసిన కేటీఆర్



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

గోషామహల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యువత జీవితాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాశనం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కేటీఆర్ డ్రగ్స్ కాంట్రాక్ట్ తీసుకున్నాడని, పదేళ్లలో 10వేల కోట్ల డ్రగ్స్ సరఫరా చేశాడని ఆరోపించారు. దేశానికి హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని అన్నారు. 2014 వరకు తెలంగాణలో మత్తు పదార్థాలు లేవని, తర్వాత ఇతరదేశాల నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి సరఫరా చేశారన్నారు. గ్రామాల్లోని విద్యార్థులు సైతం గంజాయి, మత్తుకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి



డీసీసీ అధ్యక్షుడు రోహిణిరెడ్డిని సన్మానిస్తున్న గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ నాయకులు

హిమాయత్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నామని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ నాయకులు బొడ్డు సంతోష్‌కుమార్, బొడ్డు శివ కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణి రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులపై చర్చించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందేలా కృషి చేస్తున్నామన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో అనేక సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని రోహిణిరెడ్డిని కోరారు.

రైల్వే ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించాలి



రైల్వే జీఎంకు వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ మెట్టు శ్రీకాంత్

అఫ్జల్‌గంజ్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రతినిధులు కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యాధునిక సర్జరీలకు అవసరమైన వసతులు, రోబోటిక్ సర్జరీలు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి దగ్గరలో డయాలసిస్ సౌకర్యం ఇతర వసతులు కల్పించాలని కోరారు. జీఎంను కలిసినవారిలో ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి యుగంధర్, జాయింట్ జనరల్ సెక్రెటరీ శివకుమార్, జగదీశ్ పాల్గొన్నారు.

వాటర్ బోర్డు.. పాలనలో మార్పు

ఏడాది పరిపాలనలో ఎండీ అశోక్‌రెడ్డి తనదైన ముద్ర



- మెరుగైన సేవలకు స్పెషల్ డ్రైవ్‌లు
- సీవరేజీ, వాటర్ నెట్‌వర్క్‌కు జీఐఎస్ మ్యాపింగ్
- కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లకు కసరత్తు
- కోర్ అర్బన్ రీజియన్ కోసం సీవరేజీ, వాటర్ ప్రాజెక్టుకు సమగ్ర మాస్టర్ ప్లాన్

హైదరాబాద్ సిటీ, జూన్29 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు ఏడాదిగా సరికొత్త మార్క్ చూపుతోంది. సీవరేజీ, వాటర్ నెట్‌వర్క్‌కు జీఐఎస్ మ్యాపింగ్ చేసి క్షేత్రస్థాయి పరిశీలన సిబ్బంది పనితీరులో మార్పు తెస్తోంది. సీవరేజ్ నిర్వహణకు, ఇంకుడు గుంతల నిర్మాణానికి, నల్లాలకు మోటార్ల బిగింపు అరికట్టడానికి నిర్వహించిన డ్రైవ్‌లు రెగ్యులర్ డ్యూటీ చార్ట్‌గా మారాయి. హైదరాబాద్ మహానగర దాహార్తి తీర్చడంతో పాటు జంట జలాశయాలను గోదావరి జలాలతో నింపి మూసీనదిలో ప్రవహింపజేసే బ్రహత్తర ప్రాజెక్టుకు అడుగుల పడ్డాయి. దీని పునరుజ్జీవనానికి దోహదపడేలా వంద శాతం మురుగుశుద్ధి చేసే లక్ష్యంగా 39 ఎస్టీపీల నిర్మాణానికి పునాది పడింది.

● ఏడాది క్రితం వాటర్‌బోర్డు ఎండీగా బ్యాధతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి అశోక్‌రెడ్డి అనతి కాలంలోనే పాలనలో తనదైన ముద్ర వేశారు. 'సీవరేజీ స్పెషల్ డ్రైవ్ - ప్రతి ఇంటా ఇంకుడు గుంత ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నయా పైసా ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలకు సైతం పరిష్కారం లభిస్తోంది. కస్టమర్ కేర్‌కు వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. వివిధ కొత్త పనులకు యూనిక్ కోడ్ నిర్ణయించి అవకతవకలు లేకుండా జవాబుదారీ తనాన్ని పెంచారు. వేసవి నేపథ్యంలో ట్యాంకర్ల ఇబ్బందులు, నీటి సమస్యలు రాకుండా చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. గరిష్ఠంగా 11 వేల ట్యాంకర్ల బుకింగ్ జరిగిన 24 గంటల్లోనే డెలివరీ చేయడం విశేషం.

● హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టి పెట్టుకొని 2047 వరకు పెరగనున్న జనాభాను అనుగుణంగా తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ కోసం సీవరేజీ, వాటర్ ప్రాజెక్టు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు వాటర్‌బోర్డు సిద్ధమవుతోంది. ప్రస్తుతం వాటర్ బోర్డు పరిధి కేవలం 1,400 చదరపు కిలోమీటర్ల వరకు ఉండగా, వాటిని 2,050 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించి మూడు నెలల్లోగా ప్రభుత్వానికి సమర్పించే విధంగా కసరత్తు చేస్తోంది. కోర్ అర్బన్ పరిధిలో తాగునీటితో పాటు సీవరేజ్ లైన్ల, ఎస్టీపీల నిర్మాణాలతో పాటు శుద్ధిచేసిన నీటిని పునర్వినియోగం కోసం దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మరో వైపు సుమారు రూ. 600 కోట్లతో మంజీరా రెండో ఫైప్ లైన్‌కు డీపీఆర్ రూపొందిస్తోంది.

విజన్-2047 లక్ష్యంగా...



సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు విజన్-2047 లక్ష్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కోసం సీవరేజీ, తాగునీటి ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ డీపీఆర్ రూపకల్పనకు కసరత్తు చేస్తున్నాం. ప్రజలకు డ్రైనేజీ డీ-సిల్టింగ్, తాగునీటి సరఫరాలో మెరుగైన సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుగు సాగుతున్నాం. జీఐఎస్ మ్యాపింగ్‌తో ఫీల్డ్ వర్క్‌ను సైతం మానిటరింగ్ చేస్తున్నాం. భవిష్యత్తులో సరికొత్త ఆలోచనలతో మెరుగైన సేవలు అందిస్తాం

అశోక్ రెడ్డి , వాటర్‌బోర్డు ఎండీ

స్లాట్ బుకింగ్‌లో సమస్యలు

- టీజీఎప్‌సెట్ పోర్టల్‌లో సాంకేతిక ఇబ్బందులు
- ఫీజు పేమెంట్‌లో అభ్యర్థులకు తప్పని తిప్పలు

అల్లాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల పైచీలుకు తర్జన భర్జన తరువాత విడులైన టీజీ-ఎప్‌సెట్ అడ్మిషన్ల ప్రక్రియలో ప్రథమ అంశం ఫీజ్ పేమెంటులో చిక్కులతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. మే మొదటి వారంలో ఈ పరీక్షలు నిర్వహించి అత్యల్ప సమయంలోనే ఫలితాలు విడుదల చేసిన కన్వీనర్, ఆ తరువాత ప్రాసెసింగ్‌కు నెలరోజులకు పైగానే సమయం తీసుకున్నా.. వెబ్ ప్రాసెసింగ్, సర్టిఫికెట్ల పరిశీలనకు టెక్నికల్ సమస్యలు వెంటాడుతున్నాయి. జనరల్ అభ్యర్థులు ఆన్‌లైన్ రూ.1200 చెల్లించి 'సర్టిఫికెట్ వెరిఫికేషన్'కు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉండగా, అభ్యర్థి బ్యాంకు ఖాతా నుంచి రుసుం డిడక్ట్ అవుతుంది కానీ పోర్టల్ ఖాతాలో జమ కాకపోవటం లేదు. సదరు అభ్యర్థులు స్లాట్ బుకు చేసుకునే పరిస్థితి లేక ఇబ్బంది పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం పోర్టల్‌లో సూచించిన నంబర్లు 76600-09768, 76600-09769 స్పందించడం లేదు. ఈ-మెయిల్ ఐడీకి ఫిర్యాదు చేసినా అరకొర సమాధానమే వస్తోందని, సమస్యను అర్థం చేసుకుని పరిష్కరించే మెకానిజం ఏదీ లేదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థుల ఖాతా నుంచి రుసుం కట్ అయితే కచ్చితంగా పోర్టల్‌లో సక్సెస్ చూపించి తదుపరి రిజిస్ట్రేషన్‌కు ఆస్కారం కల్పించేలా చేయాలని విన్నవిస్తున్నారు. ఇకనైనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని కోరుతున్నారు.

అభివృద్ధి చెందిన దేశాలతో భారత్ పోటీ

● ప్రధాని మోదీ ఘనతే ● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ నాయకులు

ఎర్రగడ్డ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్లోని కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ పార్కులో నిర్వహించిన మన్ కీ బాత్‌లో ఆయన మాట్లాడారు. ఎలాంటి అవినీతికి అవకాశం ఇవ్వకుండా నీతి నిజాయితీతో 11 సంవత్సరాలుగా దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రధాని మోదీ అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. దేశ ప్రజలందరూ ప్రతినెలా ఆఖరి ఆదివారం ఉదయం 11 గంటలకు ఎక్కడున్నా వినేటటువంటి కార్యక్రమం మన్‌కీ బాత్ అని పేర్కొన్నారు. దేశంలో అనేక రకాల ఇబ్బందులు వచ్చినప్పటికీ ప్రజల మద్దతు విశ్వాసంతో సమస్యలన్నీ పరిష్కరించేందుకు ఆయన కృషి చేస్తున్నారని కొనియాడారు. భారతదేశంలో సమీప దేశాలన్నీ ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ మన దేశంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల్లో పోటీపడే విధంగా మోదీ నాయకత్వంలో ముందుకెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, గౌతమ్ రావు, గౌతమ్ రావు, దేరంగుల ప్రసన్న, డాక్టర్ గాయత్రీ దేవి, చేకూరు హనుమంతు నాయుడు, అట్లూరి రామకృష్ణ, ఈదులకంటి రాజేష్, అరుణకుమారి పాల్గొన్నారు.




క్రియేటర్స్ కలెక్ట్ 2025 ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఆదివారం మాదాపూర్‌లోని హైటెక్స్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని హ్యామ్స్‌టెక్ ఇనిస్టిట్యూట్ నిర్వహించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న తమ శాఖలలోని 800 మంది గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులు తీర్చిదిద్దిన అత్యుత్తమ కలెక్షన్స్‌తో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటుగా డిజైనర్లు జయంతి రెడ్డి, గౌరాంగ్ షా, అరవింద్ చెంజీ, ప్రవీణ్ పూడి, హ్యామ్స్‌టెక్ ఇనిస్టిట్యూట్ సీఈఓ అజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

ఆక్యుపంక్చర్‌తో ఉత్తమ కెరీర్



విద్యార్థినికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కార్వాన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవితం, ఆక్యుపంక్చర్‌లో గొప్ప కెరీర్‌లను కొనసాగించాలని జేఎన్‌ఏఎఫ్‌యూ ప్రిన్సిపాల్ ఎం.ఎల్.ఆనందరావు విద్యార్థులకు సూచించారు. మాసాబ్‌ట్యాంక్ జేఎన్ఏఎఫ్‌యూ యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాల్లో కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి (సీఐఏఎన్) 11వ కాన్వొకేషన్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గీత రచయిత పూర్ణాచారి, నటుడు వినోద్, హాస్య నటుడు కిశోర్‌దాస్, వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సుధాకర్, అధ్యాపక సభ్యులు చిదంబరంతో పాటు ఆయన పాల్గొన్నారు. తెలుగు మాట్లాడే రాష్ట్రాల్లోని ప్రతీఇంటికి, వైద్యం చేసే కళను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు సీఐఏఎన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. సురక్షితమైన ప్రత్యామ్నాయ చికిత్సలను అందజేయడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని, వివరాలకు 90147 92412 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కాగా, ఏడాది కోర్సులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్, సుధాకర్, జ్యోతి, శ్రీదేవి, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మెట్రోస్టేషన్లలో డిస్‌ప్లే బోర్డుల మొరాయింపు



ఎస్ఆర్‌నగర్‌లో పనిచేయని డిస్‌ప్లే బోర్డు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు మెట్రోస్టేషన్లలో నాలుగు రోజులుగా డిస్‌ప్లే బోర్డులు పనిచేయడం లేదు. దీంతో స్టేషన్లకు వస్తున్న ప్రయాణికులు రైళ్ల రాకపోకలకు సంబంధించిన సమాచారం తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, విక్టోరియా, చైతన్యపురి, ఎస్ఆర్‌నగర్, తదితర స్టేషన్లలో నాలుగు రోజులుగా డిస్‌ప్లే బోర్డులు పనిచేయడం లేదని కొందరు ప్రయాణికులు తెలిపారు. అయితే ఆయా స్టేషన్లలో పని చేసే సిబ్బంది మాత్రం సాంకేతిక సమస్యలతోనే రైళ్ల సమయపాలన తెలియజేసే డిస్‌ప్లే బోర్డులు పనిచేయడం లేదని, అన్ని స్టేషన్లలో ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు.

శిల్పులకు 'ఆలయ నిర్మాణం'తో ఉపయోగం

ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆలయ నిర్మాణం పుస్తకం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆలయ నిర్మాణ శిల్పులకు ఎంతో ఉపయోగకరమని ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి అన్నారు. ఆలయ నిర్మాణం పుస్తకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. వివరాలతో పాటు చిత్రాలను కూడా పొందుపరిచిన రచయిత డాక్టర్ పి.సుబ్రమణి, సంపాదకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిలను ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉప అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, శిల్పి బి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దస్ పైసా కా పోస్టుకార్డ్' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వినయ్‌వర్మ

బేగంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రచయిత అహ్మద్ .. 'దస్ పైసా కా పోస్టు కార్డ్' పుస్తక ఆవ్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సినిమా డైరెక్టర్ వినయ్‌వర్మ హాజరై ఆవిష్కరించారు. ఈ పుస్తకం చదువుతుంటే తాను ఉత్తరాలు రాసిన రోజుల్లోకి వెళ్లానని చిన్ననాటి రోజులను డైరెక్టర్ గుర్తు చేసుకున్నారు. బీఎస్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ ఈ పుస్తకం మనల్ని గడిచిన కాలంలోకి తీసుకెళ్తోందన్నారు. పుస్తక రచయిత అహ్మద్ మాట్లాడుతూ ఈ పుస్తకం ప్రేక్షకులను 1960 నాటికి తీసుకెళ్తోందన్నారు. ఈ పుస్తకాన్ని మన దేశ రక్షణ సిబ్బందికి అంకితం చేశారు.

అప్పుడు మహిళలకు అమిత గౌరవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న 9వ నిజాం రౌనక్ యార్‌ఖాన్, సొసైటీ సభ్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నిజాంల కాలంలో మహిళలకు అమిత గౌరవం ఇచ్చారని, ముఖ్యంగా విద్యపరంగా అనేక చర్యలను తీసుకోవడమూ జరిగిందని బెంగాలీ సామాజిక-సాంస్కృతిక, దాతృత్వ సంస్థ ఆరోహణ్ కల్చరల్ సొసైటీ సభ్యులు తెలిపారు. మహిళలకు తగిన అవకాశాలను ఇవ్వడం ఈ కాలంలోనూ కనిపించిందన్నారు. ఈ విషయాల పట్ల చాలామందికి అవగాహన లేదని అభిప్రాయపడ్డారు. 'మీ చరిత్ర, నిజాం గురించి తెలుసుకోండి' శీర్షికన కార్యక్రమాన్ని ఆదివారం కోకాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా 9వ నిజాం రౌనక్ యార్ ఖాన్ హాజరై మాట్లాడారు. భారతీయ చరిత్రలో మహిళలు అందించిన తోడ్పాటును గురించి ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో ఆరోహణ్ సభ్యులు ఇంద్రనీల్ చౌదరి, స్వస్తరాయ్, మనోజిత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గజల్, షాయరీ కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

సికింద్రాబాద్ నుంచి 'జ్యోతిర్లింగ దివ్య దక్షిణయాత్ర' రైలు

హైదరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి దక్షిణాది ప్రధాన పుణ్యక్షేత్రాలను దర్శించుకునే తీర్థయాత్రికుల కోసం జులై 19న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి 'జ్యోతిర్లింగ దివ్యదక్షిణయాత్ర'భారత్ గౌరవ్ టూరిస్టు రైలు బయలుదేరుతోంది. తిరువణ్ణామలైలోని అరుణాచలం ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, మధురైలోని మీనాక్షి అమ్మన్ ఆలయం, రాక్‌స్మారక చిహ్నం, కన్యాకుమారిలోని కుమారి అమ్మన్ ఆలయం, త్రివేంద్రంలోని పద్మనాభస్వామి ఆలయం, తిరుచి లోని రంగనాథస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను దర్శించుకునే అవకాశం లభిస్తోంది. ప్యాకేజీ వివరాలకు 040-27702407, 9701360701 నంబర్‌లో లేదా www.irctc-tourism.com. వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చని తెలిపారు.

ఆటో పర్మిట్లపై ప్రభుత్వం పునరాలోచించాలి

● మంత్రి పొన్నంకు కేకేసీ జాతీయ అధ్యక్షుడి విన్నపం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పూలబొకే అందజేస్తున్న కేకేసీ జాతీయ అధ్యక్షుడు కౌశల్ సమీర్ తదితరులు

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో త్రీవీలర్ లైసెన్స్ కలిగిన ఆటోడ్రైవర్లకే ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి, అర్హులైన ఆటోడ్రైవర్లందరికీ ఆటోపర్మిట్లు ఇవ్వాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) జాతీయ అధ్యక్షుడు కౌశల్ సమీర్ నేతృత్వంలో కేకేసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్, ఆటో యూనియన్ నాయకులు కోరారు. ఆదివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. అనంతరం బషీర్‌బాగ్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. ఫోర్ వీల్ లైసెన్స్ కలిగిన వారికి ఆటో పర్మిట్‌కు అవకాశం ఇవ్వకూడదన్నారు. నగరంలో చాలా మంది ఫోర్ వీల్‌లైసెన్స్ కలిగి ఉన్నారన్నారు. దీంతో పూర్తి స్థాయిలో పర్మిట్లు ఫైనాన్సర్ల చేతిలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఆటోపర్మిట్లపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కౌశల్ సమీర్ చర్చించి ఆటో డ్రైవర్లకు ఉచితంగా ఆటోల పంపిణీకి జీవో నంబర్ 263 తీసుకు వచ్చారన్నారు.



అభివాదం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రామచందర్‌నాయక్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు

బంజారాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

● బంజారా సమ్మేళనంలో మేధావులు, ప్రజాప్రతినిధుల డిమాండ్

బేగంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంత్రి వర్గంలో బంజారాలకు అవకాశం కల్పించడంతో పాటు బంజారాల అభివృద్ధికి అవసరమైన పథకాలను అమలు చేయాలని బంజారా మేధావులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బంజారా ప్రజా ప్రతినిధులు, మేధావులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో బంజారా ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో జరిగింది. కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు బాలూనాయక్, రాందాస్ నాయక్‌తో పాటు మాజీ ఎంపీ రవీంద్రనాయక్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డా. వెంకటేష్ చౌహాన్, పలువురు బంజారా మేధావులు, ఉద్యోగులు పాల్గొన్నారు. మంత్రి వర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలని వారందరూ కోరారు. సమస్యలను మేధావులు తమ దృష్టికి తెస్తే వాటిని ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు బాలూనాయక్, రాందాస్ నాయక్‌లు తెలిపారు సమావేశంలో మేధావుల సంఘం అధ్యక్షుడు ధనుంజయ నాయక్, ప్రధాన కార్యదర్శి హరిచరణ్, ఇన్‌కంటాక్స్ కమిషనర్ ప్రకాశ్ రాథోడ్, ప్రొఫెసర్ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిన్ను కూడా లోపల వేస్తా..

(5వ పేజీ తరువాయి)

ఇన్‌స్పెక్టర్ అతనిపై మండిపడ్డారు. "నేను స్టేషన్‌కు వస్తాను ఎలా అరెస్టు చేస్తారో చూస్తా.. అంటూ" వెంకటస్వామి ఆ సమాచారాన్ని తన శ్రేణులకు చేరవేశారు. దీంతో సాయంత్రం కల్లా పెద్దఎత్తున ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు బోరబండ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు.

లాఠీచార్జ్

వెంకటస్వామి ఠాణాలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులకు వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యకర్తలను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అయినా పోలీసులను నెట్టుకుంటూ దాదాపు రెండువందల మంది పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకొని పోయారు. ఆ సమయంలో ఠాణాలో ఇన్‌స్పెక్టర్ లేరు. ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ రాఘువేంద్రరావు అక్కడకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. కొద్దిసేపటికి అక్కడకు చేరుకున్న ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఎన్ఎస్‌యూఐ నాయకులతో ఏసీపీ చర్చలు జరిపారు. అనంతరం వెంకటస్వామి మీడియాతో మాట్లాడుతూ శివకు సంబంధించిన సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. తాము ఠాణా ముట్టడికి రాలేదని, రాష్ట్ర నాయకుడిని కాబట్టి తమ కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చారని వివరించారు.



రసరమ్యంగా నృత్య ప్రదర్శన



హాజరైన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

రవీంద్రభారతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు చక్కటి అడుగులతో యువ నర్తకులు స్మృతి, సిరియా.. నృత్య ప్రదర్శన రసరమ్యంగా సాగింది. ఆదివారం రవీంద్రభారతిలో ప్రముఖ నాట్య గురువు శైలజా ప్రసాద్ శిష్యులైన వారు కూచిపూడి నాట్యంలో రంగ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా రంగపూజ, శివస్తుతి, అన్నమాచార్య కీర్తనలు, భామకలాపం, దేవిస్తుతి, బాలమురళీకృష్ణ తిల్లాన, మంగళం తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు కళాకారులను సత్కరించారు.

సుగుణమ్మ ఆశయాలను కొనసాగిద్దాం

● సంస్మరణ సభలో వక్తలు

మియాపూర్, జూన్29(ఆంధ్రజ్యోతి): ఉభయ కమ్యూనిస్టు పార్టీల విలీనాన్ని కాంక్షించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు శాకమూరి సుగుణమ్మ ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వ్యక్తలు అన్నారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ఇంద్రజిత్ హాల్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ప్రముఖ కమ్యూనిస్టు నేత శాకమూరి సుగుణమ్మ సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ హాజరై మాట్లాడారు. సుగుణమ్మ మరణం మహిళా ఉద్యమాలకు తీరని లోటన్నారు. తన చివరి శ్వాస ఉన్నంత వరకు ప్రజా ఉద్యమాల కోసం పని చేశారన్నారు. సమాజం మనకు ఏం ఇచ్చిందనే భావనతో కాకుండా మనం ఏం చేశామని ఆలోచనతో ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. కమ్యూనిస్టులు ఏకం కావాలన్నాదే ఆమె చివరి కోరిక అన్ని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



కాచిగూడ - చిత్తూరు వెంకటాద్రి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు, కాచిగూడ - బెంగళూరు (అశోకపురం) ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. దక్షిణమధ్య రైల్వే అభిమానుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్, సీనియర్ డీవోఎం విద్యాధర్, డైరెక్టర్ బాలాజీ, మేనేజర్ ఆర్‌బి. మీనా,పీఆర్‌వోవెంకటరమా శైలేంద్రకుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ గోరక్‌నాథ్ మల్, ఎస్ఐరజిత పాల్గొన్నారు

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

కుటుంబ కలహాలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మదీన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నందిముస్లైగూడ తేజస్వినీ నగర్‌కు చెందిన శ్రీకాంత్‌రెడ్డి(35), సురేఖ భార్యాభర్తలు. తరచూ వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా ఇద్దరు గొడవ పడ్డారు. కొద్దిసేపటి తర్వాత భార్య కిందికి రాగా భర్త ఫస్ట్ ఫ్లోర్‌లోనే ఉన్నాడు. ఎంతకూ అతను కిందికి రాకపోవడంతో భార్య వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు సహాయంతో కిందికి దించగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న బహదూర్‌పురా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు

రెండు పోలీస్‌స్టేషన్ల మధ్య అయోమయం

శ్రీకాంత్‌రెడ్డి ఆత్మహత్య విషయం తెలుసుకున్న బహదూర్‌పురా పోలీసులు సంఘటనా స్థలమైన తేజస్వినీనగర్‌కు చేరుకున్నారు. ఈ ప్రాంతం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వస్తుందని భావించి వారికి సమాచారం అందించారు. వారొచ్చి తమ పరిధి కాదన్నారు. ఈలోపు క్లూస్‌టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. చివరికి బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోకే వస్తుందని నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నేవీకి ముగ్గురు సెయిలర్ల ఎంపిక



హైదరా బాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): నగరానికి చెందిన ముగ్గురు యాచ్ క్లబ్ సెయిలర్లు నేవీకి ఎంపికయ్యారు. గోవాలోని భారత నౌకదళానికి చెందిన నేవీ యూత్ స్పోర్ట్స్ కంపెనీలో నవీన్, సాత్విక్, రిజ్వాన్‌కు ఉద్యోగాలు లభించాయి. వీరిని యాచ్ క్లబ్ వ్యవస్థాపకుడు, కోచ్ సుహీం షేక్ అభినందించారు. వీరంతా నిరుపేద కుటుంబానికి చెందినవారేనని, సెయిలింగ్‌లో కష్టపడి రాణించి ఈ స్థాయికి వచ్చారని చెప్పారు. ఇప్పటి వరకు 26 మంది యాచ్ క్లబ్ సెయిలర్లకు భారత నౌకదళంలో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
9
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం
30 జూన్ 2025

ఈ ఆసనాలతో బీపీ నియంత్రణ

నేడు ఎంతో మందిని వేధిస్తున్న సమస్య రక్తపోటు. ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలి, ఉద్యోగ ఒత్తిడి వంటి అనేక కారణాలతో ఈ సమస్య పెరిగిపోతుంది. అయితే కొన్ని ఆసనాలతో బీపీని నియంత్రణలో ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలివీ.

శవాసనం: ఈ ఆసనం ఒత్తిడిని తగ్గించి, ప్రశాంతతను పెంచుతుంది. దాంతో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఈ ఆసనంతో మెదడు పనితీరు కూడా మెరుగుపడి జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



- ముందుగా నేలమీద వెల్లికిలా పడుకుని కాళ్లను దూరంగా చాచాలి. రెండు చేతులను కూడా శరీరానికి దూరంగా చాపాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. కళ్లు మూసుకుని శ్వాసమీద మనసు నిమగ్నం చేయాలి. అయిదు నుంచి పది నిమిషాల తరువాత మామూలు స్థితికి రావాలి.



ఉత్తానాసనం: ఈ ఆసనం మెదడుకు రక్త ప్రసరణ బాగా జరిగేలా దోహదం చేస్తుంది. ఒత్తిడిని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. దాంతో రక్తపోటు తగ్గుతుంది.

- నేలమీద నిటారుగా నిల్చోవాలి. ముందుకు వంగి తలను పాదాల వరకు తీసుకురావాలి. ఈ క్రమంలో కాళ్లు నిటారుగా ఉండేలా చూసుకోవాలి. నిమిషం నుంచి రెండు మూడు నిమిషాలు తరువాత మెల్లిన సాధారణ స్థితిలోకి వచ్చేయాలి.

భుజంగాసనం: ఇది మెదడుతో పాటు శరీరం మొత్తానికీ రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని సమర్థంగా నిర్వహించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది.



- ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. అరచేతులను నేలకు ఆనించి వాటి ఆధారంతో మెడ, నడుము పైభాగాన్ని ఎత్తాలి. నడుము కింద భాగం మాత్రమే నేలకు ఆనాలి. ఇలా 20-30 సెకన్ల పాటు ఉండి నెమ్మదిగా మాములు స్థితికి రావాలి.



వృక్షాసనం: ఇది శరీరాన్ని దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు రక్తపోటును నియంత్రిస్తుంది.

- రెండు కాళ్లను దగ్గరగా ఉంచి నిల్చోవాలి. మెల్లగా ఓ కాలిని పైకి లేపి ఇంకో కాలి తొడ మీద ఆనించి ఒక కాలి మీద నిలబడాలి. ఇప్పుడు నెమ్మదిగా రెండు చేతులను తల పైకి తీసుకెళ్లి నమస్కారం పెట్టే భంగిమలో ఉంచాలి. కొన్ని నిమిషాల తరువాత సాధారణ స్థితికి రావాలి.

సేతుబంధాసనం: ఈ ఆసనం మెదడుకు ప్రశాంతతకు చేకూర్చి రక్తపోటును నియంత్రణలో ఉంచేలా సహాయపడుతుంది.



- ముందుగా నేలపై వెల్లికిలా పడుకోవాలి. మోకాళ్లను మడిచి భుజాలు, చేతులను నేలమీద ఆధారం చేసి నడుమును పైకి లేపాలి. ఇలా 20-30 క్షణాల పాటు ఉండి మామూలు స్థితికి రావాలి.



ఆడపిల్ల పుడితే పురిటిలోనే చంపుతున్న అమానవీయ ఘటనలు ఈనాటికీ వార్తల్లో చూస్తున్నాం.

కొడుకు ట్రాన్స్ మహిళగా మారినందుకు ఇంటి నుంచి గెంటేస్తున్న తల్లిదండ్రులు కోకొల్లలు.

అలాంటిది తన కుమారుడు విష్ణుతేజ స్వలింగ సంపర్కుడు అని తెలిసినా... ఆ వాస్తవాన్ని స్వాగతించారు... **బోయపాటి అంజలి.**

అంతేకాదు, కొడుకు చేపట్టిన గే హక్కుల ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. అంతర్జాతీయంగా జూన్... ఎల్జీబీటీక్యూ సమూహానికి హక్కుల పరిరక్షణ ఉత్సవాల మాసం. ఈ సందర్భంగా అంజలి 'నవ్య'తో చెబుతున్న విశేషాలివి.

పిల్లల లైంగికతకు వారు బాధ్యులా?

"మా అబ్బాయి బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగంలో చేరాలి. వాడికి నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకొని పిల్లాపాపలతో సంతోషంగా జీవించాలి'... ఇలా అందరు అమ్మల్లాగానే నేనూ అనుకున్నాను. అది సాధ్యం కాదని తెలిసిన తర్వాత నా ఆలోచనా విధానాన్ని మార్చుకున్నాను. మా అబ్బాయి నేరుగా నాతో ఎప్పుడూ తాను 'గే' అని చెప్పలేదు. కానీ తన లైంగిక అస్తిత్వాన్ని, అభిప్రాయాలను రకరకాల రూపాలలో నాకు అర్థమయ్యేలా చేయడానికి ప్రయత్నించాడు. ముఖ్యంగా నేషనల్ జియోగ్రఫిక్ ఛానల్‌లో ప్రసారమయ్యే హోమోసెక్సువల్ స్వభావం కలిగిన పక్షులు, జంతువుల కథనాలు చూపించి, ప్రకృతిలో స్వలింగ సంపర్కం సహజమే అనే అవగాహన కలిగించడం లాంటివి. నేను చదువుకున్నది పదో తరగతి అయినా... వైజ్ఞానిక శాస్త్ర విశేషాలు తెలుసుకోవడం నాకు చాలా ఆసక్తి. సమాజంలో విభిన్న లైంగిక ప్రవృత్తులు ఉంటాయన్న అవగాహన నాలో ఉంది. కాబట్టి మా అబ్బాయి నాతో చెప్పాలనుకున్న విషయాన్ని నేను అంతే సులభంగా, సున్నితంగా గ్రహించాను. వాడిని యథాతథంగా అంగీకరించాను.

నచ్చినట్టు ఉండమన్నాను...

మా అబ్బాయి 'గే' అని తెలిసిన తర్వాత, 'మానసిక చికిత్స తీసుకో...' 'ఆలోచన మార్చుకో!' లాంటి ఒత్తిళ్లు వాడి మీద నేను ఎప్పుడూ తీసుకురాలేదు. ఆ లైంగికత అన్నది వాడికై వాడు కోరుకున్నది కాదు కదా! మరి మార్చుకోమని ఎలా అంటాం? 'నిజానికి హోమోసెక్సువల్ లైంగిక భావన ప్రకృతికి విరుద్ధం కాదు. అలాంటి వారిని లైంగికత మార్చుకోవాలని బలవంతపెట్టడమే అసహజం' అని తెలుసుకున్నాను. అందుకే నా బిడ్డ ఆలోచనలను, అభిప్రాయాలను పూర్తిగా స్వాగతించాను. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం... అప్పటికి వాళ్ల నాన్న చనిపోయి నాలుగు నెలలు. 2018 సెప్టెంబరులో అనుకుంటా... ఐపీసీ సెక్షన్ 377ను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. టెలివిజన్‌లో ఆ వార్తలు చూస్తూ విష్ణు ఎంతగా భావోద్వేగానికి లోనయ్యాడో మాటల్లో చెప్పలేను. అప్పుడు వాడితో ఒక్కటే అన్నాను.. "నువ్వు పూర్తి స్వతంత్రుడివి. నీకు నచ్చినట్టు బతుకు నాన్నా" అని. కనిపెంచిన బిడ్డ కళ్ల ముందే మానసికంగా కుంగిపోతూ, ఆత్మహత్య ప్రయత్నాలు చేస్తూ కుమిలిపోతున్నప్పుడు మనం మాత్రం చూస్తూ సంతోషంగా ఉండగలమా? నా బిడ్డ మరొకరికి ద్రోహం చేయడంలేదు. నేరం చేయలేదు. మరి వాణ్ణి ఎందుకు తప్పుగా చూడాలి? నా బిడ్డ 'గే' అయినా, వాడికి తోచిన మంచి పనులు చేస్తూ సంతోషంగా ఉంటే చాలు. ఒక తల్లిగా అంతకుమించి నాకు మరే కోరికలూ లేవు.

అప్పుడు బంగారు గొలుసు ఇచ్చాను...

విష్ణుతేజ ఎమ్మెస్సీ పోస్టు గ్రాడ్యుయేషన్‌లో బయోటెక్నాలజీ పూర్తిచేశాడు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఆట, పాటల్లోనూ బాగా యాక్టివ్. నలుగురికి మంచి చేయాలన్నది వాడి ఆలోచన. ఒకవైపు ఎల్జీబీటీక్యూ ఉద్యమాలతో కలిసి నడుస్తూనే తనలాంటి వారి హక్కుల కోసం ప్రత్యేకంగా పని చేయాలని ఉందన్నాడు. అందుకు కనీసం లక్షరూపాయలు అయినా అవసరమవుతాయని చెప్పాడు. మరొక నిమిషం ఆలోచించకుండా నా బంగారపు గొలుసు తీసి ఇచ్చాను. దాన్ని తాకట్టు పెట్టగా వచ్చిన సొమ్ముతో ఒక ఆఫీసు తీసుకున్నాడు. మూడేళ్లుగా 'అస్తిత్వం ఫౌండేషన్' ద్వారా 'గే' సంరక్షణ, సంక్షేమం కోసం రకరకాల కార్యక్రమాలు చేస్తున్నాడు. ముకుందమాల అనే మహిళ కూడా నాలాంటి తల్లే. ఆమె కుమార్తె ట్రాన్స్‌మహిళ. ఈ ఫౌండేషన్ నిర్వహణలో విష్ణుతేజకు ఆమె సహకారం కూడా తోడవడంతో తాను కోరుకున్న విధంగా ముందుకు వెళుతున్నాడు. ఎల్జీబీటీక్యూ సమావేశాలకు, ప్రైడ్ మంత్ ప్రోగ్రామ్స్‌కు నన్నూ తరచుగా తీసుకెళుతుంటాడు. వాళ్ళు నన్ను ఎంతగా ఆదరించి, అభిమానిస్తారంటే.. నాలో వాళ్ల అమ్మను చూసుకుంటారు.

కన్నబిడ్డకన్నా ఎక్కువా?

మా సొంతూరు ఒంగోలు. మాది పరువు, మర్యాదలు, పట్టింపులకు విలువ ఇచ్చే ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం. నా భర్త సివిల్ కాంట్రాక్టరు. అనారోగ్యం కారణంగా ఐదేళ్ల కిందట ఆయన చనిపోయారు. విష్ణు లైంగికత గురించి వాళ్ల నాన్నగారికి కొంత అవగాహన ఉంది. దాంతో ప్రవర్తన మార్చుకోమని గట్టిగా మందలించిన సందర్భాలు ఉన్నాయి. అందరిలాగే విష్ణు కూడా మొదట్లో కుటుంబ హింస భరించాడు. వాటన్నిటినీ దాటి తన అస్తిత్వాన్ని బహిరంగంగా ప్రకటించాడు. ఆ విషయం మా బంధుమిత్రులకు తెలిసినా.. చాలామంది మా ఎదుట బయటపడలేదు. ఒకరిద్దరు మాత్రం "వాణ్ణి ఎందుకు అలా వదిలేశావు? పెళ్లిచేస్తే మారతాడు' అని సలహాలిచ్చారు. అలాంటి మూర్ఖపు సలహాలు, సూచనలను నేనెప్పుడూ పట్టించుకోలేదు. వారి కోసం మా అబ్బాయిని వదులుకుంటామా? నాకు నా బిడ్డకన్నా బంధువులు ఎక్కువ కాదు. తమ లైంగికతకు పిల్లలు బాధ్యులు కారు. కనుక భిన్న లైంగికతలను అర్థం చేసుకొని తల్లిదండ్రులు వారికి మద్దతుగా ఉండాలి.



కుమారుడు విష్ణుతేజతో

జీవితాంతం ఒక తోడు...

మా అబ్బాయి 'గే' స్నేహితులు ఒకరిద్దరు ప్రాజెక్టుల పని మీద విదేశాలకు వెళ్లి జంటలుగా తిరిగివచ్చారు. వారంతా అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుంటారు. స్వలింగ సంపర్కుల జంట అయినా... సాధారణ భార్యాభర్తలాగే చాలా అన్యోన్యంగా ఒకరికొకరు చాలా ప్రేమగా మెలగడం చూసి నిర్ఘాంతపోయాను. 'మా అబ్బాయి కూడా ఎవరినైనా తనకు ఇష్టమైన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎంచుకుంటే బావుంటుంది కదా' అనిపించింది. అదే ఆలోచన వాడితో చెప్పాను. కానీ అవతలి నుంచి సమాధానం రాలేదు. వాడు ఒంటరిగా మిగిలిపోకూడదు అన్నది నా అభిమతం. నేను మాత్రం ఎంతకాలం వాడి మంచిచెడులు చూస్తాను? అందుకే విష్ణును అర్థంచేసుకొని వాడికి జీవితాంతం తోడుగా ఉండే ఒక వ్యక్తిని... అదీ వాడికి నచ్చిన అబ్బాయినే చూసుకొని కలసి బతకమని బతిమాలుతున్నాను. అదే సమయంలో మనుషుల్లో రకరకాల ప్రవృత్తులుంటాయి. గే కమ్యూనిటీలోనూ అంతా నమ్మకస్తులే ఉంటారనుకోలేం. రోజూ నేర వార్తల్లో రకరకాల వికృత పోకడలు చూస్తున్నాం కదా! అందుకే విష్ణుకు ఎప్పుడు ఎలాంటి ఆపద ఎదురవుతుందేమోనన్న భయంకూడా నాలో లేకపోలేదు. కుటుంబం, సమాజంతో పాటు కొన్ని సందర్భాలలో... తన సమూహంతోనూ పోరాడాల్సిన సందర్భం తనకు ఎదురుకావచ్చు. కాబట్టి "అందరినీ అమాయకంగా నమ్మకు" అని హెచ్చరిస్తూ ఉంటాను.

• సాంత్వన్

నైట్ షిఫ్టులు చేస్తే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

మారిన పరిస్థితుల దృష్ట్యా నేడు నైట్ షిఫ్టులు సాధారణమైపోయాయి. ఈ షిఫ్టుల వలన డిప్రెషన్, మధుమేహం, ఊబకాయంతో పాటు గుండె జబ్బుల ప్రమాదం ఎక్కువని తెలిసినప్పటికీ చేయక తప్పని పరిస్థితులు. కాబట్టి రాత్రి వేళల్లో పనిచేసే వారు ఆరోగ్యం కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఈ సంగతులేంటో తెలుసుకుందాం..



నిద్ర తప్పనిసరి: రాత్రంతా పనిచేసి పగటి పూట పడుకున్నా ఎలాంటి అవాంతరాలు లేకుండా 7-8 గంటలు తప్పకుండా నిద్రపోవాలి. కాబట్టి పడుకునేటప్పుడు గదిలోకి ఎలాంటి శబ్దాలు, వెలుతురు చొరబడకుండా జాగ్రత్త తీసుకోండి.

బయటి ఫుడ్ వద్దు: నైట్ షిఫ్టుల కారణంగా నీరసం, నిస్సత్తువ ఉండడం సహజం. దాంతో ఇంట్లో వంట పని, ఇంటి పని చేసుకోలేక చాలా మంది బయటి ఆహారం తినేస్తుంటారు. కానీ అలా చేస్తే మరిన్ని ఆరోగ్య సమస్యలు దరిచేరతాయి. అందుకే ఇంటి భోజనం తినడానికే ప్రాధాన్యమివ్వాలి. కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

టీ, కాఫీ వద్దు: నైట్ షిఫ్టుల్లో నిద్ర రాకుండా చాలా మంది టీ, కాఫీలు ఎక్కువగా తాగేస్తుంటారు. కానీ వీటిలోని చక్కెర వలన మధుమేహం బారిన పడతారు. అందుకే ఇష్టారీతిన ఎప్పుడు పడితే అప్పుడు టీ, కాఫీలు తాగేయకూడదు.

వ్యాయామం: శరీర దారుఢ్యం కోసం వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. కాబట్టి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. అలాగే యోగా చేయడం వలన మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

దుస్తుల నుంచి దుర్వాసనా?

వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. దాంతో ఉతికిన దుస్తులు సరిగ్గా ఆరక దుర్వాసన వస్తాయి. అలాగే అల్మారాల్లోని దుస్తుల నుంచి కూడా వాసన వస్తుంది. ఇలా కాకుండా ఉండాలంటే చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరి. అవేంటో తెలుసుకుందాం..



- నిమ్మరసం ఈ సమస్యను చక్కగా పరిష్కరిస్తుంది. ఒక చెంచా నిమ్మరసంలో కొంచెం నీరు కలిపి ఓ స్ప్రే బాటిల్‌లో పోయాలి. ఆ నీటిని వాసన వస్తున్న బట్టల మీద స్ప్రే చేసి గాలికి ఆరబెట్టాలి. నిమ్మరసం వాసన కలిగించే ఫంగస్ చంపి దుర్వాసనను తొలగిస్తుంది.
- వెనిగర్ కూడా దుర్వాసనకు కారణమయ్యే ఫంగస్‌ను నివారించడంలో బాగా పనిచేస్తుంది. వెనిగర్‌ను దుస్తుల మీద చల్లి నీళ్లతో శుభ్రం చేసి ఆరేస్తే దుర్వాసన నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వర్షాకాలంలో అల్మారాల్లో ఉన్న బట్టలు కూడా దుర్వాసన వెదజల్లుతాయి. అలాంటప్పుడు అల్మారాల మూలల్లో కొంచెం బేకింగ్ సోడా వేస్తే మంచి ఫలితముంటుంది.
- అల్మారాలను బ్లీచింగ్ ద్రావణంలో ముంచిన వస్త్రంతో తుడిచి ఆరిన తరువాత దుస్తులను సర్దుకోవాలి. ఇలా చేసినా దుర్వాసన రాదు.
- వాడేసిన బట్టలను ఎప్పటికప్పుడు ఉతకడం, వాషింగ్ మెషీన్‌లో ఉతికిన బట్టలను వెంటనే ఆరేసినా దుర్వాసన రాదు.
- తడిసిన బట్టలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా వెంటనే ఉతికేయాలి. గాలి బాగా తగిలే ప్రదేశంలో ఆరేస్తే దుస్తుల నుంచి వాసన రాకుండా ఉంటుంది.

సంప్రదాయ అభి'రుచి'

ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన తమ ఊర్లో ప్రతిచోటా పాశ్చాత్య ఆహారమే కనిపించడం 28 ఏళ్ళ మనీషా ఠాకూర్‌ను ఆలోచింపజేసింది.

స్థానిక సంప్రదాయ వంటకాల ప్రత్యేకతను చాటి చెప్పాలనే ఆమె తపన కొత్త ప్రయత్నానికి నాంది పలికింది.

హిమాచల్‌ప్రదేశ్‌లోని సల్బక్ గ్రామంలో మనీషా ఏర్పాటు చేసిన కేఫ్ ఇప్పుడు ఒక పర్యాటక ఆకర్షణగా మారింది.





"కొన్నాళ్ళ క్రితం ఢిల్లీ నుంచి నా స్నేహితులు కొందరు మా ఊరు వచ్చారు. వీధులన్నీ తిరిగి వచ్చాక... "మీ ప్రాంతం, నీ ఆతిథ్యం అన్నీ బాగానే ఉన్నాయి. కానీ వీధుల్లోకి వెళ్లి ఏదైనా తినాలనుకుంటే... నూడుల్స్, మంచూరియా లాంటివే తప్ప మరేం దొరకడం లేదేమిటి? ఇవి ఎక్కడైనా ఉండేవేగా! ఇక్కడి స్పెషల్స్ ఏమిటి" అని అడిగారు. ఆ మాట నిజమే. 'ఒక పర్యాటక ప్రాంతానికి వెళ్తాం. స్థానిక రుచుల్ని ఆస్వాదించాలనుకుంటాం. కానీ అక్కడ కూడా పాశ్చాత్య రుచులు లేదా పట్టణ ప్రాంతాల్లో కనిపించే పదార్థాలే కనిపిస్తే? మన ప్రత్యేకతను ఎందుకు కాపాడుకోలేకపోతున్నాం?...' ఈ ప్రశ్న నన్ను ఎంతోకాలం వేధించింది.

అన్నీ ఒకే రకంగా...

మాది హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని బిర్ బిల్లింగ్ అనే చిన్న గ్రామం. అది సుప్రసిద్ధమైన పర్యాటక ప్రదేశం. ప్రతి సంవత్సరం ఎంతోమంది టూరిస్టులు మా ఊరును సందర్శిస్తూ ఉంటారు. ఇక్కడి మార్కెట్‌లో నడుస్తూ ఉంటే ప్రతి చోటా ఒకే రకం ఆహారాన్ని అమ్మే దుకాణాలు కనిపిస్తాయి. కరోనా తరువాత నగరాల నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన స్థానిక యువకులు ఏర్పాటు చేసినవి కూడా ఎక్కువే ఉన్నాయి. స్థానికులు కూడా కొన్నేళ్ళుగా వీటి మీద మోజు పెంచుకుంటూ... తమ సంప్రదాయ వంటల్ని క్రమంగా విస్మరిస్తున్నారు. ఇదే కొనసాగితే ఆ వంటల్లో చాలావరకూ మరుగునపడే ప్రమాదం ఉంది. అందుకే మా ప్రాంత సంప్రదాయిక వంటలను మళ్ళీ అందరికీ రుచి చూపించాలని, ప్రోత్సహించాలని అనుకున్నాను. మాకు సమీపంలో ఉన్న సల్బక్ గ్రామంలో 'హర్ కేఫ్' పేరిట ఒక రెస్టారెంట్ ఏర్పాటు చేశాను.

స్థానిక మహిళలతో...

మా జిల్లా పేరు కంగ్రా. ఈ ప్రాంతంలో జరిగే ఉత్సవాలు, వివాహాలు, ఇతర వేడుకల్లో మధ్యాహ్న సమయంలో ఇచ్చే విందును 'కంగ్రీధమ్' అంటారు. దీనిలో భాగంగా చేసే వంటకాలు చాలా వైవిధ్యంగా, ఎంతో రుచిగా, ఆరోగ్యకరంగా ఉంటాయి. ఇప్పుడు వాటి స్థానంలో వేరే ప్రాంతాల వంటకాలు చోటు చేసుకుంటున్నాయి. వాటిని పరిరక్షించడం కోసం మా రెస్టారెంట్‌లో కంగ్రీధమ్ వంటకాలతో పాటు ఇదివరకు ఇళ్ళలో సాధారణంగా చేసుకున్న చిరుతిండ్లు, ఉపాహారాలను కూడా మెనూలో ఉంచాం. దాదాపు అన్నీ కట్టెల పొయ్యి మీదే వండుతున్నాం. వంటలు, ఇతర పనులు పూర్తిగా స్థానిక మహిళలే చేస్తారు. వారు తయారు చేసే పచ్చళ్ళు, పొడులను కూడా విక్రయిస్తున్నాం. ఇది వారికి ఉపాధి మాత్రమే కాదు, సాధికారతవైపు వేసే ఒక చిన్న అడుగు కూడా. ఇప్పుడు మా ఊరు వచ్చిన పర్యాటకులకు మా రెస్టారెంట్ ఒక ప్రత్యేక ఆకర్షణ. ప్రతి వంటకం గురించి వారు ఆసక్తిగా అడుగుతూ ఉంటారు. వారిలో మహిళలను మా కిచెన్‌లోకి ఆహ్వానించి.. వంటకాల తయారీ పద్ధతుల గురించి చెబుతున్నాం. స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండే రెస్టారెంట్ అలంకరణను కూడా వారు మెచ్చుకుంటున్నారు. అలాగే స్థానికులు కూడా తరచుగా 'హర్ కేఫ్'కు వస్తున్నారు. ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు వెళ్ళినవారు... మా ఊరు వచ్చినప్పుడు స్థానిక రుచుల్ని మా రెస్టారెంట్‌లో ఆరగిస్తున్నారు. వాటి రెసిపీల గురించి ఆరా తీస్తున్నారు. ఇంతకన్నా సంతోషం కలిగించే విషయం ఇంకేముంటుంది?".

> మా జిల్లా పేరు కంగ్రా. ఈ ప్రాంతంలో జరిగే ఉత్సవాలు, వివాహాలు, ఇతర వేడుకల్లో మధ్యాహ్న సమయంలో ఇచ్చే విందును 'కంగ్రీధమ్' అంటారు. దీనిలో భాగంగా చేసే వంటకాలు చాలా వైవిధ్యంగా, ఎంతో రుచిగా, ఆరోగ్యకరంగా ఉంటాయి. ఇప్పుడు వాటి స్థానంలో వేరే ప్రాంతాల వంటకాలు చోటు చేసుకుంటున్నాయి.

ఇవి అతిగా తింటే అనర్థమే

గుమ్మడి గింజల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిసిందే. అయితే ఏదైనా సరే అతిగా తీసుకోవడం అనర్థాలకు దారితీస్తుంది. గుమ్మడి గింజలు కూడా అంతే. వీటిని అతిగా తినడం ఆరోగ్యానికి చేటని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ వివరాలివీ..

- గుమ్మడి గింజల్లో ఫైబర్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి దోహదం చేస్తుంది. అయితే ఈ గింజలు ఎక్కువ మోతాదులో తీసుకోవడం వలన కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్, డయేరియా సమస్యలు తలెత్తుతాయి.
- ఈ విత్తనాల్లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి వీటిని అతిగా తీసుకుంటే బరువు పెరిగే ప్రమాదం ఉంది.
- గుమ్మడి గింజలు అధిక రక్తపోటును నియంత్రిస్తాయి. కాట్టి లోబీపీ ఉన్న వారు ఎక్కువగా తీసుకుంటే నీరసంతో అనారోగ్యం బారిన పడతారు.
- ఇవి తింటే కొందరికి చర్మంపై దురద, దద్దుర్లు వంటి అలర్జీలు రావచ్చు.
- ఇక చిన్న పిల్లలకు గుమ్మడి గింజలు ఇచ్చేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలు వాటిని నమిలి మింగేలా చూడాలి. లేకపోతే గొంతులో ఇరుక్కుని ఇబ్బంది పడే అవకాశముంటుంది.



ప్రింటింగ్ టెక్నాలజీలో డిప్లొమా

ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య పెరిగిన తరువాత డిప్లొమాలకు ఆదరణ తగ్గింది. ఉద్యోగం రావాలంటే ఎలాగూ బీటెక్ చేయాలి కదా అనే ఆలోచనే ఇందుకు కారణం కావచ్చు. అయితే డిప్లొమా పూర్తి చేయగానే ఉద్యోగం వచ్చే కోర్సులు కొన్ని ఉన్నాయి. అందులో 'డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ' ఒకటి. హైదరాబాద్‌లోని కులీకుతుబ్‌షా పాలిటెక్నిక్‌లో ఈ కోర్సు ఉంది. ఇందులో 60 సీట్లు ఉన్నాయి. వందశాతం ప్లేస్‌మెంట్‌కు అవకాశం ఉన్న డిప్లొమా ఇది. ఈ కోర్సు చేసినవారు విదేశాల్లోనూ పనిచేయవచ్చు.

కోర్సు స్వరూపం

ప్రింటింగ్ అవసరం లేని వస్తువు ఉండదు అంటే అతిశయోక్తి కాదు. మార్కెట్ అవసరాల రీత్యా ఈ డిప్లొమాను మూడు సంవత్సరాల కోర్సుగా రూపొందించారు. ఆఫ్‌సెట్, గ్రావ్యూర్, ఫ్లెక్సోగ్రఫీ, స్క్రీన్, డిజిటల్ ప్రింటింగ్ తదితరాల గురించి ఇందులో బోధిస్తారు. మొదటి రెండు సబ్జెక్టులు ప్రింటింగ్ గురించి ఉంటాయి. మిగిలిన సబ్జెక్టులు అన్నీ డిప్లొమాలతో సమానంగా చదవాల్సి ఉంటుంది. కోర్సులో భాగంగా వీరు ప్రముఖ ముద్రణ సంస్థల్లో ఇండస్ట్రియల్ విజిట్‌కు కూడా వెళతారు. చివరి సెమిస్టర్‌లో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుంది.



ఉన్నత విద్యావకాశాలు

ఈ డిప్లొమా తరువాత ఈసెట్‌లో ర్యాంకు సాధించి ప్రింటింగ్ టెక్నాలజీలో బీటెక్ లేదా మెకానికల్, కంప్యూటర్స్, ఐటీ, ప్రొడక్షన్ తదితర ఇంజనీరింగ్ కోర్సులు కూడా చదవవచ్చు.

గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఈ కోర్సు అందించే సంస్థలు

- మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కర్ణాటక)
- జాదవ్‌పూర్ యూనివర్సిటీ (పశ్చిమ బెంగాల్)
- కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, గిండీ (తమిళనాడు)
- గురు జంబేశ్వర్ యూనివర్సిటీ (హరియాణ)
- సింఘానియా యూనివర్సిటీ (రాజస్థాన్)
- కాలికట్ యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (కేరళ)
- అవినాశలింగమ్ ఇన్‌స్టిట్యూట్ (తమిళనాడు)

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఈ సంస్థలో చదివిన అందరికీ దాదాపుగా ఉద్యోగాలు లభిస్తాయి. మన దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రింటింగ్ సంస్థల్లోనే కాకుండా విదేశాల్లోని సంస్థల్లో కూడా ఉద్యోగాలు చేయవచ్చు. గత కొంత కాలంగా ఈ కోర్సులో చేరే అమ్మాయిల సంఖ్య కూడా పెరగడం గమనార్హం.

చిరునామా: కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, చందూలాల్ బారాదరి, జూపార్క్ దగ్గర, రమ్నాస్‌పుర, హైదరాబాద్, తెలంగాణ - 500 064
ఫోన్: 9000058678, 9440746409, 9603660632

కెరీర్ గైడ్

నిన్న మొన్నటి దాకా ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల మొదటి చాయిస్ కంప్యూటర్ సైన్స్. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వచ్చిన తరువాత పరిస్థితి మారింది. మార్కెట్‌లో ఉద్యోగాలు తగ్గడం మొదలయ్యాయి. పులిమీద పుట్రలా అమెరికా జాబ్ మార్కెట్ ఇబ్బందులతో మరింత క్షీణించింది. దీంతో సీఎస్సీ చదవాలనే విద్యార్థుల ఆలోచనలు మారి కోర్ సబ్జెక్టుల వైపు దృష్టి సారించడం మొదలుపెట్టారు. అంతే కాకుండా విద్యార్థులను ఇటువైపు మళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోర్ బ్రాంచెస్‌లు ఎలా ఉంటాయో వివరిస్తున్నారు రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ **ఎన్.వి.రమణరావు**. ఆయన గతంలో ఎంసెట్ కన్వీనర్‌గా, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా పనిచేశారు.



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్ళలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్ళలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కం ట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సాఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికి అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సాఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, బీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా ఇలా పలు సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు

దిక్సూచి

ఎస్ఎస్‌సీ కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ, గ్రాడ్యుయేట్ లెవెల్ నోటిఫికేషన్

గ్రాడ్యుయేట్ లెవెల్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లోని 14,582 ఖాళీలను భర్తీ చేయనున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కొన్ని పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.

వయస్సు: 2025 ఆగస్టు 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 జూలై 4

ఎంపిక విధానం:

- టైర్-1 సీబీటీ ఆబ్జెక్టివ్ పరీక్ష
- టైర్-2 సీబీటీ - ఆబ్జెక్టివ్ పరీక్ష + స్కిల్ టెస్టులు
- డాక్యుమెంట్ వెరిఫికేషన్

వెబ్‌సైట్: https://ssc.gov.in/



కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ పూర్తిచేసిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 3131 ఖాళీలు ఉన్నాయి

- లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
- డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్మీడియేట్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్ విద్యార్థులూ అర్హులు. కొన్ని పోస్టులకు మాత్రం ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.

వయస్సు: 2026 జనవరి 1వ తేదీ నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1999 జనవరి 1 నుంచి 2008 జనవరి 1వ తేదీన జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 15 సంవత్సరాల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 18

వెబ్‌సైట్: https://ssc.gov.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మధ్యతరగతి కుటుంబాల కథ



సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని ప్రధాన పాత్రల్లో శ్రీ గణేశ్ తెరకెక్కించిన చిత్రం '3బీహెచ్‌కే'. శాంతి టాకీస్ బేనర్‌పై అరుణ్ విశ్వ నిర్మించారు. జూలై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ ' తండ్రీకొడుకుల అనుబంధాన్ని బొమ్మరిల్లు సినిమాలో చూశారు. అలాంటి అనుబంధాన్నే ఇప్పుడు '3బీహెచ్‌కే' చిత్రంలో చూస్తారు' అని అన్నారు. నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ 'మనమందరం మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చాం. ఇల్లు కట్టుకోవాలనే కల అందరికీ ఉంటుంది. ఇల్లు అనేది ఒక గౌరవం. కుటుంబ సభ్యులంతా ఒకే చోట కూర్చొని చూడదగిన చిత్రమిది' అని అన్నారు. చిత్రదర్శకుడు శ్రీ గణేశ్ మాట్లాడుతూ 'మా సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. చాలా ప్రేమతో ఈ సినిమా తీశాం. ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని అన్నారు. చిత్ర నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ 'ఈ చిత్రం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని అన్నారు.

భారతీయ సినీరంగం గర్వించే విషయం

- పవన్‌కల్యాణ్



హీరో కమల్ హాసన్ ఆస్కార్ కమిటీలో సభ్యుడిగా ఎంపికవ్వడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సినీరంగం గర్వించే విషయమని ప్రశంసించారు. "ప్రపంచమంతా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల కమిటీలో సభ్యుడిగా పద్మభూషణ్ కమల్ హాసన్ ఎంపికవ్వడం భారతీయ సినీరంగం గర్వించదగ్గ విషయం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన నటుడిగా, దర్శకుడిగా, కథకుడిగా భారతీయ, ప్రపంచ సినిమాపై చెరగని ముద్ర వేశారు. సినిమా మేకింగ్ విషయంలో ఆయనకు ఉన్న పట్టు స్ఫూర్తిదాయకం. ప్రపంచ సినిమాకు ఆయన ఇలాగే మరింత కాలం సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. కాగా, 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఇటీవల విడుదల చేసిన కొత్త కమిటీ సభ్యుల జాబితాలో భారత్ నుంచి కమల్ హాసన్‌తో పాటు నటుడు ఆయుష్మాన్ ఖురానా, దర్శకురాలు పాయల్ కపాడియా, ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు ఉన్నారు. హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో వీరు పాలుపంచుకోనున్నారు.

సీక్వెల్ రాబోతోంది



యూత్‌ను విపరీతంగా ఆకట్టుకున్న సినిమాల్లో 'ఈ నగరానికి ఏమైంది' ఒకటి. విశ్వక్ సేన్ కథానాయకుడిగా తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ చిత్రానికి కొనసాగింపు భాగం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఆదివారం ఈ సినిమాకు సీక్వెల్ రాబోతుందని ప్రకటించారు మేకర్స్. 'ఈఎన్ఈ రిపీట్' అనేది టైటిల్. 'ఏలినాటి శనిపోయింది. కన్యారాశి టైమ్ వచ్చింది' అనేది ట్యాగ్‌లైన్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. మొదటి పార్ట్‌కు పనిచేసిన చిత్రబృందమే ఈ సీక్వెల్‌లోనూ భాగమవుతున్నారు. తరుణ్‌భాస్కర్ దాస్యం దర్శకత్వంలో డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మించనున్నారు. విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను ప్రధాన పాత్రలు పోషించనున్నారు.

యువతను ఆకట్టుకునేలా...




నూతన నటుడు సాయికృష్ణ హీరోగా వెంకటరమణ పసుపులేటి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలె ప్రారంభించిన ఈ సినిమాకు 'పవర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "యువతను ఆకట్టుకునే కథాంశంతో పాటు అద్భుతమైన సాంకేతిక విలువలతో చిత్రం ఉంటుంది. టాలీవుడ్‌లో కొత్త ఒరవడి సృష్టిస్తుంది" అని అన్నారు. ఆ చిత్రానికి ఎడిటర్: నందమూరి హరి, సినిమాటోగ్రఫీ: బి.ఎస్.కుమార్, సంగీతం: శంకర్ మహదేవన్.

షఫాలీ మృతికి కారణమిదేనా?



'కాంటా లగా' సాంగ్ ఫేమ్ షఫాలీ జరివాలా(42) ఆకస్మిక మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్న సంగతి తెలిసిందే. ఆమె గుండెపోటుతో మరణించారని మొదట వార్తలు వచ్చాయి. ఆమె కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు మృతికి గల పూర్తి కారణాలను ఇంకా వెల్లడించలేదు. మరోవైపు అందంపై ఉన్న మమకారమే ఆమె ప్రాణాలు కోల్పోయేలా చేసిందని నెట్టింట వార్తలు వస్తున్నాయి. ఆమె కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్సను తీసుకుంటున్నట్లు సమాచారం. శుక్రవారం ఇంట్లో పూజ ఉండడంతో ఆమె ఆ రోజంతా ఉపవాసం ఉన్నారని.. ఖాళీ కడుపుతో యాంటీ ఏజింగ్ ఔషధాలు, ఇంజెక్షన్లు తీసుకోవడంతో అవి వికటించి గుండెపోటుకు దారి తీసుంటాయని వార్తలు వస్తున్నాయి.



నయారా ఎనర్జీకి రాస్‌నెఫ్ట్ గుడ్‌బై!

- అమ్మకానికి రిలయన్స్‌తో చర్చలు
- వాల్యుయేషన్ విషయంలో రాని స్పష్టత

న్యూఢిల్లీ: దేశ పెట్రోలియం రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని వడినార్ వద్ద రెండు కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన నయారా ఎనర్జీ రిఫైనరీ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని రష్యా చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు ఈక్విటీలో ఈ కంపెనీకి 49.13 శాతం వాటా ఉంది. ఈ వాటాను విక్రయించేందుకు రాస్‌నెఫ్ట్ అధికారులు గత ఏడాది కాలంలో మూడు సార్లు ముంబై, ఢిల్లీ వచ్చి వివిధ కంపెనీలతో చర్చలు జరిపినట్టు సమాచారం. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)తో కూడా ప్రస్తుతం ఇందుకోసం ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే దీనిపై రెండు కంపెనీలు అధికారికంగా నోరు మెదపడం లేదు. రాస్‌నెఫ్ట్‌తో పాటు ఈ రిఫైనరీలో 24.5 శాతం వాటా కలిగిన మరో రష్యా కంపెనీ యూసీపీ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ కూడా తన వాటా అమ్మకానికి పెట్టినట్టు తెలుస్తోంది.

2017లో ఎస్సార్ నుంచి కొనుగోలు: ఎస్సార్ ఆయిల్‌గా ఉన్న ఈ రిఫైనరీ ప్రాజెక్ట్ ఈక్విటీలో మెజారిటీ వాటాను రష్యా కంపెనీలు 2017లో 1,290 కోట్ల డాలర్లకు కొనుగోలు చేశాయి. అమెరికా, ఈయూ ఆంక్షలతో ఈ రిఫైనరీ ప్రాజెక్టు లాభాలను తమ దేశానికి తరలించడం రష్యా కంపెనీలకు ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. దీంతో నయారా ఎనర్జీ కంపెనీ నుంచి తప్పుకోవడమే మేలనే నిర్ణయానికి వచ్చాయి. ఇందుకోసం ఆర్ఐఎల్‌తో సహా సౌదీ అరామ్కో, అదానీ గ్రూప్, ఓఎన్‌జీసీ/ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)లను రష్యా కంపెనీలు సంప్రదించాయి. అయితే ఈక్విటీలో తమ వాటాకు రష్యా కంపెనీలు 2,000 కోట్ల డాలర్లు (సుమారు రూ1.7 లక్షల కోట్లు) అడిగినట్టు సమాచారం. ఇది చాలా ఎక్కువనే అంచనాతో ఈ కంపెనీలు నయారా కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు.

రిలయన్స్‌కే లాభం

గుజరాత్‌లోని వడినార్ రిఫైనరీతో పాటు నయారా ఎనర్జీ కంపెనీకి దేశవ్యాప్తంగా 6,750 పెట్రోలు బంకులు ఉన్నాయి. ఈ రిఫైనరీకి దగ్గరలోనే రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏటా 6.82 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న రెండు రిఫైనరీలు నిర్వహిస్తోంది. నయారా ఎనర్జీ కూడా తోడైతే పెట్రో రిఫైనింగ్‌లో ఐఓసీకి ఉన్న 8.08 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని మించిపోవచ్చని రిలయన్స్ కోరిక. అయితే రష్యా కంపెనీలు అడుగుతున్న 2,000 కోట్ల డాలర్లు చాలా ఎక్కువని రిలయన్స్ కూడా పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. దీంతో రష్యా కంపెనీలు తాము ఆశించే మొత్తాన్ని 1,700 కోట్ల డాలర్లకు తగ్గించాయి. ఇది కూడా చాలా ఎక్కువని రిలయన్స్ భావిస్తున్నట్టు సమాచారం.

26,000 పైన బుల్లిష్

(జూన్ 30-జూలై 4 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,634-24,825 పాయింట్ల మధ్యన కదలాడి 526 పాయింట్ల లాభంతో 25,638 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,426, 25,162, 25,054, 24,916 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేక్‌అవుట్ స్థాయి: 26,000 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,300
నిరోధ స్థాయిలు: 25,850, 25,950, 26,050
(25,750 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,525, 25,425, 25,325
(25,625 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	565	విజయవాడ	590
వరంగల్	567	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	95
వరంగల్	90	గుంటూరు	100
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	85
కర్నూలు	90	నెల్లూరు	90
విశాఖపట్నం	84	అనంతపురం	90
గోదావరి	95		

టోరెంట్ ఫార్మా చేతికి జేబీ కెమికల్స్

డీల్ విలువ రూ.19,500 కోట్లు

న్యూఢిల్లీ: భారత ఫార్మా రంగంలో మరో భారీ డీల్ చోటు చేసుకుంది. జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్‌ను టోరెంట్ ఫార్మా రూ.19,500 కోట్లకు కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం జేబీ కెమికల్స్ ఈక్విటీలో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ కేకేఆర్ అనుబంధ సంస్థ.. టావ్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ పీటీఈ లిమిటెడ్‌కు ఉన్న 46.39 శాతం వాటాను రూ.11,917 కోట్లకు, జేబీ కెమికల్స్ ఉద్యోగుల వద్ద ఉన్న 2.8 శాతం వాటాను రూ.719 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య స్పష్టమైన ఒప్పందం కుదిరినట్టు టోరెంట్ ఫార్మా ఆదివారం ప్రకటించింది. ఇందుకోసం టోరెంట్ ఫార్మా జేబీ కెమికల్స్ ఒక్కో షేరుకు రూ.1,600 చొప్పున చెల్లించనుంది. ప్రజల వద్ద ఉన్న మరో 26 శాతం వాటాను ఒక్కో షేరు రూ.1,639.18 చొప్పున రూ.1,799.35 కోట్లకు కొనేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఈ కొనుగోలుతో ఫార్మా రంగంలో తమ స్థానం మరింత పటిష్ఠం కావడంతో పాటు కాంట్రాక్ట్ రీసెర్చ్, తయారీ రంగంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని టోరెంట్ ఫార్మా తెలిపింది.

దాన ధర్మాలకు మరో రూ.51,300 కోట్లు

వారెన్ బఫెట్

న్యూయార్క్: అమెరికా కుబేరుడు, స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. అమెరికా కేంద్రంగా పనిచేసే ఐదు స్వచ్ఛంద సేవా సంస్థలకు తన నిర్వహణలోని బెర్క్‌షైర్ హాత్‌వేకు చెందిన 600 కోట్ల డాలర్ల (సుమారు రూ.51,300 కోట్లు) విలువైన 1.24 కోట్ల షేర్లను విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు. దీంతో 2006 నుంచి ఈ ఐదు సంస్థలకు బఫెట్ విరాళంగా ఇచ్చిన షేర్ల విలువ 6,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.5.13 లక్షల కోట్లు) చేరింది. సోమవారం ఈ షేర్లను ఆయా స్వచ్ఛంద సేవా సంస్థల పేరు మీద బదిలీ చేయనున్నట్టు బఫెట్ తెలిపారు.

వస్తున్నాయ్ 'జొమాటో' విమానాలు

ముంబై/న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో సహ వ్యవస్థాపకుడు దీపీందర్ గోయెల్.. ల్యాట్ ఏరోస్పేస్ భాగస్వామ్యంలో ప్రాంతీయ విమానయానంలో ప్రవేశించే యోచన చేస్తున్నారు. జొమాటో సహ వ్యవస్థాపకురాలు సురభి దాస్ లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో ఈ విషయం వెల్లడించారు. దేశంలోని 450 ఎయిర్‌స్ట్రిప్‌లలో 150 మాత్రమే పని చేస్తున్నాయి. అంటే మూడింట రెండు వంతులు ఇప్పటికీ వృధాగానే పడి ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవడం వల్ల ఇప్పటికీ రోడ్డు లేదా రైలు మార్గాల్లో ప్రయాణిస్తూ గంటలు, రోజులు వృధా చేసుకుంటున్న సగటు జీవులకు తక్కువ వ్యయంతో విమానాల్లో తిరిగే అవకాశం కల్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. తాము ప్రారంభించాలనుకుంటున్న ల్యాట్ ఏరోస్పేస్ విమానాలు ఒక పార్కింగ్ లాట్‌తో సమానమైన విస్తీర్ణం ఉండే ఎయిర్-స్ట్రిప్‌లలో టేకాఫ్, ల్యాండింగ్ కాగలవని ఆమె చెప్పారు.

ఈ వారం దూకుడుగానే..!

దేశీయ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా చలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో పరిస్థితులు సద్దుమణగడం, ముడి చమురు ధరలు తగ్గటం, భారత్‌తో వాణిజ్య ఒప్పందం చివరి దశకు చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పటం సానుకూల అంశాలు. పైగా గత వారం నిఫ్టీ కీలకమైన 25,200 నిరోధ స్థాయిని దాటి 25,637 వద్ద స్థిరపడింది. ఎఫ్ఐఐలు మళ్లీ కొనుగోళ్ల బాట పట్టాయి. ప్రస్తుతం బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్స్, రిఫైనరీ, ఎయిర్‌లైన్స్ రంగాల షేర్లు బుల్లిష్‌గా ఉన్నాయి. రియల్టీ, ఐటీ షేర్లు బేరిష్‌గా ఉన్నాయి. ఇన్వెస్టర్లు 'పడితే కొనుగోలు చేయటమే వ్యూహా'న్ని (బై ఆన్ డిప్స్) అనుసరించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఏసీసీ లిమిటెడ్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. షార్ట్ మూమెంటమ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ షేరు కీలకమైన రూ.1,850 స్థాయిలో మరోసారి మద్దతు తీసుకుంది. గత శుక్రవారం రూ.1,920 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,900 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,050/2,120 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,865 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ బ్యాంక్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కన్సాలిడేట్ అవుతోంది. ప్రైస్ యాక్షన్ చాలా టైట్‌గా కొనసాగుతోంది. షార్ట్, మీడియం టర్మ్ మూమెంటమ్, వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.1,462 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,430/1,450 శ్రేణిలో ప్రవేశించి రూ.1,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ1,400 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ ఎంటర్‌ప్రైజెస్: ఈ ఏడాది మార్చి నుంచి ఈ షేరు స్వల్పకాల అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ఆరు నెలల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. క్రమంగా మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.2,646 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,600 స్థాయిలో ప్రవేశించి రూ.2,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,545 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 15 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. రక్షణ రంగంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగటమే ఇందుకు కారణం. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. స్వల్పకాల మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,890 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,860 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,820 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏషియన్ పెయింట్స్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ఇప్పుడిప్పుడే కన్సాలిడేషన్ జరుగుతోంది. స్వల్పకాలిక మూమెంటమ్ పెరుగుతోంది. ముడి చమురు ధరలు తగ్గుతుండటంతో మళ్లీ మదుపరులు ఈ కౌంటర్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.2,358 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,320/2,300 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,275 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

తదుపరి నిరోధం 26,000


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కరెక్షన్‌లో పడినా కీలకమైన 25,000 స్థాయిలో బలమైన పునరుజ్జీవంతో వారం గరిష్ఠ స్థాయి 25,640 సమీపంలో ముగిసింది. ఆరు వారాల కన్సాలిడేషన్ అనంతరం మార్కెట్ బలమైన ర్యాలీతో బ్రేకౌట్ సాధించింది. అలాగే మిడ్‌క్యాప్-100 సూచీ కూడా 1,400 పాయింట్ల మేరకు లాభపడి ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 60,000 చేరువకు వస్తోంది. స్మాల్‌క్యాప్-100 సూచీ 780 పాయింట్ల లాభంతో 19,000 సమీపంలో నిలిచింది. గత వారం నిట్టనిలువుగా ర్యాలీని సాధించినందు వల్ల ఈ వారంలో తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేట్ కావచ్చు. టెక్నికల్‌గా ట్రెండ్ పాజిటివ్‌గానే ఉన్నా అప్రమత్త ట్రెండ్‌కు ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. ప్రధాన నిరోధ స్థాయిలు 26,000, 26,100. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు. మరింత సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌కు గురైనా సానుకూలత కోసం మైనర్ మద్దతు స్థాయి 25,500 వద్ద నిలదొక్కుకోవాలి. అంతకన్నా దిగజారితే మైనర్ బలహీనత ఏర్పడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 25,000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ 1,200 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించి ఆల్ టైమ్ హై 57,450 వద్ద ముగిసింది. మానసిక అవధి 58,000. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు. ఆ పైన మాత్రమే అప్‌ట్రెండ్ కొనసాగుతుంది. బలహీనపడినా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 57,000 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తున్నందు వల్ల ట్రేడర్లు అప్రమత్తం కావాలి. మరింత అప్‌ట్రెండ్ కోసం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. వీక్లీ చార్టుల్లో బ్రేకౌట్ కనిపిస్తున్నందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు కూడా ఆస్కారం ఉంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,760, 25,850
మద్దతు	25,560, 25,500

స్పోర్ట్స్

హ్యాట్రిక్‌పై అల్కారజ్ గురి

వింబుల్డన్ నేటి నుంచి

అల్కారజ్, జొకోవిచ్



టాప్ సీడ్‌గా సినర్

25వ గ్రాండ్‌స్లామ్ వేటలో జొకోవిచ్

మహిళల ఫేవరెట్లు గాఫ్, సబలెంక

లండన్: డబుల్ డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్ మరోసారి వింబుల్డన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. సోమవారం నుంచి జరిగే గ్రాస్‌కోర్ట్ గ్రాండ్‌స్లామ్‌లో రెండో సీడ్ అల్కారజ్ విజేతగా నిలిస్తే.. దిగ్గజం రోజర్ ఫెడరర్ తర్వాత హ్యాట్రిక్ సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు. గతేడాది అల్కారజ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ తన 25వ టైటిల్ కలను నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో ఉన్నాడు. కానీ, ఇటీవలి ఫామ్‌తోపాటు జొకో ఫిట్‌నెస్ చూస్తుంటే కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆరో సీడ్‌గా బరిలోకి దిగుతున్న జొకో తొలి రౌండ్‌లో అలెగ్జాండర్ ముల్లర్‌తో తలపడనున్నాడు. అయితే, క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ జాక్ డ్రేపర్ రూపంలో నొవాక్‌కు అసలుసిసలు సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. ఇది గట్టెక్కితే సెమీస్‌లో టాప్ సీడ్ జానిక్ సినర్‌తో ఆడాల్సి రావచ్చు. తొలి రౌండ్‌లో లూకా నర్డీ (ఇటలీ)తో సినర్, ఫాబియో ఫాగ్ని (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నారు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మెద్వెదెవ్, ఆండీ రుబ్లేవ్, హోల్గర్ రూన్ కూడా సత్తా చాటాలనుకొంటున్నారు.



ప్రాక్టీస్ సెషన్‌లో గాఫ్, సబలెంకా

లైన్ జడ్జిలు లేకుండా..

147 ఏళ్ల వింబుల్డన్ చరిత్రలో తొలిసారి లైన్ జడ్జిలు లేకుండా టోర్నీ జరగనుంది. టెక్నాలజీకి పెద్ద పీట వేసిన నిర్వాహకులు ఎలక్ట్రానిక్ లైన్ కాలింగ్ సిస్టమ్‌ను తొలిసారి ఉపయోగించనున్నారు. ఇందు కోసం 450 ట్రాకింగ్ కెమెరాలను కూడా ఉపయోగించనున్నారు. అంతేకాకుండా సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లను రెండు గంటలు ఆలస్యంగా అంటే.. సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. ప్రైజ్‌మనీని కూడా గతేడాదితో పోల్చితే 11 శాతం పెంచారు.

మహిళల పోటీ రసవత్తరం

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ అరియానా సబలెంక, ఫ్రెంచ్ ఓపెన్ విజేత కొకొ గాఫ్, 8వ సీడ్ ఇగా స్వియాటెక్ మధ్య పోటీ తీవ్రంగా ఉంది. 2016లో సెరెనా విలియమ్స్ ఏడో టైటిల్ సాధించిన తర్వాత.. వరుసగా కొత్త చాంపియన్లే వస్తున్నారు. కాగా, డిఫెండింగ్ చాంప్ బార్బరా క్రెజికోవా పేలవ ఫామ్ కొనసాగుతుండడంతో ఆమెపై పెద్దగా అంచనాలు లేవు. సబలెంక ముందుకు సాగితే.. క్వార్టర్స్‌లో మాడిసన్ కీస్‌ను ఎదుర్కోవాల్సి రావచ్చు. గతేడాది రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పొలినీకి క్వార్టర్స్‌లో క్విన్‌వెన్ జాంగ్ రూపంలో గట్టిసవాల్ ఎదురుకావచ్చు. రెండో సీడ్ కొకొ గాఫ్.. తొలి రౌండ్‌లో డయానా ఎస్ట్రీమ్‌స్కాతో, కుదర్మెటోవాతో స్వియాటెక్ తలపడనున్నారు. రిబకినా, మిర్రా ఆంద్రీ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకొంటున్నారు.

మన మహిళలకు రెండో విజయం

ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్స్



చియాంగ్ మాయ్ (థాయ్‌లాండ్): ఏఎఫ్‌సీ మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత సీనియర్ జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత మహిళలు 4-0తో తైమూర్ లెసెతె జట్టును చిత్తు చేశారు. వింగర్ మనీషా కళ్యాణ్ (12, 80ని.) రెండు, అంజు (58ని.), లిండా కోమ్ (86ని.) చెరో గోల్ సాధించారు. తొలి మ్యాచ్‌లో మనోళ్లు 13-0తో మంగోలియాపై నెగ్గారు. ఈ రెండో విజయంతో..మొత్తం ఆరు పాయింట్లతో భారత మహిళలు గ్రూప్ టాపర్‌గా నిలిచారు.



సెమీస్‌లో నిఖత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌తో సహా ముగ్గురు తెలంగాణ బాక్సర్లు సెమీఫైనల్లోకి ప్రవేశించారు. ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రెండో రోజు పోటీల్లో 48-51 కిలోల విభాగంలో నిఖత్ 5-0తో కల్పన (సాయ్)పై తిరుగులేని విజయం సాధించి పతకానికి చేరువైంది. 57-60 కి., కేటగిరీలో జి. నిహారిక 5-0తో ప్రియాంక (చండీగఢ్)పై, 60-65 కి., విభాగంలో యషి శర్మ 3-2తో సరిత రాయ్ (ఉత్తరప్రదేశ్)పై నెగ్గి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నారు. 45-48 కి., మంజు రాణి, 70-75 కి., లవ్లీనా తమ బౌట్లలో గెలిచి, ముందంజ వేశారు.



ఫైనల్లో తన్వీ, ఆయుష్

● యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్

లోవా (యూఎస్): భారత వర్ధమాన షట్లర్లు తన్వీ శర్మ, ఆయుష్ షెట్టి యూఎస్ ఓపెన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో 16 ఏళ్ల తన్వీ 21-14, 21-16తో ఏడో సీడ్ పోలినా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. తుది పోరులో బివిన్ జాంగ్‌తో తన్వీ అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో ఆయుష్ 21-23, 21-15, 21-14తో టాప్ సీడ్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)పై పోరాడి గెలిచాడు. ఫైనల్లో మూడో సీడ్ బ్రియాన్ యంగ్‌తో ఆయుష్ తలపడనున్నాడు.



సీఏసీ చైర్మన్‌గా ప్రజ్ఞాన్ ఓఝా!

హెచ్‌సీఏ ఏజీఎం


ఏజీఎంకు హాజరైన దేవ్‌రాజ్, జగన్‌మోహన్‌రావు, శివ్‌లాల్ యాదవ్, వెంకటపతిరాజు, చాముండేశ్వర్‌నాథ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ఎలాంటి రసాభాస లేకుండా ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఏజీఎంలో హెచ్‌సీఏ క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) చైర్మన్‌గా మాజీ క్రికెటర్ ప్రజ్ఞాన్ ఓఝా పేరును మెజారిటీ సభ్యులు ప్రతిపాదించడంతో అతడి నియామకం లాంఛనం కానుంది. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి కోసం హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు అధ్యక్షతన డిస్ట్రిక్ట్ క్రికెట్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. హెచ్‌సీఏ లీగ్స్ నిర్వహణ కూడా అసోసియేషన్‌లోని లీగ్ కమిటీనే పర్యవేక్షించేలా త్వరలో చైర్మన్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ ఏడాది తెలంగాణ టీ20 ప్రీమియర్ లీగ్ నిర్వహణకు ఐదుగురు సభ్యులతో గవర్నింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాలో స్టేడియం నిర్మించేందుకు జిల్లాకో 25 ఎకరాల భూమి హెచ్‌సీఏకు ప్రభుత్వం సబ్సిడీ ధరకు ఇచ్చేలా సంఘంలో సభ్యులుగా ఉన్న ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురామ్ రెడ్డి కృషి చేయాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ కోరారు. ఈ సమావేశంలో మాజీ క్రికెటర్లు అజరుద్దీన్, వెంకటపతి రాజు, హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబిగించిన దక్షిణాఫ్రికా

బులవాయో: జింబాబ్వేతో తొలి టెస్ట్ రెండోరోజే దక్షిణాఫ్రికా పూర్తిగా పట్టు బిగించింది. ముల్డెర్ (4వికెట్లు), యూసుఫ్, కేశవ్ మహరాజ్ (చెరి 3 వికెట్లు) రాణించడంతో జింబాబ్వే 251 పరుగులకే ఆలౌటైంది. విలియమ్స్ (137) శతకం సాధించాడు. దీంతో సఫారీలకు 167 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆదివారం ఆఖరికి వికెట్ నష్టానికి 49 పరుగులు చేయడంతో సఫారీల ఆధిక్యం 216 పరుగులకు చేరింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 418/9 వద్ద డిక్లేర్ చేసింది.

200 వికెట్ల కేశవ్: తాత్కాలిక కెప్టెన్ కేశవ్ మహరాజ్ టెస్ట్‌ల్లో 200 వికెట్లు సాధించిన తొలి సఫారీ స్పిన్నర్‌గా రికార్డులకెక్కాడు. రెండోరోజు ఆటలో జింబాబ్వే సారథి ఇర్విన్‌ను అవుట్ చేసిన 35 ఏళ్ల కేశవ్ ఈ ఫీట్ అందుకున్నాడు.

అప్పుడు గుండె ఆగినంత పనైంది..





న్యూఢిల్లీ: భారత జట్టు రెండో టీ20 ప్రపంచకప్‌ను సాధించి ఈనెల 29కి ఏడాది పూర్తయ్యింది. దక్షిణాఫ్రికాతో జరిగిన నాటి ఫైనల్లో భారత్ విశ్వకప్ గెల్చుకుంది. ఆ మ్యాచ్ చివరి ఓవర్‌లో సూర్యకుమార్ బౌండరీ లైన్ దగ్గర చక్కగా బ్యాలెన్స్ చేసుకుంటూ పట్టిన క్యాచ్ అత్యంత ముఖ్యమైంది. అయితే ఆ క్యాచ్ రివ్యూ సమయంలో తాము పడిన ఆందోళన అంతా ఇంతా కాదని అప్పటి కెప్టెన్ రోహిత్ తెలిపాడు. 'సూర్య క్యాచ్‌ను థర్డ్ అంపైర్ చెక్ చేస్తున్నప్పుడు మాకు గుండె ఆగినంత పనైంది. నిజానికి ఆ బంతి వెళ్లిన తీరుకు కచ్చితంగా బౌండరీ లైన్ దాటాల్సిందే. కానీ అప్పుడు వీచిన బలమైన గాలులకు బంతి కాస్త గ్రౌండ్‌లోకి వచ్చినట్టుంది. అలాగే థర్డ్ అంపైర్ నిర్ణయం చూసేందుకు కూడా నాకు ధైర్యం చాల్లేదు. అందుకే అవుటా? నాటౌటా? అనేది నువ్వే చూసి చెప్పు అని సూర్యతో అన్నా' అని రోహిత్ గుర్తుచేసుకున్నాడు. మరోవైపు సఫారీలకు 30 బంతుల్లో 30 రన్స్ కావాల్సిన వేళ పంత్ హఠాత్తుగా మోకాలి నొప్పంటూ సైగ చేయడంతో మ్యాచ్ కాసేపు ఆగింది. అయితే రోహిత్ మాత్రం పంత్‌ది నిజమైన నొప్పే అని భావించాడట. కానీ ప్రత్యర్థి లయను దెబ్బతీసేందుకు పంత్ పన్నిన వ్యూహమని తర్వాత తెలిసిందని రోహిత్ చెప్పాడు.

ఇంగ్లండ్ మహిళల జట్టుకు జరిమానా

నాటింగ్‌హామ్: భారత మహిళల జట్టుతో శనివారం జరిగిన తొలి టీ20లో స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్ జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. నిర్ణీత సమయం కంటే ఇంగ్లండ్ 2 ఓవర్లు వెనుకంజలో ఉంది.

ఆస్ట్రియన్ గ్రాండ్‌ప్రీ విజేత నోరిస్

స్పీల్‌బర్గ్ (ఆస్ట్రియా): మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ ఆస్ట్రియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములావన్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేసులో మెక్‌లారెన్‌కే చెందిన ఆస్కార్ పియాస్ట్రిని వెనక్కినెట్టి టాప్‌లో నిలిచాడు.

సిక్స్ కొట్టి.. కుప్పకూలి

క్రికెటర్ హఠాన్మరణం

ఫిరోజ్‌పూర్ (పంజాబ్): క్రికెట్ మ్యాచ్ ఆడుతూ గుండెపోటుతో ఆటగాడు మరణించిన విషాద ఘటన ఆదివారం ఇక్కడ చోటు చేసుకుంది. స్థానిక డీఏవీ స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో హర్జిత్ సింగ్ అనే ఆటగాడు సిక్సర్ కొట్టాడు. అనంతరం మరో ఎండ్‌లో ఉన్న బ్యాటర్‌తో మాట్లాడేందుకు పిచ్ మధ్యలోకి వెళ్లాడు. అక్కడ మోకాళ్లపై కొన్ని క్షణాలు కూర్చొని ఎడమవైపు ఒరిగిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకున్న హర్జిత్‌కు సీపీఆర్ చేసి రక్షించేందుకు సహచర క్రికెటర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హర్జిత్ గుండెపోటుతో మరణించినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు.

మరో 2, 3 మీడియా సంస్థల పని పడతాం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారని, వారి చేతుల్లోని ఆయుధాలతో వారు దాడులు చేస్తే.. లక్షలాది మంది కేసీఆర్ అభిమానులు తమ చేతుల్లోని ఆయుధాలకు పని చెబుతారని అన్నారు. 'మీడియా ముసుగులో దాక్కుందామనో, చంద్రబాబో, రేవంత్‌రెడ్డో కాపాడుతారనో అనుకుంటున్నారేమో! మీరు ఎక్కడ దాక్కున్నా బిన్ లాడెన్‌ను వెతికినట్లు వెతికి పట్టుకొని మీ పని చెబుతాం. ఎవరినీ వదిలిపెట్టబోం" అని జగదీశ్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు క్షమాగుణం ఎక్కువ అని, కానీ.. ఆయన క్షమించినా తాము వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఏ పోలీసులూ తమను ఆపలేరన్నారు. "మీరు ఎక్కడ బతుకుతున్నారో, ఎవరి తిండి తింటున్నారో గుర్తుంచుకోండి. మహాన్యూస్ యాజమాన్యం ఇప్పటికైనా కేసీఆర్‌కు, కేటీఆర్‌కు క్షమాపణ చెప్పి చెంపలు వేసుకోవాలి" అని సూచించారు. కాగా, కేటీఆర్‌పై మహాన్యూస్ చేసింది జర్నలిజం కాదని, వ్యక్తిత్వాలను హననం చేయడమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అన్నారు. అమాయకులైన మహిళల మానసిక, భావోద్వేగ, ప్రతిష్ఠలకు భంగం కలిగేలా మహాన్యూస్ యాజమాన్యం వ్యవహరించిందన్నారు. మరోవైపు.. మీడియా ముసుగులో పరిధులు దాటి ప్రవర్తిస్తే తాము కూడా పరిధులు దాటుతామని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. వ్యక్తిగత ఆరోపణలు చేయాలనుకుంటే జర్నలిజం వదిలి రాజకీయాల్లోకి రావాలని సవాల్ చేశారు. ఇదిలా ఉండగా.. కేటీఆర్‌పై యూట్యూబ్‌లో అసభ్యకర తంబ్ నెయిల్స్ పెడుతుంటే సైబర్ సెక్యూరిటీ సెల్ ఏం చేస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. సిట్‌ను నడుపుతున్నది పోలీసులా? లేక పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులా? అని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఎల్లో జర్నలిజం పేరుతో చంద్రబాబు శిష్యుడిగా బీఆర్ఎస్‌పై బురదజల్లుతున్నారని ఆరోపించారు.

"ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'ని టార్గెట్ చేయండి'

అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటున్న గిరి చెర్కుపల్లి అనే బీఆర్ఎస్ ఎన్నారై కార్యకర్త 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'పై నోరు పారేసుకున్నాడు. 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని టార్గెట్ చేయండి. రాడ్లు, రాళ్లు నేను స్పాన్సర్ చేస్తా' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశాడు. అయితే ఈ వ్యాఖ్యలకు నెటిజన్లు గట్టిగా బదులిచ్చారు. 'పార్టీ కార్యకర్త, అభిమాని అయితే గుడ్డిగా అనుసరించడం కాదు. వాస్తవాలు, అవాస్తవాలను తెలుసుకో' అంటూ అతడి పోస్టుకు కౌంటర్ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు దేశంలో ఇంతవరకు ఎక్కడా కనీవినీ ఎరుగని రీతిలో ఉందని కొందరు పేర్కొన్నారు. నిజాలు నమ్మడం ఇష్టంలేకే మీడియా సంస్థలపై భౌతిక దాడుల గురించి ప్రస్తావిస్తారని అన్నారు. గిరి చెర్కుపల్లిపై పోలీసులు కేసు నమోదు చేయాలని కొందరు కోరారు.



వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం అమ్మవారు కురుకుల్లా, భేరుండా అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.కురుకుల్లా మాత కాటుకలాంటి నల్లని చీకటి వర్ణంతో ఉండి సంసార సాగరమందు కొట్టుమిట్టాడుతున్న జీవులను అనుగ్రహిస్తుందని, భేరుండా మాత పాపాలను క్షమింప చేసి అనుగ్రహిస్తుందని అర్చకులు తెలిపారు.

- వరంగల్ కల్చరల్

సిర్పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు

- కుట్ర చేసి సస్పెండ్ చేయించారు
- మంత్రి సీతక్క ఒత్తిడితోనే సస్పెన్షన్: శ్రీనివాస్

కాగజ్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీనివాస్‌ను ఆరేళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదివారం ప్రకటించింది. శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేశారని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఇటీవల టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ(డీఏసీ)కి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఏసీ చైర్మన్ శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28లోపు వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. శ్రీనివాస్ నుంచి సరైన వివరణ రాకపోవడంతో పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. అయితే, తనపై కుట్ర చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేశారని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క పీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి తీసుకొచ్చి సస్పెండ్ చేయించారని ఆరోపించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సస్పెన్షన్ తనపై ఎటువంటి ప్రభావం చూపబోదని, తాను నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తిని అని చెప్పారు.

జైళ్లలో ఉండాల్సినవారు చట్టసభల్లో ఉంటున్నారు

- దేశంలో అత్యంత ప్రమాదకరమైన పార్టీ బీజేపీ
- టీవీ కార్యాలయాలపై దాడులు సరికాదు: కూనంనేని

నేలకొండపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో ఉండాల్సినవారు చట్టసభల్లో ఉంటున్నారని, చట్టసభల్లో ఉండాల్సిన వారు జైళ్లలో ఉంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మూటాపురంలో ఆదివారం జరిగిన సీపీఐ 17వ మండల మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దేశంలో అత్యంత ప్రమాదకరమైన పార్టీ బీజేపీ అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆ పార్టీ పాత్ర శూన్యమని చెప్పారు. తెలంగాణలో గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, అందువల్ల అభివృద్ధి, సంక్షేమం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌పై వార్తలు ప్రచురిస్తున్నందుకు పాత్రికేయులు, టీవీ కార్యాలయాలపై దాడులు చేయడం సరికాదన్నారు. కేటీఆర్‌పై కేసు వేస్తే రాష్ట్రం అల్లకల్లోలం కావాలని, శాంతి భద్రతలు ఉండకూడదని చూస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏవైనా లోపాలుంటే శాంతియుతంగా ఆందోళన చేయవచ్చని సూచించారు. రాష్ట్రంలో పాలన సజావుగానే సాగుతున్నా.. హామీలను అమలు చేయడంలో కొంత జాప్యం జరుగుతోందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపడానికి కేంద్రం ప్రయత్నం చేయడమంటే ప్రశ్నించే ప్రతి వ్యక్తిని, ప్రశ్నించే ప్రతి కమ్యూనిస్టును చంపుతున్నట్లేనని పేర్కొన్నారు. మావోయిస్టులు కూడా ఆలోచించి జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతున్నామని ఆయన అన్నారు.

ఆర్టీసీకి శ్రీవారి దర్శన కోటాను పునరుద్ధరించాలి: సజ్జనార్

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఆర్టీసీకి ఇచ్చే శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన కోటాను టీటీడీ పునరుద్ధరించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కోరారు. ఈ మేరకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కోరినట్లు చెప్పారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టూరిజం కోటా కింద కల్పించే ఈ సౌకర్యం ఇతర రాష్ట్రాల భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, గత డిసెంబరు నుంచి టీటీడీ ఈ కోటాను రద్దు చేసిందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని ప్రార్థించా: సిరిసిల్ల రాజయ్య

అలాగే రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని స్వామిని ప్రార్థించానన్నారు. ప్రతివ్యక్తికీ విద్యాబుద్ధులు కల్పించాలని కోరుకున్నట్లు చెప్పారు.

బీజేపీ రాష్ట్ర పగ్గాలు బీసీలకే ఇవ్వాలి: జాజుల

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ సారథిగా బీసీలకే అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆ పార్టీ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన బీజేపీ.. ఎన్నికల తరువాత శాసనసభ పక్ష నేతగా అగ్రకులాలకు చెందిన వ్యక్తికి అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటి వరకు అగ్రకులాల వారికే రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిందని, ఇప్పటికైనా బీసీలకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

విదేశాల్లోనూ తెలంగాణ జాగృతి శాఖలు

- అధ్యక్షులను నియమించిన కవిత

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రవాస తెలంగాణ బిడ్డల సంక్షేమానికి కృషి చేయాలనే ఉద్దేశంతో వివిధ దేశాల శాఖలకు నూతన అధ్యక్షులను ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసి, రాష్ట్ర సాధన అనంతరం తెలంగాణ అభ్యున్నతికి అంకితమైన సంస్థగా తెలంగాణ జాగృతి నిలిచిందని ఆదివారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యతలు అప్పగించిన వారు తెలంగాణ అభ్యున్నతికి, ఆయా దేశాలలో ఉన్న తెలంగాణ ప్రవాసీల సంక్షేమానికి, సాంస్కృతిక వికాసానికి కృషి చేయాలని సూచించారు. ఈ నియామకాలన్నీ వెంటనే అమలులోకి వస్తాయని తెలిపారు. త్వరలోనే ఆయా దేశాల్లో పూర్తి స్థాయి కమిటీలను ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు.

నియోజకవర్గానికి ఒక గురుకులాన్ని ఏర్పాటు చేయాలి: కృష్ణయ్య

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒక బీసీ గురుకుల పాఠశాల చొప్పున 119 గురుకులాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఉన్న గురుకులాలు పేద విద్యార్థులకు సరిపోవడం లేదని కొత్త బీసీ గురుకులాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాత గురుకులాలలో వసతి సౌకర్యం ఉన్న చోట 5-8 తరగతులలో అదనపు సెక్షన్లు ప్రారంభించి ఎక్కువ మందికి అడ్మిషన్లు కల్పించాలని ఆయన కోరారు.

మొబైల్ యాప్‌ల్లో ఇచ్చే ఫోన్ నంబర్లకు

సర్కారీ ధ్రువీకరణ తప్పనిసరి!

అందుకోసం ప్రత్యేకంగా ఒక ప్లాట్‌ఫామ్ ఏర్పాటు.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ ప్రతిపాదన

- గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం
- జస్టిస్ పుట్టస్వామి కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పునకు తీవ్ర విఘాతం కలుగుతుందని పలువురి ఆందోళన



న్యూఢిల్లీ, జూన్ 29: ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు.. టెలికమ్యూనికేషన్ విభాగం (డీవోటీ) కొత్త సైబర్ భద్రత నియమాలను ప్రతిపాదించింది. డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా వినియోగదారులు ఇచ్చే మొబైల్ నంబర్లు నిజంగా వారివేనా కాదా అనే విషయాన్ని యాప్‌లు, బ్యాంకులు ధ్రువీకరించుకునేందుకు.. ఒక ప్లాట్‌ఫామ్‌ను (నూతన ధ్రువీకరణ వ్యవస్థను) ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రచురించిన ముసాయిదాలో పేర్కొంది. సాధారణంగా మనం క్యాబ్ బుక్ చేసుకోవడానికో, ఆహారం ఆర్డర్ చేయడానికో, సరుకులు కొనుగోలు చేయడానికో రకరకాల యాప్‌లు వాడుతుంటాం. ఆ యాప్‌లను మన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నప్పుడు మన ఫోన్ నంబర్ ఇస్తాం. ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం ఆయా యాప్‌లు మనం ఇచ్చిన నంబర్‌కు ఓటీపీ (వన్‌టైమ్ పాస్‌వర్డ్) పంపుతాయి. దాన్ని మనం ఎంటర్ చేస్తే ఫోన్ నంబర్ ధ్రువీకరణ పూర్తవుతుంది. కానీ, టెలికం డిపార్ట్‌మెంట్ కొత్తగా చేసిన ప్రతిపాదన ప్రకారం ఇకపై యాప్‌లు, బ్యాంకులు సహా ఇతర డిజిటల్ వేదికలు ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటయ్యే వ్యవస్థ ద్వారానే వినియోగదారుల మొబైల్ నంబర్లను వైరిఫై (ఎంఎన్‌వీ) చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ సంస్థల యాప్‌లైతే ఈ ధ్రువీకరణను ఉచితంగా చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేసే ధ్రువీకరణ అయితే.. ఒక్కో ఫోన్ నంబర్ ధ్రువీకరణకూ రూపాయిన్నర, ప్రైవేటు సంస్థలు తమ కోసం చేసుకునే ధ్రువీకరణ అయితే ఒక్కో నంబర్‌కూ రూ.3 చొప్పున చెల్లించాలని ముసాయిదాలో ప్రతిపాదించారు. అయితే.. ప్రభుత్వ వ్యవస్థ ద్వారా మొబైల్ నంబర్ ధ్రువీకరణ తప్పనిసరి చేయాలన్న డీవోటీ ప్రతిపాదన పట్ల కొందరు నిపుణులు వ్యతిరేకత వెలిబుచ్చుతున్నారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ప్రజల వ్యక్తిగతగోప్యతకు భంగం వాటిల్లుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థలు నంబర్ల ధ్రువీకరణతోనే ఆగుతాయా? లేక వినియోగదారుల ఇతర వివరాలు కూడా సేకరిస్తాయా? ఒకవేళ సేకరిస్తే ఏయే వివరాలు?.. అనే సందేహాలకు ఇప్పటిదాకా స్పష్టమైన సమాధానం లేదని వారు గుర్తుచేస్తున్నారు. అంతేకాదు.. ఎంఎన్‌వీ చార్జీల పేరిట వినియోగదారులపై అదనపు భారం పడుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక.. ఈ ప్రతిపాదనను అమలు చేయాలంటే పౌరుల ఫోన్ నంబర్లతో కూడిన డేటాబేస్‌ను నిర్వహించాల్సి ఉంటుందని (డేటా సెంట్రలైజేషన్).. అంతేకాక, ఈ నిర్ణయం వ్యక్తిగత గోప్యతకు సంబంధించి జస్టిస్ పుట్టస్వామి కేసులో సుప్రీం కోర్టు పేర్కొన్న 'ప్రపోర్షనాలిటీ' (చిన్న ప్రయోజనాల కోసం పెద్ద హక్కులకు భంగం వాటిల్లడం) నిబంధనకు విఘాతం కలిగించేలా ఉందని 'ద డైలాగ్' అనే టెక్ పాలసీ థింక్ ట్యాంక్ వ్యవస్థాపకుడు కాజిమ్ రిజ్వీ ఆందోళన వెలిబుచ్చారు. డీవోటీ ప్రతిపాదిస్తున్న ఎంఎన్‌వీ ఇందుకు సరైన ఉదాహరణ. ప్రైవేటు సంస్థల కోసం ఆధార్ వెరిఫికేషన్‌ను ఉపయోగించడం చిన్న ప్రయోజనమైతే.. దానివల్ల పౌరుల వ్యక్తిగత గోప్యత అనే పెద్ద హక్కుకు విఘాతం కలుగుతుందని.. ఇది సుప్రీం తీర్పుకు విరుద్ధమేనని కాజిమ్ రిజ్వీ వంటివారి వాదన. అంతేకాదు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పాన్ కార్డు పొందేందుకు, ఐటీ రిటర్నుల సమర్పణకు మాత్రమే ఆధార్ తప్పనిసరి అని.. ప్రైవేటు సంస్థలకు 'ఆధార్ ఆధారిత సేవలు అందించడం చట్టబద్ధం కాదని సుప్రీం కోర్టు అప్పట్లో తన తీర్పులో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఇదీ నేపథ్యం..

భారత్‌లో 116 కోట్లకు పైగా మొబైల్ కనెక్షన్లున్నాయి. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా కూడా ఉంది. ఈ నేపథ్యంలో మొబైల్ ఆధారిత మోసాలకు సైబర్ నేరగాళ్లకు ఇండియా టార్గెట్‌గా ఉంది. దొంగిలించిన లేదా పోగొట్టుకున్న సిమ్ కార్డుల ద్వారా కాల్స్ చేసి వ్యక్తిగత సమాచారాలు రాబట్టడం, డిజిటల్ అరెస్టుల వంటివి జరుగుతున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2022తో పోలిస్తే 2024 నాటికి డిజిటల్ అరెస్టులు, ఇతర సైబర్ మోసాల సంఖ్య మూడింతలు పెరిగింది. ప్రజలు పోగొట్టుకున్న సొమ్ము 2022తో పోలిస్తే 2024 నాటికి 21 రెట్లు ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలోనే డీవోటీ ఈ ప్రతిపాదన చేసింది. అలాగే.. వినియోగంలో ఉన్న ఐఎంఈఐ నంబర్లను కొత్త డివైజ్‌లకు ఉపయోగించకుండా తయారీదారులు చూసుకోవాల్సి ఉంటుందని డీవోటీ తన ముసాయిదాలో పేర్కొంది. ట్యాంపర్ లేదా బ్లాక్‌లిస్టు చేసిన ఐఎంఈఐల డేటాబేస్‌ను ప్రభుత్వం నిర్వహిస్తుంది. సెకండ్ హ్యాండ్ ఫోన్ అమ్మకందారులు సేల్‌కు ముందు ఒక ఐఎంఈఐ చెకింగ్‌కు రూ.10 చెల్లించి ఈ డేటాబేస్‌ను పరిశీలించుకోవాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో 4 వెడ్డింగ్ డెస్టినేషన్లు !

- అభివృద్ధి చేయనున్న పర్యాటక శాఖ
- నిజాంసాగర్, నాగార్జునసాగర్, బస్వాపూర్, సోమశిల ప్రాంతాల్లో..

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలు, ఆధునిక వసతులు, అలంకరణల మధ్య రాచఠీవీతో అద్భుతమైన మధుర జ్ఞాపకాలను మూటగట్టే డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దేశంలో ఆదరణ పెరుగుతోంది. రాష్ట్రంలోని సంపన్నులు తమ కుటుంబంలో ఇలాంటి వివాహ వేడుకల కోసం రాజస్థాన్, జైపూర్, గోవా, కేరళ తదితర ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఇందుకు కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నారు. ఇక నుంచి వారు దూర ప్రాంతాలకు వెళ్లి అనవసర వ్యయప్రయాసలు పడకుండా రాష్ట్రంలోనే తమ అభిరుచికి అనుగుణంగా, అత్యంత ఆర్భాటంగా పెళ్లిళ్లు, పేరంటాలు, విందులు, వినోదాల వేడుకలు నిర్వహించుకునే అవకాశాన్ని పర్యాటక శాఖ కల్పించబోతోంది. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో అలాంటి వెడ్డింగ్ డెస్టినేషన్‌లను అభివృద్ధి చేసేందుకు సమాయత్తమవుతోంది. ఆధునిక విలాసాలు, ప్రపంచశ్రేణి ప్రమాణాలతో వీటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పర్యాటక పాలసీ మేరకు హైదరాబాద్ నుంచి రాకపోకలకు సులువుగా ఉన్న ఆహ్లాదకరమైన ప్రాంతాల్లో వెడ్డింగ్ డెస్టినేషన్‌లను ఏర్పాటు చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సభలు, సమావేశాలు, చర్చాగోష్ఠులు, వర్క్‌షాప్‌లు నిర్వహించే అవకాశాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు పలు ప్రాంతాలను పరిశీలించారు. ప్రాథమికంగా కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్, యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపూర్, నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బుద్ధవనం ప్రాజెక్టు సమీపాన, నాగర్ కర్నూల్ జిల్లాలోని కృష్ణా-తుంగభద్ర నదీతీరమైన సోమశిల ప్రాంతాల్లో ఈ వెడ్డింగ్ డెస్టినేషన్‌ల అభివృద్ధి కోసం అవసరమైన స్థలాలను గుర్తించారు. ఐదేళ్లలో పర్యాటక రంగంలో సుమారు రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే ప్రధాన లక్ష్యంతో రూపొందించిన ప్రతిపాదనల్లో వెడ్డింగ్ డెస్టినేషన్‌ల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించనున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై విచారణకు ఆదేశించరెందుకు?

- కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంగా రేవంత్ సర్కార్ అని మీరే అంటారు..
- కేంద్ర దర్యాప్తు సంస్థలు మీ వద్దే ఉన్నాయి
- షా ఎందుకు స్పందించరు?: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని రేవంత్ సర్కారు.. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంగా మారిందని ఆరోపించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ అంశంపై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ,ఈడీతో అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వంపై విచారణ జరపడానికి కేంద్రానికి ఏం అడ్డువస్తుందో తెలంగాణ ప్రజలకు వివరించాలని అని కేటీఆర్ అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీ కుస్తీ, తెలంగాణలో మాత్రం దోస్తీ అన్నట్లుగా సాగుతున్న కుమ్మక్కు రాజకీయాల వల్లే రేవంత్‌ను వెనకేసుకుని వస్తున్నారనే ఆరోపణలకు సమాధానం ఉందా అని ఆదివారం ఆయన ఎక్స్‌లో ప్రశ్నించారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక, రేవంత్‌ను బీజేపీ పావుగా వాడుకుంటున్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు. గతంలో ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చినపుడు రేవంత్, రాహుల్‌ను కలిపి ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట దోచుకుంటున్నారని ఆరోపించారని, కానీ, నేటి వరకు ఈ అంశంపై ఎందుకు దర్యాప్తుకు ఆదేశించలేదని ప్రశ్నించారు. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా, ఒక్క ఐఐటీ, ఐఐఎం, మెడికల్ కాలేజీలు లాంటి ఉన్నత విద్యాసంస్థలు మంజూరు చేయకుండా బీజేపీ చేస్తున్న అన్యాయాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు పైసా కేటాయించకుండా పేరుకు మాత్రం పసుపు బోర్డు పెట్టి రిబ్బన్ కత్తిరిస్తే ప్రయోజనమేమిటని, కనీసం సొంత భవనం కూడా లేకుండా కేసీఆర్ హయాంలోని క్యాంపు కార్యాలయంలో పసుపు బోర్డు ఆఫీసును ప్రారంభించడం సమంజసమా అని ప్రశ్నించారు. ఏపీలోని టీడీపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్లకు నదుల అనుసంధానం ముసుగులో కేంద్రం బంగారు బాటలు వేయడం గోదావరిపై తెలంగాణ రైతుల హక్కులు కాలరాయడం కాదా అని కేటీఆర్ నిలదీశారు.

కమలం కొత్త సారథి రాంచందర్‌రావు?

(మొదటిపేజీ తరువాయి)



అధికారంలోకి వస్తే బీసీనే సీఎం చేస్తామని పార్టీ నాయకత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడిగా మరో సామాజిక వర్గం నేత ఉండాలన్న అభిప్రాయం తాజాగా తెరపైకి వచ్చింది. దీంతో, రాంచందర్‌రావు వైపు పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తుది జాబితాలో ఈటల, రాంచందర్‌రావు పేర్లు మాత్రమే పరిశీలనలో ఉన్నాయని.. చివరి నిమిషంలో ఏవైనా సమీకరణాలు మారితే తప్ప రాంచందర్‌రావుకే అధ్యక్ష పీఠం ఖాయమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చినా.. తుది జాబితాలో వారి పేర్లు లేవని వివరించాయి. కాగా, బీజేపీ రాష్ట్ర శాఖ కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం కావాలనే కోరుకుంటున్నానని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారని, మంగళవారం అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని చెప్పారు. నామినేషన్ ఒకటే దాఖలయ్యే అవకాశం ఉందా..? అన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. చూద్దాం.. ఏమవుతుందో అని అన్నారు.

అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ జారీ..

బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ఆదివారం నోటిఫికేషన్ జారీ అయింది. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉపసంహరణ ఉంటుందని చెప్పారు. కాగా, అధ్యక్ష ఎన్నికకు సంబంధించి బీజేపీ సంస్థాగత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ ఆదివారం పార్టీ సీనియర్ నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

వీఐపీ ప్రెసిడెంట్ వద్దు: రాజాసింగ్

బీజేపీకి వీఐపీ ప్రెసిడెంట్ వద్దని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. అన్నా అని కార్యకర్తలు ఆత్మీయంగా పిలుచుకునే నేత అధ్యక్షుడిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యకర్తల ఒత్తిడి మేరకు తాను కూడా అధ్యక్ష పదవికి పోటీ చేయాలనుకుంటున్నానని తెలిపారు. తాను అధ్యక్షుడిని కాకుండా చూసేందుకు పార్టీలో ఒక బృందం ఉందని అన్నారు. తాను అధ్యక్షుడినైతే పార్టీలో గో రక్షణ విభాగాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే యూపీ సీఎం యోగి తరహా పాలన ఉంటుందన్నారు.

ఇతర రాష్ట్రాలకూ కొత్త అధ్యక్షులు..

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ వేగం పుంజుకుంది. వారం పది రోజుల్లో దాదాపు 10 రాష్ట్రాల్లో కొత్త అధ్యక్షులను ఎన్నుకునేందుకు అధినాయకత్వం కసరత్తులు చేస్తోంది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, త్రిపుర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అధ్యక్షులు రానున్నారు. ఇందులో కొన్ని రాష్ట్రాల్లో అధ్యక్ష ఎన్నికకు ఇప్పటికే నోటిఫికేషన్ రాగా, మరికొన్నింటికి రేపో మాపో ప్రకటన వెలువడనుంది. ఈ ఏడాది చివరిలో బిహార్, వచ్చే ఏడాది బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో అధ్యక్ష ఎన్నికను పూర్తి చేయాలని అధినాయకత్వం నిర్ణయానికి వచ్చిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పెండింగ్ రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలను వారం లోపు పూర్తి చేయాలని బీజేపీ నాయకత్వం ఆదేశించిందని ఆ పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు. ఏపీలో బీజేపీ అధ్యక్ష పదవి రేసులో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పీవీఎన్ మాధవ్, సుజనాచౌదరి, విష్ణువర్ధన్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రస్తుత అధ్యక్షురాలు పురందేశ్వరిని కొనసాగిస్తారనే చర్చ కూడా జరుగుతోంది.

నడ్డా తర్వాత ఎవరు?

బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం 2023 జనవరిలో ముగిసినప్పటికీ లోక్‌సభ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పొడిగిస్తూ వస్తున్నారు. బీజేపీ నియమావళి ప్రకారం సగానికిపైగా రాష్ట్ర అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించిన తర్వాత జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవచ్చు. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా 37 యూనిట్లలో 14 రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులను నియమించింది. 19 రాష్ట్రాల పార్టీ చీఫ్‌లను ఎన్నుకున్న తర్వాత జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. జూలై రెండో వారంలో విదేశీ పర్యటనల నుంచి ప్రధాని మోదీ తిరిగొచ్చాక కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆర్ఎస్ఎస్‌తో ఏకాభిప్రాయం కుదరకపోవడం వల్లే ఎంపిక ఆలస్యమైందని పార్టీలోని ఒక వర్గం చెబుతుండగా.. వయస్సు, ప్రాంతం వంటి అంశాలతో పాటు బిహార్ ఎన్నికలకు సంబంధించిన లెక్కలు కూడా దీనికి కారణమని మరో వర్గం అంటోంది. అధ్యక్ష పదవికి వినిపిస్తున్న పేర్లలో ఎక్కువ కేంద్ర మంత్రులవే కావడంతో, మోదీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కూడా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

మెడికోలకు 'ఉపకారం'

15% స్టైపెండ్ పెంపు.. జీవో జారీ

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనాన్ని 15శాతం మేర పెంచుతూ రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. అలాగే వైద్య, దంత హౌజ్‌సర్జన్స్‌తో పాటు, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాన్ని రూ.92,575 నుంచి రూ.1,06461కి పెంచారు. ఈ మేరకు ఆదివారం జీవో జారీ చేశారు. జీవోలోని వివరాల ప్రకారం.. ఇంటర్న్‌లకు ప్రస్తుతం నెలకు రూ. 25,906 ఉపకార వేతనం ఇస్తుండగా దాన్ని రూ.29,792కు పెంచారు. పీజీ డాక్టర్లకు ప్రథమ సంవత్సరంలో ఇస్తున్న రూ. 58,289 మొత్తాన్ని రూ.67,032కు, ద్వితీయ సంవత్సరంలో ఇస్తున్న రూ.61,528 మొత్తాన్ని రూ.70,757కు, ఫైనల్ ఇయర్‌లో ఇస్తున్న రూ.64,767 మొత్తాన్ని రూ.74,782కు పెంచారు. సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు మొదటి ఏడాదిలో రూ. 92,575 ఇస్తుండగా, దాన్ని రూ.1,06,461కు, సెకండ్ ఇయర్‌లో రూ. 97,204 ఇస్తుండగా దాన్ని రూ.1,11,785కు, థర్డ్ ఇయర్‌లో రూ. 101824 ఇస్తుండగా, దాన్ని 1,17,103కు పెంచారు. సీనియర్ రెసిడెంట్లకు డాక్టర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.92,575 నుంచి రూ.1,06,461 పెంచారు. స్టైపెండ్ పెంపుపై జూడాలు హర్షం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరను ఆయన నివాసంలో కలసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తాము తలపెట్టిన సమ్మెను ఉపసంహరించుకుంటున్నట్లు ఓ ప్రకటనలో జూడాలు తెలిపారు. కాగా వైద్య విద్యార్థులకు స్టైపెండ్‌ను ప్రతినెలా 10వ తేదీలోగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. ఈ మేరకు ఏడాదికి సరిపడా స్టైయిపెండ్ చెల్లించేందుకు అవసరమైన బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను అధికారులు విడుదల చేశారు. మెడికోలకు ఇప్పటివరకు ఉన్న బకాయిలను కూడా విడుదల చేశారు. కాగా దక్షిణాదిన అత్యధిక స్టైఫండ్ చెల్లిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వైద్య ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

జూలై మొదటివారంలో ఎంసీఎంసీ నివేదిక

ప్రభుత్వ వైద్య కళాశాలపై తనిఖీల కోసం సర్కారు నియమించిన మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) బృందాలు ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల్లోనూ పర్యటించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 29 వరకు తనిఖీలు ముగించి 30న నివేదికలివ్వాలి. తనిఖీలు చేయాల్సిన కాలేజీలు ఇంకొన్ని మిగిలిపోయినట్లు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. దాంతో జూలై మొదటివారంలో తనిఖీలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికివ్వనున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

మెట్రో డీపీఆర్ ఇచ్చింది గత వారమే

- రెండోదశ మెట్రోపై.. సీఎం రేవంత్‌వి అవగాహనారాహిత్య వ్యాఖ్యలు
- సమస్యలను పరిష్కరించకుండా.. కేంద్రం ఆమోదించడం లేదని చెప్పడం దురదృష్టకరం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం గత వారమే కేంద్రానికి మెట్రో రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) ఇచ్చిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మెట్రో డీపీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటరిచ్చారు. "మెట్రో రెండోదశకు కేంద్రం ఆమోదం తెలపలేదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కొంతమంది మంత్రులు అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్నారు. వారి వ్యాఖ్యలు దురదృష్టకరం. సీఎం రేవంత్ ఔనన్నా.. కాదన్నా.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ కోసమో.. రేవంత్‌రెడ్డి కోసమో పనిచేయం. తెలంగాణ ప్రజల కోసమే పనిచేస్తాం" అని వ్యాఖ్యానించారు. కేంద్రానికి గత వారమే మెట్రో డీపీఆర్ అందిందని, మెట్రోను నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీతో రెండో దశకు సంబంధించిన ఎంవోయూ ఎలాంటిది? అనే వివరాలపై చర్చించాల్సి ఉందన్నారు. దీంతోపాటు.. ఎన్ని రైళ్లను ప్రారంభిస్తారు? రైల్వే నెట్‌వర్క్ నిర్వహణ బాధ్యత ఎవరిది? ఖర్చులను ఎవరు భరిస్తారు? అనే అంశాలపై చర్చ జరగాల్సి ఉందని గుర్తుచేశారు. "సీఎం రేవంత్, గత వారం ఢిల్లీకి వచ్చినప్పుడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఇవే అంశాలను అడిగారు. వీటిని, రెండో దశ మెట్రో సమస్యలను పరిష్కరించకుండా.. కేంద్రం ఆమోదించడం లేదని సీఎం రేవంత్ విమర్శలు చేయడం దురదృష్టకరం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

చెల్లికి పెళ్లి జరగాలి మళ్లీ మళ్లీ..
అనేలా అమిత్‌షా తీరు: ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌లో జరిగిన పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి అమిత్ షా తీరు చూస్తుంటే, 'మా చెల్లికి పెళ్లి జరగాలి మళ్లీ మళ్లీ' అన్న చందంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇంతకుముందే ఉన్న తాత్కాలిక కార్యాలయాన్ని వేరే కిరాయి బిల్డింగ్‌కు మార్చి అమిత్‌షాతో ప్రారంభోత్సవం చేయించారని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. పసుపు రైతులకు కావాల్సింది తాత్కాలిక ఆఫీసులు, రెండు సార్లు ప్రారంభోత్సవాలు కాదన్నారు. దేశంలో 70% పసుపు తెలంగాణలోనే పండుతుందని, నాలుగు దశాబ్దాలుగా పసుపు పంటకు మద్దతు ధర కోసం, బోర్డు కోసం పోరాటాలు చేస్తున్నారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కల్వకుంట్ల కవిత, తాము ప్రయత్నం చేసినా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సహకరించలేదన్నారు.

డీఎస్.. జీవితాంతం లౌకిక వాది

- ఆర్ఎస్ఎస్ వాదితో విగ్రహావిష్కరణ చేసినందుకు.. ఆయన ఆత్మ క్షోభిస్తుంది!: మహేశ్‌కుమార్‌గౌడ్

జీవితాంతం కాంగ్రెస్ వాది, సెక్యులరిస్టుగా ఉన్న పీసీసీ మాజీ చీఫ్ డి.శ్రీనివాస్ (డీఎస్) విగ్రహాన్ని.. బీజేపీ నేత.. ఆర్ఎస్ఎస్ వాదితో ఆవిష్కరింప చేసినందుకు ఆయన ఆత్మ క్షోభిస్తుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను ఆయన ఒప్పుకొనేవాడు కాదన్నారు. నిజామాబాద్‌లో డీఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం ఇచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, కానీ.. ఆ విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ నేతలెవరికీ ఆహ్వానం అందలేదని అన్నారు. డీఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేత వి.హనుమంతరావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. తనకు రాజకీయంగా ఓనమాలు నేర్పిందే డీఎస్ అని స్మరించుకున్నారు. కొడుకుల కారణంగా తండ్రి ఆత్మ క్షోభించే పరిస్థితి వచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

4న ఎల్బీ స్టేడియంలో ఖర్గే సభ : మహేశ్ గౌడ్

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొనే కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుల సమావేశాన్ని జూలై 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 వేల మందికి పైగా గ్రామ కమిటీల అధ్యక్షులు హాజరవుతారని చెప్పారు. సభ సాయంత్రం జరగనుండగా.. ఉదయం టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, టీపీసీసీ విస్తృత సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. జై బాపూ, జై సంవిధాన్ కార్యక్రమాల్లో భాగంగానే ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళి వివాదంపై స్పందిస్తూ.. ఓపిక, సహనం, అనుభవం ఉన్న నాయకుడు క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా ఉన్నారని, అన్ని సమస్యలకు కమిటీ పరిష్కారం చూపుతుందని చెప్పారు.

ఉద్యోగులను రెచ్చగొడుతున్న ప్రతిపక్షం: పొన్నం

ప్రభుత్వ ఉద్యోగులను ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, కానీ వారు ప్రజా సంక్షేమం కోసం విజ్ఞతతో వ్యవహరిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనుగుణంగా నడుస్తోందన్నారు. ఢిల్లీలో బీజేపీతో దోస్తీ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం చేసిందని ప్రశ్నించారు. బాధ్యతారహితంగా వ్యవహరించినందునే ఆ పార్టీకి ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారని, అలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో కనుమరుగూ చేస్తారని విమర్శించారు.

టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు
లోక్‌సభ నియోజకవర్గాల బాధ్యతలు

కొత్తగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జి బాధ్యతలను కేటాయిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలకు గాను ఒక్కో నియోజకవర్గానికి ఒక ఉపాధ్యక్షుడు, ముగ్గురు ప్రధాన కార్యదర్శుల చొప్పున ఇన్‌చార్జులుగా నియమించారు. మిగిలిపోయిన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు టీపీసీసీ సమన్వయం బాధ్యతలు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల ఇన్‌చార్జి బాధ్యతలను కేటాయించారు.

గత ఎన్నికల్లో 70 కోట్లు ఖర్చు పెట్టా

- నాకు 500 ఎకరాల భూమి ఉంది
- ఎన్నికల కోసం 16 ఎకరాలు అమ్మాను
- నాకు ఉన్నత వర్గాలతోనే పోటీ: కొండా మురళి



వరంగల్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు ముదురుతోంది. మంత్రి కొండా సురేఖ దంపతులు ఒకవైపు.. మిగతా పార్టీ ఎమ్మెల్యేలు మరోవైపు.. పరస్పర వ్యాఖ్యలతో రాజకీయం మరింత వేడెక్కుతోంది. గత ఎన్నికల్లో తాము రూ. 70 కోట్లు ఖర్చు పెట్టామని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చెప్పారు. ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాను ఎవరి దగ్గర డబ్బులు తీసుకోనని, తనకు 500 ఎకరాల భూమి ఉందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల కోసం 16 ఎకరాలు అమ్మానని తెలిపారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్నత వర్గాలతోనే పోటీపడ్డానని చెప్పారు. మొత్తానికి వరంగల్ కాంగ్రెస్ రాజకీయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.








రైతు సమ్మేళనంలో పాల్గొన్న రైతులు, నిజామాబాద్‌లోని బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అమిత్ షా, పసుపు బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పసుపు స్టాల్‌ను పరిశీలిస్తున్న అమిత్ షా

బీఆర్ఎస్ పోయినా అవినీతి పోలేదు

(మొదటిపేజీ తరువాయి)



నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసిన అర్వింద్ పసుపు బోర్డు కోసం హామీ ఇచ్చారని, ఆ హామీని ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు. మోదీ ఏదైనా చెప్పారంటే చేసి చూపిస్తారని తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటుతో.. నిజామాబాద్ రైతుల 40 ఏళ్ల పోరాటం ఫలించిందని, వారి కల నెరవేరిందని పేర్కొన్నారు. ఇకపై ఇక్కడి రైతులు పండించే పసుపు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతుందన్నారు. ఇందుకోసం మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్ వ్యవస్థలను ఏర్పాటు చేసి పసుపును ఎగుమతి చేస్తామన్నారు. ఇప్పటికే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, వియత్నాంతోపాటు ఇతర దేశాలకూ పసుపు ఎగుమతి అవుతోందని తెలిపారు. భారత్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా యూరప్ దేశాలకు ఎక్కువగా ఈ ఎగుమతి కొనసాగుతోందని ఆయన వెల్లడించారు.

పసుపు పంటకు రాజధాని ఇందూరు..

పసుపు పంటకు ఇందూరు రాజధాని లాంటిదని అమిత్‌షా అన్నారు. 2030వ సంవత్సరం వరకు బిలియన్ డాలర్ల విలువైన పసుపును ఎగుమతి చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ బోర్డు ద్వారా రైతులకు నూతన సాగు పద్ధతులపై శిక్షణ ఇస్తామని, ఇక్కడి పసుపు పంటకు జియో ట్యాగింగ్ కూడా చేస్తున్నామని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా మోదీ సర్కారు పనిచేస్తోందని, దాంతోపాటు పరిశ్రమలను తీసుకొచ్చేందుకూ కృషి చేస్తోందన్నారు. రైతుల కోసం రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు చేస్తున్నామని ఆయన వివరించారు.

నక్సలైట్లతో చర్చలు ఉండవు..

నక్సలైట్లు తక్షణమే హింసను వీడి లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలోకి రావాలని అమిత్‌షా పిలుపునిచ్చారు. ఆదివాసీలు, ఇతర వర్గాలపై నక్సల్స్ హత్యాకాండకు పాల్పడుతున్నారని, ఆయుధాలు వదిలేసేంత వరకూ వారితో చర్చలు ఉండబోవని స్పష్టం చేశారు. లొంగిపోతే పునరావాసం కల్పిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని వెల్లడించారు. 2026 మార్చి లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని ప్రకటించారు. నక్సలైట్లకు మద్దతుగా మాట్లాడేవారు బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకోవాలని హితవు పలికారు. గిరిజన బిడ్డలను, పోలీసులను చంపినప్పుడు వారి తరఫున ఎవరూ మాట్లాడలేదని, కానీ.. ఇప్పుడు చర్చల కోసం చాలా మంది పిలుపునిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను నక్సలైట్ల అడ్డాగా మార్చవద్దని సూచించారు. 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పామని అమిత్‌షా తెలిపారు. అయితే పాకిస్థాన్ మాట.. రాహుల్‌గాంధీ నోట వినిపిస్తోందని విమర్శించారు.

తెలంగాణలో బీజేపీకి అధికారం ఖాయం..

తెలంగాణలో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని అమిత్‌షా అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉంటేనే.. అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఆదివాసీలు, మహిళలు, దళితులు, ఈబీసీలు, రైతుల అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాగా, రైతును రారాజును చేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. పసుపు బోర్డు సాధించుకున్న ఇందూరు రైతులను హీరోలుగా అభివర్ణించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఇందూరు రైతుల పోరాట ఫలితంగానే పసుపు బోర్డు ఏర్పాటయిందన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేశ్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను కలిసేందుకు రేవంత్ ప్రయత్నం.. విఫలం

హైదరాబాద్/బేగంపేట: నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించారు. అమిత్‌షాను కలిసి.. అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కోరతానని శనివారమే సీఎం ప్రకటించారు. ఆ మేరకే మెట్రో విస్తరణ, రీజనల్ రింగు రోడ్డు నిర్మాణం, మూసీనది అభివృద్ధి తదితర ప్రాజెక్టులకు నిధులు, అనుమతులు కోరుతూ వినతి పత్రాలనూ రేవంత్ సిద్ధం చేసుకున్నారు. కానీ, ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌కు వచ్చిన అమిత్‌షా.. హెలికాప్టర్‌లో నేరుగా నిజామాబాద్‌కు వెళ్లారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత.. ఢిల్లీలో అత్యవసర పని ఉందంటూ ఇక్కడ కార్యక్రమాలను రద్దు చేసుకుని వెళ్లిపోయారు. దీంతో ఆయనను కలిసే అవకాశం సీఎంకు రాలేదు. అయితే అమిత్‌షా టైట్ షెడ్యూల్ వల్ల సీఎంను కలవడం కుదరలేదా? లేక సీఎంను కలిసే ఉద్దేశం లేనందునే హడావుడిగా వెళ్లిపోయారా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఇదిలా ఉండగా.. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అమిత్‌షాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు విశ్వేశ్వరరెడ్డి, డీకే అరుణ, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు స్వాగతం పలికారు. కాగా, అమిత్‌షా నిజామాబాద్ పర్యటన సందర్భంగా పలువురు వామపక్షాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

పసుపు బోర్డుతో.. దేశవ్యాప్తంగా రైతులకు సేవలు

- పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం
- పసుపు సాగులో రైతులకు అధునాతన శిక్షణ
- రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు

నిజామాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు దేశవ్యాప్తంగా ఉన్న పసుపు రైతులకు సేవలందించనుంది. దేశంలోని 24 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో పసుపు ఉత్పత్తి అవుతోంది. ప్రధానంగా మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిసా, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో రైతులు పసుపు పండిస్తున్నారు. గతంలో స్పైసెస్ బోర్డు కింద ఈ పసుపు రైతులకు సేవలందేవి. ప్రస్తుతం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు కార్యాలయం ద్వారా వీరికి సేవలందనున్నాయి. ఈ రైతులకు సంబంధించిన పంటల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతోపాటు అధునాతన శిక్షణను బోర్డు ద్వారా అందించనున్నారు. పసుపు ఎగుమతులకు కావాల్సిన మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా బోర్డు ద్వారా కల్పించనున్నారు. పసుపు రైతులతో కలిపి రైతు ఉత్పత్తిదారుల సంఘాలనూ ఏర్పాటు చేయనున్నారు. ఈ సంఘాలతో పాటు బోర్డు ద్వారా పసుపు ఆధారిత పరిశ్రమలు కూడా ఏర్పాటు చేసేందుకు తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నారు. కాగా, జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన పసుపు స్టాళ్లను పరిశీలించారు. అమిత్‌షా వెంట పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అర్వింద్, కె.లక్ష్మణ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క తదితరులు ఉన్నారు.

డీఎంఈలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పదవీకాలం
ఏడాది పొడిగింపు

- 16,448 మంది సిబ్బంది కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య సంచాలకుల (డీఎంఈ) పరిధిలోని 16,448 కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి నాటికే ఈ పోస్టుల కాలపరిమితి ముగిసింది. అయితే, కొత్త కాలేజీలు ఏర్పాటైన నేపథ్యంలో వీటిని కొనసాగించాలని వైద్యవిద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్ర కుమార్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. దాంతో వచ్చే ఏడాది మార్చి 31 వరకు వీటిని కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ పోస్టుల్లో 4772 కాంట్రాక్టు, 8615 పోస్టులు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో, మరో 3056 పోస్టులు గౌరవ వేతనంతో, ఇంకో ఐదు పోస్టులు ఎంటీఎస్ (మల్టీ టాస్కింగ్ స్టాఫ్) బేస్‌లో ఉన్నట్లు ఆ ఉత్తర్వులో వివరించింది. కాగా, రెగ్యులర్ పోస్టులు భర్తీ అయ్యేలోపు లేదా అవసరం ఉన్నంత మేరకే వీరంతా కొనసాగుతారని పేర్కొంది.

ఏపీలో కలిపిన గ్రామాలను తిరిగి
తెలంగాణలో విలీనం చేయాలి

పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలి.. కేంద్రమంత్రి అమిత్‌షాకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్/ఖమ్మం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన భద్రాచలం చుట్టుపక్కల ఉన్న యాటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన అమిత్‌షాను తుమ్మల కలిశారు. పసుపుబోర్డు కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న పలుఅంశాలను అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. భద్రాచలం పట్టణం తెలంగాణలో కొనసాగుతుండగా, ఆ నాలుగు గ్రామ పంచాయతీలు, 17 రెవెన్యూ గ్రామాలను ఏపీలో కలపటంతో పరిపాలన, అభివృద్ధికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. భద్రాచలం పట్టణం, తెలంగాణలోని ప్రధాన మండలాల మధ్య రవాణా అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. భద్రాచలంలోని విద్యాసంస్థల్లో చదివే గిరిజన విద్యార్థులకు రాకపోకల్లో, రెండు రాష్ట్రాల చెక్‌పోస్టుల వల్ల గిరిజనులు, వాణిజ్య వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు.శాంతిభద్రతల సమస్యలు కూడా ఏర్పడుతున్నాయని, భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం నిర్వహణకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని, దేవస్థానం భూములు ఏపీ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు, ఆ గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడం అత్యవసరమని కేంద్ర మంత్రికి అందించిన లేఖలో పేర్కొన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించినందుకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వ తరఫున మంత్రి తుమ్మల కృతజతలు తెలిపారు. పసుపు పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, మార్క్‌ఫెడ్, నాఫెడ్ సంస్థల ద్వారా నేరుగా కొనుగోళ్లను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విన్నవించారు.



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి తుమ్మల, చిత్రంలో మంత్రి సీతక్క, పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ

రండి.. తెలంగాణలో ఆవిష్కరించండి!

'మేకిన్ ఇండియా' కాదు.. 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' .. ఇదే మా నినాదం.. ప్రణాళికాబద్ధంగా అడుగులు

- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రంగా జోన్లు
- జాతీయ సగటుకు 6 రెట్లు రాష్ట్ర సీఏజీఆర్
- పరిశ్రమలు పోతున్నాయని కొందరు విషప్రచారం చేస్తున్నారు
- 3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం
- ఐఐటీఈఎక్స్ ముగింపు వేడుకల్లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



పారిశ్రామికవేత్తలకు పురస్కారాలు అందిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): 'మేకిన్ ఇండియా' (భారత్‌లో తయారీ) కాదు.. 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' (తెలంగాణలో ఆవిష్కరించండి) అన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ నినాదం, లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణను 'ఇన్నోవేషన్ హబ్'గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆదివారం హైటెక్స్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ ఆప్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో (ఐఐటీఈఎక్స్)- 2025' ముగింపు వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) కంపౌండ్ మంత్లీ గ్రోత్ రేటు(సీఎంజీఆర్) 2.9 శాతంగా ఉండగా, జాతీయ సగటు 0.52 శాతం మాత్రమేనన్నారు. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఆరు రెట్లు అధికంగా నమోదైందన్నారు. 2024-25లో రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తులు, సేవల విలువ (జీఎస్‌వీఏ) రూ.2.77 లక్షల కోట్లకు చేరిందని, ఇంధన వినియోగంలో 15.6 శాతం, జీఎస్టీ వసూళ్లలో 9.8 శాతం, పేరోల్ ఎన్‌రోల్‌మెంట్స్‌లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదైందని తెలిపారు. తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ విషప్రచారం చేస్తున్నారని శ్రీధర్ బాబు మండిపడ్డారు. 'ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చాం. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు మొదలయ్యాయి. 51 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయ'ని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఓఆర్ఆర్ లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య తయారీ జోన్, ఆర్ఆర్ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. తాము అయిదేళ్ల కోసం ప్రణాళికలు రూపొందించడం లేదని. రాబోయే తరాల కోసం ఆలోచిస్తున్నామని శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా అడుగులు వేస్తున్నాం. గత 18 నెలల్లో కొత్తగా 15 వేల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఉత్తమ పారిశ్రామికవేత్తలకు మంత్రి పురస్కారాలు అందించారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవికుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి, ఐఐటీఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరంలో ప్రారంభానికి సిద్ధమైన మలబార్ గోల్డ్ పరిశ్రమ

3న మలబార్ గోల్డ్
పరిశ్రమ ప్రారంభం

- రేవంత్ లేదా దుద్దిళ్ల చేతులమీదుగా ఆవిష్కరణ
- 2వేల మందికి ఉపాధినిచ్చేలా కర్మాగారం


మహేశ్వరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో మరో భారీ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. రూ.700కోట్లతో కేసీ తండా పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ కర్మాగారం ఆవిష్కరణకు తుది ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించాలని యాజమాన్యం యోచిస్తోంది. అనివార్య కారణాల వల్ల ఆయన రాలేకపోతే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ పరిశ్రమలో 1,500 నుంచి 2 వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమలో నూటికి 20% మంది మహిళలకు వారి విద్యార్హతలు, ఆభరణాల తయారీలో నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. కాగా, తుక్కుగూడలోని ఈ-సిటీ, ఫ్యాబ్‌సిటీలో అనేక రకాల పరిశ్రమలు ఉండటంతో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కేసీ తండా పరిసర ప్రాంతంలో నూతనంగా ఏర్పాటైన ఎలక్ట్రానిక్ సిటీలో మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు.

ఎనిమిదేళ్ల చిన్నారి.. బహుముఖ ప్రజ్ఞాసిరి

» వేదికలపై ప్రసంగాలు, నృత్యం, గానం, ఐస్ స్కేటింగ్‌లో రాణింపు

» నిర్భీతిగా మాట్లాడటంలో ఇన్‌ఫ్లూయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లు! ఈ వయసు పిల్లలు ఆట బొమ్మలు ముందేసుకోవడమో.. ఆరుబయట తమ ఈడు పిల్లలతో ఆడుకోవడమో చేస్తారు! హైదరాబాద్‌కు చెందిన రుమైసా ఫాతిమా వయసూ ఎనిమిదేళ్లే. కానీ ఆ పాప బహిరంగ వేదికపై అద్భుత ప్రసంగాలు చేస్తోంది. కళ్లు తిప్పుకోలేని విధంగా డ్యాన్స్ చేయగలదు. వినసొంపుగా పాడనూ గలదు! ఐస్ స్కేటింగ్ లోనూ ఆ చిన్నారి చాంపియనే! నటనా రంగంలోనూ రాణించాలనుందంటోందిప్పుడు. మూడో తరగతి చదువుతున్న ఈ బాలికకు జీవిత లక్ష్యమ్మీద కచ్చితమైన ప్రణాళికలున్నాయి. 'పెద్దయ్యాక ఉద్యోగం చేయను. ఒకరి కింద పనిచేయడం నాకు ఇష్టం లేదు. నేనే ఓ కంపెనీ పెట్టి సీఈవోగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తాను. ఏ కంపెనీ పెట్టాలనేది 13-15 ఏళ్ల వయసులో నిర్ణయం తీసుకుంటాను' అని చెబుతోంది. తొణికిసలాడే ఆత్మవిశ్వాసం, బహుళ అంశాల్లో విశేష ప్రతిభ పరంగా దేశంలో తన ఈడు పిల్లల్లో అత్యంత ప్రతిభాశీలిగా రుమైసా గుర్తింపు పొందింది. 'తన లక్ష్యం ఏమిటంటే'.. అనే అంశమ్మీద చిన్నారి చేసిన ప్రసంగం ఆమెను 'ఇన్‌ఫ్లూయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు కల్పించింది. రుమైసాను పలకరించినప్పుడు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ఈనెల 23న ఇన్‌ఫ్లూయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తనను 'యంగ్ ఇన్ఫ్లూయెన్సర్ ఫియర్‌లెస్ ఆరేటర్'గా గుర్తించిందని వెల్లడించింది. తాను ఇంగ్లిష్, మ్యాథ్స్‌లో ఒలింపియాడ్ చాంపియన్‌గా నిలిచానని, పబ్లిక్ స్పీకింగ్ విభాగంలో ఇంటర్నేషనల్ స్టార్ కిడ్స్ అవార్డు అందుకున్నట్లు చెప్పింది. తాను ప్రస్తుతం ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, లంగర్‌హౌజ్ బ్రాంచ్‌లో చదువుతున్నానని.. అక్కడే పబ్లిక్ స్పీకింగ్ పట్ల తనకు ఆసక్తికలిగిందని వెల్లడించింది. తొలుత ఇంట్లో నిలువుటద్దం ముందు నిల్చుని ప్రసంగాలు చేస్తుండేదాన్నని, హావభావాలు, ఉచ్చారణ పరంగా లోపాలను తనకు తానే సరిచేసుకునేదాన్నని రుమైసా చెప్పింది. నాన్న.. మహమ్మద్ సైఫుద్దీన్ జీఐఎస్ ఇంజినీర్ అని, అమ్మ.. రుమాన్ ఫాతిమా సైకాలజిస్ట్ కౌన్సిలర్ అని వివరించింది.



తల్లిదండ్రులు రుమాన్ ఫాతిమా, మహ్మద్ సైఫుద్దీన్‌తో చిన్నారి రుమైసా ఫాతిమా

నాకు రాజకీయ అండదండలున్నాయ్

నువ్వు నన్నేమీ చేయలేవు.. స్వేచ్ఛకు పూర్ణచందర్ బెదిరింపులు

» వారం క్రితమే ఇద్దరు కలిసి అరుణాచలానికి పయనం

» అక్కడ స్వేచ్ఛ పెళ్లి ప్రస్తావన తేగా ససేమిరా అన్న పూర్ణచందర్

» మనస్తాపంతోనే స్వేచ్ఛ ఆత్మహత్య



హైదరాబాద్ సిటీ, చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): న్యూస్ యాంకర్ స్వేచ్ఛ బలవన్మరణం ఘటనలో తీవ్ర ఆరోపణలెదుర్కొంటున్న పూర్ణచందర్ నాయక్ గురించి సంచలన విషయాలు వెలుగులోకొస్తున్నాయి. పెళ్లి చేసుకుంటానని స్వేచ్ఛకు మాటిచ్చి.. ఒత్తిడి చేసి మరీ భర్త నుంచి ఆమె విడాకులు తీసుకునేలా చేసిన పూర్ణచందర్, తర్వాత ఆమె పెళ్లి ప్రస్తావన తెచ్చిన ప్రతిసారి ఏదో ఒకటి చెప్పి దాటవేసేవాడని తేలింది. ఇటీవల పెళ్లి చేసుకునేది లేదని ఆమెకు తేల్చిచెప్పి.. తనకు రాజకీయంగా అండదండలున్నాయని, తననేమీ చేయలేవంటూ స్వేచ్ఛను అతడు బెదిరించినట్లు సమాచారం. పెళ్లి చేసుకుంటానంటూ స్వేచ్ఛను పూర్ణచందర్ నమ్మించి మోసం చేయడంతోనే ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని విచారణలో తేలిందని ఏసీపీ చెప్పారు. శనివారం రాత్రి పూర్ణచందర్‌ను అదుపులోకి తీసుకున్న చిక్కడపల్లి పోలీసులు, కేసు దర్యాప్తులో భాగంగా నిందితుణ్ని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ప్రస్తుతం తాను మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వద్ద పనిచేస్తున్నానని పోలీసుల ఎదుట పూర్ణచందర్ వెల్లడించినట్లు తెలిసింది. స్వేచ్ఛతో తనకు ఉన్న రిలేషన్ గురించి సంతోష్‌కు కూడా తెలుసునని, అలాగే తనతో రాజకీయ సంబంధాలున్న వారిలో చాలామందికి తెలుసునని చెప్పినట్లు సమాచారం. కాగా స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకోవడానికి పూర్ణచందరే కారణమని గుర్తించిన పోలీసులు అతణ్ని అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు. కేసు వివరాలను ఏసీపీ రమేశ్ కుమార్ వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. పూర్ణచందర్ నాయక్ 15 ఏళ్లుగా స్వేచ్ఛతో కలిసి ఉంటున్నట్లు విచారణలో తేలింది. తాను పెళ్లి చేసుకుంటానని, భర్తకు విడాకులివ్వాలని స్వేచ్ఛపై పూర్ణచందర్ ఒత్తిడి చేయడంతోనే ఆమె విడాకులు ఇచ్చారని విచారణలో తేలింది. అలా స్వేచ్ఛను నమ్మించిన పూర్ణచందర్ ఆ తర్వాత ఎన్నోసార్లు ఆమె పెళ్లి ప్రస్తావన తెచ్చినా ఎప్పటికప్పుడు దాటవేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. తనను పెళ్లి చేసుకోకుండా ఏళ్లుగా మోసం చేస్తూ వస్తుండటంతో స్వేచ్ఛ తీవ్ర మానసిక వేదనకు గురైంది. స్వేచ్ఛ కూతురును కూడా పూర్ణచందర్ వేధింపులకు గురిచేసినట్లు స్వేచ్ఛ తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ బాలిక స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. పూర్ణచందర్ మంచివాడు కాదని, తనపట్ల కూడా అభ్యంతరకరంగా ప్రవర్తించేవాడని ఆ బాలిక వెల్లడించింది. అనంతరం పూర్ణచందర్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో లాయర్‌తో కలిసి వచ్చి పూర్ణచందర్ లొంగిపోయాడని ఏసీపీ వెల్లడించారు.

తనను పెళ్లి చేసుకునే ఉద్దేశం అతడికి లేదని తెలియడంతోనే..

ఏసీపీ వెల్లడించిన వివరాల ప్రకారం.. వారం క్రితం స్వేచ్ఛ, పూర్ణచందర్ కలిసి అరుణాచలం వెళ్లొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా స్వేచ్ఛ మరోసారి పెళ్లి ప్రస్తావన తెచ్చారు. ఇది ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదానికి దారితీసింది. పెళ్లి చేసుకునేందుకు పూర్ణచందర్ ఒప్పుకోకపోవడంతో పాటు.. తనను ఏమీ చేయలేవని, తనకు రాజకీయ అండదండలు ఉన్నాయని స్వేచ్ఛను బెదిరించినట్లు తెలిసింది. ఈ పరిణామంతో.. తనను పెళ్లి చేసుకునే ఉద్దేశం పూర్ణచందర్‌కు లేదని గ్రహించిన స్వేచ్ఛ.. తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఇది జరిగిన మూడు రోజుల్లోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా గత ఎన్నికల్లో పూర్ణచందర్ ఆదిలాబాద్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించినట్లు తెలిసింది.

బెయిల్ కోసం ప్రయత్నిస్తాం: లాయర్ శ్రవణ్

పూర్ణచందర్‌పై బీఎన్ఎస్ యాక్ట్ 69, 108తోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారని పూర్ణచందర్ న్యాయవాది శ్రవణ్ తెలిపారు. స్వేచ్ఛ ఆత్మహత్యతో నెలకొన్న ఈ విషాద సమయంలో భావోద్వేగాల నడుమ వ్యక్తమయ్యే అభిప్రాయాలు కేసును డిసైడ్ చేయలేవని ఆయన పేర్కొన్నారు. పూర్ణచందర్ తన అభిప్రాయాన్ని లేఖద్వారా పోలీసులకు అందించాడని, దానికే కట్టుబడి ఉన్నాడని లేఖలో పేర్కొన్న అంశాలే వాస్తవాలని పేర్కొన్నారు. స్వేచ్ఛ మొదటిరోజు, మూడోరోజు మాట్లాడిన దాంట్లో తేడాను గమనించాలన్నారు. ప్రస్తుతం పూర్ణచందర్ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నామని వివరించారు.

మహాటీవీపై దాడి ఘటన.. గెల్లు శ్రీనివాస్ సహా 12 మంది అరెస్టు

» పరారీలో మరో 11 మంది

» అరెస్టయిన వారందరికీ బెయిల్ మంజూరు

» గెల్లు శ్రీనివాస్, బాల్క సుమన్ తదితరులపై మరో కేసు

బంజారాహిల్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మహాటీవీ కార్యాలయంపై దాడి ఘటనలో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తోపాటు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కేటీఆర్‌పై ప్రసారం చేసిన కథనానికి నిరసనగా ఈ నెల 28న బీఆర్ఎస్వీ నాయకులు ఫిలింనగర్‌లోని మహాటీవీ కార్యాలయంపై దాడి చేసిన విషయం తెలిసిందే..! వీరు జరిపిన రాళ్ల దాడిలో కార్యాలయం ఫర్నిచర్, కార్లు ధ్వంసమయ్యాయి. సురేశ్ అనే ఉద్యోగి గాయపడ్డారు. చానల్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అజిత ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. మొత్తం 24 మంది నిందితులను గుర్తించారు. వీరిలో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తోపాటు మరో 12 మందిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. మరో 11 మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గెల్లు శ్రీనివాస్ సహా.. మిగతా వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా.. పోలీస్‌స్టేషన్‌లో గెల్లు శ్రీనివాస్, ఇతరులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్వీ నాయకులపై పోలీసులు ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టారని ఆరోపించారు. మరోవైపు గెల్లు శ్రీనివాస్ అరెస్టు సందర్భంగా.. తెలంగాణ భవన్ వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులు ఆరోపించారు. దీంతో గెల్లు శ్రీనివాస్, బాల్క సుమన్, మధుసూదనాచారి, తాత మధు, అభిలాష్‌రావు, మన్నె గోవర్ధన్‌రెడ్డి, సునీత, పావని తదితరులపై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. అటు మహాటీవీ కార్యాలయంపై దాడిని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ నేత డాక్టర్‌సింగిరెడ్డి రోహిన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నేత కాటూరి రమేశ్ తదితరులు ఖండించారు. ఆదివారం వారు మహాటీవీ కార్యాలయానికి చేరి, పరిస్థితిని పరిశీలించారు.

జయరాజ్‌కు దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం

» దాశరథి శత జయంత్యుత్సవాల వేళ జూలై 20న ప్రదానం



హైదరాబాద్ సిటీ, జూన్29(ఆంధ్రజ్యోతి): ప్రజా కవి, గాయకుడు జయరాజ్‌ను దాశరథి ప్రజా సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక ప్రకటించింది. దాశరథి శతజయంత్యుత్సవాల సందర్భంగా ఈ అవార్డును జూలై 20న ప్రదానం చేస్తామని నిర్వాహకులు గొర్రెపాటి నరసింహ ప్రసాద్ తెలిపారు. గత ఏడాది ఇదే పురస్కారాన్ని ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు అందించారు.

లోన్ యాప్‌లకు యువకుడు బలి

శంషాబాద్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లోన్ యాప్‌ల ఉచ్చులో చిక్కుకున్న ఓ యువకుడు అప్పుల పాలై, వాటిని తీర్చలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మున్సిపల్ పరిధిలోని ఊటపల్లికి చెందిన మహ్మద్ పరాజ్ ఖాన్(23) ప్రైవేటు ఉద్యోగి. పలు ఆన్‌లైన్ యాప్‌లలో రుణాలు తీసుకున్నాడు. వాటిని తిరిగి చెల్లించాలని యాప్‌ల నిర్వాహకులు ఒత్తిడి చేయడంతో మానసికంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తి చెందిన పరాజ్ ఖాన్ శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. రాత్రి పది గంటలైనా గదిలో ఎలాంటి చప్పుడు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి డోర్ పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు.

దేశమంతా విస్తరించిన నైరుతి

హిమాచల్‌లో భారీ వర్షాలు, వరదలకు 17 మంది మృతి

ఉత్తరాఖండ్‌కు రెడ్ అలర్ట్.. చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

ఝార్ఖండ్‌లో 162 మంది విద్యార్థులను కాపాడిన పోలీసులు

విశాఖపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండురోజుల్లో ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్ దిశగా పయనించనుంది. గుజరాత్‌లోని కచ్ పరిసరాల్లో ఏర్పడిన మరో అల్పపీడనం బలహీనపడిప్పటికీ.. రాజస్థాన్‌లో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. ఈ ప్రభావంతో రుతు పవనాలు చురుగ్గా మారి ఆదివారం పశ్చిమ రాజస్థాన్, పశ్చిమ యూపీ, హరియాణా, ఢిల్లీలోకి ప్రవేశించాయి. దీంతో దేశంలోని అన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించినట్టయింది.

ఏపీ, తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో వర్షాభావం

నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ 29 వరకు దేశ వ్యాప్తంగా 157.7 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 170.3 మి.మీ.గా నమోదైంది. సాధారణం కంటే వాయవ్య భారతంలో 37%, మధ్యభారతంలో 24% ఎక్కువ వర్షపాతం నమోదైంది. తూర్పు, ఈశాన్యభారతంలో 17% తక్కువగా, దక్షిణ భారతంలో 2% ఎక్కువగా వర్షపాతం నమోదైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, విదర్భ, మధ్య మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బిహార్, అస్సోం, మరికొన్ని ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. అనేక జిల్లాల్లో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ప్రత్యేకించి కుల్లు, ధర్మశాల ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు విధ్వంసం సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా 17 మంది మరణించినట్టు ప్రభుత్వం తెలిపింది. సుమారు 300 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా వేసింది. ఉత్తరాఖండ్‌లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం చార్‌ధామ్ యాత్రను 24 గంటలపాటు నిలిపివేసింది. వాతావరణం మెరుగయ్యే వరకు పర్యాటకులు కొండ ప్రాంతాల్లోకి వెళ్లొద్దని సూచించింది. ఉత్తర కాశీ జిల్లాలో మట్టిపెళ్లలు పడి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మరణించగా, ఏడుగురు గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చేపట్టారు. ఝార్ఖండ్‌లోని తూర్పు సింగ్భూమ్ జిల్లాలో భారీ వర్షాలకు ఒక ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాల భవనం నీటమునగడంతో శనివారం రాత్రి నుంచి సుమారు 162 మంది విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. వారిని ఉపాధ్యాయులు పాఠశాల పైకప్పు మీదికి తరలించారు. ఆదివారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందడంతో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో బోట్లలో వచ్చి తాళ్ల సాయంతో గ్రామస్థులతో కలిసి వారిని కాపాడారు.

వివాహేతర బంధం అంటగట్టారంటూ

ఇద్దరి బలవన్మరణం

» రిసార్ట్‌లో పురుగుల మందు తాగి ప్రాణం తీసుకున్న వైనం

» యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన

బీబీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సన్నిహితంగా ఉంటున్న తమ మధ్య వివాహేతర సంబంధం అంటగట్టి అనుమానిస్తున్నారంటూ ఇద్దరు కలిసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు శివారులోని ఓ రిసార్ట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. బీబీనగర్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన బంద బాలసుధాకర్ (39), పసల సుష్మిల (34) సమీప బంధువులు కావడంతో చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి ఉండేవారు. వివాహితుడైన బాలసుధాకర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. సుష్మిలకు కూడా వివాహమైంది. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఆమె.. భర్తతో కలిసి రామాంతపూర్ కేసీఆర్‌నగర్‌లో ఉంటున్నారు. బాలసుధాకర్, సుష్మిల వారి కుటుంబాలతో కలిసి ఒకే ప్రాంతంలో నివాసం ఉంటుండగా.. కొన్ని రోజులుగా వీరు సన్నిహితంగా ఉంటుండటంతో ఇరు కుటుంబాల వారు వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉందని అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో సుష్మిలకు భర్తతో, బాలసుధాకర్‌కు భార్యతో మనస్పర్ధలు ఎక్కువయ్యాయి. దీంతో కొన్ని రోజులుగా వీరిద్దరూ మానసిక క్షోభకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న కొండమడుగు శివారులోని ఓ రిసార్ట్‌లో వారు గదిని అద్దెకు తీసుకున్నారు. ఇద్దరూ సెల్ఫీ వీడియోలు తీసి తమ బంధువులకు పంపారు. దాంతో ఇరువురి కుటుంబ సభ్యులు ఆందోళనతో ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వీడియోలు పంపిన సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా కొండమడుగు శివారులోని రిసార్ట్‌లో బాలసుధాకర్, సుష్మిల ఉన్నట్లు గుర్తించి బీబీనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్సై రమేశ్ సిబ్బందితో కలిసి రిసార్ట్‌కు చేరుకుని వారున్న గదికి వెళ్లి చూడగా అప్పటికే పురుగుల మందు తాగి వారు విగత జీవులుగా పడి ఉన్నారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

క్రిటికల్ మినరల్ మైనింగ్‌లో దూసుకెళ్దాం

2024-31 వరకు నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్

» ఐదేళ్లలో 16 వేల కోట్ల వ్యయం.. రూ.18 వేల కోట్ల పెట్టుబడులు

» ప్రభుత్వ, ప్రైవేటుకు అవకాశాలు.. అన్ని రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు

» నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేశీయ రక్షణ రంగానికి సంక్లిష్ట ఖనిజాల(క్రిటికల్ మినరల్) మైనింగ్ కీలకం. ఈ విషయంలో అంతర్జాతీయ దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాం. రక్షణ రంగ అవసరాలకు విదేశాలపై ఆధారపడే బదులు, స్వయంగా మైనింగ్ రంగంలో అభివృద్ధి చెందాలని కేంద్రం నిర్ణయించింది. కేవలం ఐదేళ్ల వ్యవధిలో దేశీయ అవసరాల్లో కనీసం 10 శాతం లక్ష్యాలను చేరుకునేలా మైనింగ్ రంగంలో కార్యాచరణ ప్రకటించింది. దేశ రక్షణ అవసరాలకు ఈ ఖనిజాలను వినియోగించే లక్ష్యంతోపాటు.. అంతర్జాతీయంగా పెద్ద ఎగుమతిదారుగా నిలవాలన్న సంకల్పంతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఈ మిషన్ అమలు కానుంది. ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మిషన్‌లో 1200లకు పైగా మైనింగ్ ప్రాజెక్టులు తీసుకురావాలన్నది కేంద్రం సంకల్పం. దేశీయంగా మరో 100 బ్లాక్‌లలో సంక్లిష్ట మినరల్ మైనింగ్ ప్రారంభించాలని భావిస్తోంది. ఈ ఐదేళ్ల లక్ష్య సాధనకు రూ.16 వేల కోట్లను వ్యయం చేయనుంది. కేంద్రం ప్రకటించిన మిషన్ వల్ల దేశీయ, అంతర్జాతీయంగా రూ.18 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనావేస్తోంది. సంక్లిష్ట మినరల్ మైనింగ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ఆసక్తి ఉన్న 24కు పైగా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపాలని భావిస్తోంది. అలాగే.. అటామిక్ మినరల్స్ పరిధిలో ఉన్న ఆరు ఖనిజాల మైనింగ్‌లో పాల్గొనేందుకు ప్రైవేటుకు అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది.

క్రిటికల్ మినరల్స్ అంటే?

ఖనిజాల్లో సాధారణమైనవాటితో పాటు అసాధారణమైనవి, సంక్లిష్టమైనవి కూడా ఉంటాయి. అంటే, మైనింగ్ చేసే సమయంలో వచ్చే సమస్యలు, ఆ తర్వాత వాటిని తరలించే సందర్భంలో వచ్చే సవాళ్లను దృష్టిలో పెట్టుకొని కొన్ని ఖనిజాలను క్రిటికల్ మినరల్స్(సంక్లిష్టమైనవి)గా పరిగణించి గుర్తించారు. అందులో 30 మినరల్స్ ఉన్నాయి. వీటిలో 14 ఖనిజాలను అటామిక్ మినరల్స్‌గా కేంద్రం ఎంఎండీఆర్ చట్టం-1957 ద్వారా నోటిఫై చేసింది. న్యూక్లియర్‌కి సంబంధించిన మినరల్స్ కూడా వీటిలో ఉండటంతో ఇప్పటి దాకా ప్రభుత్వ రంగ సంస్థలే ఆ ఖనిజాల మైనింగ్ చేయాలన్న నిబంధన ఉంది. అదానీ లాంటి కంపెనీలకు జగన్ ప్రభుత్వం బీచ్‌శాండ్ మినరల్స్ మైనింగ్ ఇద్దామని గతంలో ప్రయత్నించినా కేంద్రం నిబంధనల కారణంగా అది కార్యరూపం దాల్చలేదు. సంక్లిష్టమైన మినరల్స్‌లో 18 దేశీయ రక్షణ రంగ అవసరాలను తీర్చేవి ఉన్నాయి. వీటిని వ్యూహాత్మక ఖనిజాలుగా పరిగణిస్తున్నారు. వాటి వివరాలను ఇప్పటి దాకా కేంద్రం వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలే మైనింగ్ చేసి రక్షణ రంగ అవసరాలను భర్తీ చేస్తున్నాయి. అయితే, ఇటీవలికాలంలో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఇజ్రాయిల్- పాలస్తీనా, ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం సందర్భంగా తెరపైకి వచ్చిన అధునాతన శత్రు విధ్వంసక బాంబులు, క్షిపణలు వంటివి ప్రభుత్వ తక్షణ అవసరాలను గుర్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే.. రక్షణ రంగంలో ఉన్న ఉత్పాదక కొరతలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్వయం సమృద్ధి సాధించలని కేంద్రం భావిస్తోంది. దీనికి అత్యంత కీలకమైన వనరు సంక్లిష్ట మినరల్స్. ఇప్పటిదాకా వీటిని యూరప్, అమెరికా, రష్యా, ఆఫ్రికా తదితర దేశాల నుంచి దిగుమతి చేస్తున్నారు. లిథియం, బెరీలియం, టైటానియం, నోబియం, జిర్కోనియం, కాండిమమ్, గ్లకోనైట్, గ్రాఫైట్, నికిల్, యూరేనియంతో సంబంధం లేని పాస్ఫేట్, ఇంకా, అరుదైన ఖనిజాలు వీటిలో ఉన్నాయి. కొన్నింటిని బీచ్‌శాండ్ మైనింగ్ ద్వారా ప్రాసెస్ చేసి సేకరించవచ్చు. మరి కొన్నింటిని మైనింగ్ ద్వారానే తీసుకోవాలి. అయితే, దేశీయంగా బీచ్‌శాండ్ మైనింగ్ చాలా తక్కువగా ఉంది. ఇప్పుడు భవిష్యత్ అవసరాలు, సరికొత్త సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సాంకేతికత, పారిశ్రామిక ఉత్పాదకాలను పొందేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అందులో భాగంగా.. ఐదేళ్ల కాల వ్యవధి(2024-25 నుంచి 2030-31) సంక్లిష్ట ఖనిజాల మైనింగ్‌లో దేశీయ అవసరాల్లో కనీసం 10 శాతం డిమాండ్‌ను అందుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా రక్షణ రంగ అవసరాలను కనీసం 50 శాతం తీర్చగలిగేలా నేషనల్ క్రిటికల్ మినరల్ మైనింగ్ మిషన్(ఎన్‌సీఎంఎం)ను ఖరారు చేసింది. ఇటీవల ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ భేటీలో ఈ మిషన్ కు ఆమోదం తెలిపారు. ఆ వెంటనే కేంద్ర గనుల శాఖ.. మిషన్ అమలుపై నోటిఫికేషన్ జారీ చేసింది.

అంతర్జాతీయ మైనింగ్‌లో..

ఈ మిషన్ ద్వారా వీలైనంత మేరకు దేశీయంగా మైనింగ్ ప్రాజెక్టులు చేస్తూనే, అంతర్జాతీయ ప్రాజెక్టులు దక్కించుకోవాలని కేంద్రం రాష్ట్రాలకు, సంస్థలకు దిశానిర్దేశం చేసింది. అంటే, ఏపీఎండీసీ, ఎన్ఎండీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు క్రిటికల్ మినరల్స్ లభ్యత బాగా ఉన్న దేశాల్లో ఐదేళ్లలో 50 నుంచి 100 కాంట్రాక్టులు పొందాలి. దీనికి అవసరమైన రాయితీలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్రం రూ.1,600 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. మరో రూ.1,500 కోట్ల రాయితీలను సిద్ధం చేస్తోంది. ప్రైవేటు సంస్థలు కూడా అంతర్జాతీయంగా క్రిటికల్ మినరల్ మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని కేంద్రం స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ మైనింగ్ ప్రాజెక్టుల ద్వారా దేశానికి వచ్చే ఖనిజాలపై దిగుమతి సుంకాలు ఉండవని కేంద్రం స్పష్టం చేసింది. దీంతోపాటు ఇతరత్రా ఎలాంటి సుంకాలు కూడా ఉండవని పేర్కొంది. ఈ క్రమంలో కేంద్రం రూ.4 వేల కోట్ల సబ్సిడీ ప్యాకేజీలను సిద్ధం చేసింది.

2029లో గెలుపే లక్ష్యం

ఇందుకోసం కఠినంగా ఉంటా


» అవసరమైతే ఎవరినైనా వదులుకుంటా

» ప్రజామద్దతు ఉన్నవారికే టికెట్లు

» నిర్మొహమాటంగా నిర్ణయాలు

» ఏపీ సీఎం చంద్రబాబు

» ప్రజాప్రతినిధులతో విస్తృత భేటీ



అమరావతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'మన టార్గెట్ 2029.. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో నిర్మొహమాటంగా ఉంటా. కఠినంగా ఉంటా.. అవసరమైతే ఎవరినైనా వదులుకోవడానికీ సిద్ధం..' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలకు స్పష్టమైన సందేశమిచ్చారు. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని, పనితీరు బాగోలేని వారికి గుడ్‌బై చెప్పేస్తానని తేల్చిచెప్పారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏడు గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. సమావేశం ప్రారంభంలో మాట్లాడిన చంద్రబాబు.. ముగింపులో సుమారు 2 గంటలు ప్రసంగించారు. ముగింపు సమావేశంలో తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు చురకలు అంటించారు. నాన్ సీరియస్‌గా ఉన్న ఎమ్మెల్యేలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనిచేయకుండా సలహాలకే పరిమితమయ్యే ఎమ్మెల్యేలు భవిష్యత్ నాయకులుగా ఉండలేరని స్పష్టం చేశారు. ప్రజల మద్దతు ఉన్న వారికే పదవులైనా, టికెట్లయినా ఇస్తామని స్పష్టం చేశారు. తాను కఠినంగా ఉంటేనే పార్టీకి మంచిదన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుతోపాటు పాలనపై ఎప్పటికప్పుడు సర్వేల రూపంలో సమాచారం తెప్పించుకుంటున్నానని.. అన్ని సర్వేలను విశ్లేషించి, వాస్తవాలను బేరీజు వేస్తున్నానని సీఎం చెప్పారు. 'ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నాను. వారు చెప్పింది ఓపిగ్గా వింటాను. వారు చెప్పిన మాటల్లో ఆచరించదగినవి ఉంటే అమలు చేస్తా. వారిలో ఏమైనా తప్పులుంటే వారికీ చెబుతాను. సరిచేసుకోవడానికి సమయం ఇస్తా. సలహాలు.. సూచనలు ఇస్తా.. పని తీరు మార్చుకుంటే సరి.. లేకపోతే అంతే సంగతులు. నిర్మొహమాటంగా నిర్ణయం తీసుకుంటా. ఇది ఎమ్మెల్యేలకే కాదు. నా సొంత నియోజకవర్గంలో ఎవరు తప్పుచేసినా పక్కన పెడతా' అని తెలిపారు. ఎంత పనిచేశామనే కాదు.. దానితోపాటు ఎలా చేస్తున్నామనేది కూడా కీలకమన్నారు. 'కొందరు ఎంతో పనిచేస్తారు. కానీ మంచి పేరు రాదు. ఇంకొందరు పెద్దగా పనిచేయకున్నా ప్రజల్లో మంచి పేరు ఉంటుంది' అని చెప్పారు.. 'డబ్బులు పంచి ఎన్నికల్లో గెలుస్తామనే ధీమా వద్దు.. 2024 ఎన్నికల్లో మనకంటే ఎక్కువ ఖర్చు పెట్టిన వాళ్లకు కేవలం 11 సీట్లే వచ్చాయి. డబ్బులతో ఎన్నికల్లో గెలువలేమనే విషయం స్పష్టమైంది' అని చెప్పారు.

లోకేశ్‌లా పనిచేయాలి..

'మంచి నాయకులకే ప్రజల్లో గుర్తింపు, గౌరవం ఉంటుంది. దీనికి ఉదాహరణ లోకేశ్. 2019లో విశాఖపట్నం నుంచి పోటీ చేయాలని ఆయనకు సూచించాను. లేదు.. మంగళగిరిలో పార్టీ ఎప్పుడూ గెలువలేదు.. అక్కడి నుంచే పోటీ చేస్తానని చెప్పారు. నెల ముందు నియోజకవర్గానికి వెళ్లారు. తక్కువ మెజారిటీతో ఓడిపోయారు. అయినా ఆ తర్వాత ఐదేళ్లు అక్కడే కష్టపడి పని చేసి 2024లో రాష్ట్రంలోనే మూడో అతిపెద్ద మెజారిటీతో విజయం సాధించారు. అదీ ఆయనకు ఉన్న పట్టుదల. గెలిచిన తర్వాత కూడా నియోజకవర్గాన్ని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. తొలిసారి గెలిచిన మిగతావారు కూడా ఇలాగే పనిచేయాలి. నేను 9వసారి ఎమ్మెల్యే అయ్యాను. మొదటిసారి గెలిచిన వాళ్లు కూడా వచ్చి ఏం చేయాలో నాకు చెబుతున్నారు' అని చంద్రబాబు ఆక్షేపించారు. విస్తృతస్థాయి సమావేశానికి కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు మొత్తం కలిపి.. 56 మంది గైర్హాజరు కావడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పార్టీ కార్యక్రమాల కంటే ఇతర కార్యక్రమాలు ఎక్కువయ్యాయా? పార్టీ సమావేశాలకే రానివారు ఇక నియోజకవర్గాల్లో ఏం తిరుగుతారు.. ఏం పనిచేస్తారు' అని మండిపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.